ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 12.07.2025 | సంపుటి : 11 సంచిక : 354 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# తెలంగాణలో పవర్‌షేరింగ్ లేదు

## కలసికట్టుగా పనిచేస్తున్నాం



- యూనివర్సిటీల్లో పెత్తనానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది
- ఓయూ రోహిత్ వేములను అడ్డుకున్న వారికి అందలం
- బెదిరింపులకు పాల్పడ్డ రామచంద్రరావుకు బీజేపీ పదవి
- దళితులు, ఆదివాసీలను అణగదొక్కేవారికి పదవులు
- ఢిల్లీ పర్యటనలో డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ(జనంసాక్షి):కర్ణాటక తరహాలో తమ ప్రభుత్వంలో పవర్ షేరింగ్ అంటూ ఏమీ లేదని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అందరం కలిసి టీం వర్క్ చేస్తున్నామని చెప్పారు. దిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు."భారత రాష్ట్ర సమితి నేతల మాటలు మితిమీరి పోయాయి. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు.. జనాల్లోకి వెళ్లడం లేదు. రూ. రెండు లక్షలు దాటిన వారికి రుణమాఫీ చేయొద్దన్నది మా ప్రభుత్వ విధాన నిర్ణయం. రేషన్‌కార్డు ఆధారంగానే రుణమాఫీ చేశాం. సన్నం బియ్యం సక్సెస్ అయ్యింది. గతంలా పక్కదారి పట్టడం లేదు. ఉచిత బస్సుకు మహిళల నుంచి మంచి స్పందన ఉంది. మరో 3వేల బస్సులు కొనుగోలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఫోర్త్ సిటీ పనులు జరుగుతున్నాయి. మూసీ సుందరీకరణ ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతుంది. గాంధీ ఘాట్ వరకు సుందరీకరణ జరిగి తీరుతుంది. దీనికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. రీజినల్ రింగ్ రోడ్డు కూడా వస్తుంది. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చే అవకాశం లేదు. సిగాచీ ప్రమాదంపై విచారణకు ఆదేశించాం. ఇటీవల జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కేసీ వేణుగోపాల్ ప్రభుత్వ తీరుపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు" అని భట్టి విక్రమార్క తెలిపారు. హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన రామచందర్ రావును తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. తెలం గాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుపై డిప్యూటీ– సీఎం భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మిగతా 2లో..

> *కర్ణాటక తరహాలో తెలంగాణలో ప్రభుత్వంలో పవర్ షేరింగ్ అంటూ ఏమీ లేదు. బీఆర్ఎస్ నేతల మాటలు మితిమీరి పోయాయి. కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు.. జనాల్లోకి వెళ్లడం లేదు. రేషన్‌కార్డు ఆధారంగానే రుణమాఫీ చేశాం. సన్నం బియ్యం సక్సెస్ అయ్యింది. రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన రామచందర్ రావును బీజేపీ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారు? దీనిపై అధిష్టానం పునరాలోచన చేయాలి. రాజ్యాంగం కల్పించిన హక్కులను భాజపా ప్రభుత్వం హరిస్తోంది*
> *– డిప్యూటీ సీఎం భట్టి*



## ముఖ్యమంత్రికి అభినందనల వెల్లువ

### స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించినందుకు బీసీ సంఘాల కృతజ్ఞతలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంఘాల నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారిలో మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, బీసీ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు

## 14 న ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ
## ఆహార భద్రతకు సోనియాగాంధీ పెద్దపీట



- కార్డు దారులందరికీ సన్న బియ్యం.. జనాభాలో 84% మందికి లబ్ధి
- ధాన్యం దిగుబడిలో దేశంలో కెల్లా తెలంగాణ ఆల్‌టైం రికార్డ్
- భారత ప్రభుత్వం చేసిన ప్రకటననే ఇందుకు నిదర్శనం
- దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ అమలు జరిగింది కాంగ్రెస్ హయంలోనే
- హామీ మేరకు చట్టబద్ధంగా బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాం
- యావత్ దేశంలోనే మొట్టమొదటి సారిగా కులగణన నిర్వహించాం
- ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను పరిశీలించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యపేట|ప్రతినిధి(జనంసాక్షి):రాష్ట్రంలో అర్హులైన నిరుపేద లందరికీ తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయనున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించా రు.తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఒక్కోక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందించనున్నట్లు ఆయన వెల్లడించారురాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెల్ల రేషన్ కార్డుల పంపిణీని సూర్యపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి లో ఈ నెల 14 న మిగతా 2లో..

# రాజాసింగ్ రాజీనామా ఆమోదం



### పార్టీ సిద్ధాంతాలకు ఆయన కట్టుబడలేదు
### భాజపా అధిష్టానం నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి):గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను భాజపా అధిష్ఠానం ఆమోదించింది. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు రాజాసింగ్ రాజీనామాను ఆమోదించామని, ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటన విడుదల చేశారు.భాజపా రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక మిగతా 2లో..

## కల్తీకల్లు ఘటనలో కిడ్నీ బాధితులు పెరుగుతున్నారు

### 9 మందికి డయాలసిస్ చేస్తున్నాం.. హెల్త్ బులిటెన్ విడుదల చేసిన నిమ్స్
### బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోపై సస్పెన్షన్ వేటు



హైదరాబాద్(జనంసాక్షి):కల్తీకల్లు కారణంగా చికిత్స పొందుతున్న బాధితుల హెల్త్ బులిటెన్‌ను నిమ్స్ వైద్యులు విడుదల చేశారు. చికిత్స పొందుతున్న వారిలో కిడ్నీ బాధితులు సంఖ్య పెరుగుతోందని.. కిడ్నీ పనిచేయని వారి సంఖ్య 9 మందికి మిగతా 2లో..

### బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్..

# రైల్‌రోకో వాయిదా

### ఇది తెలంగాణ బీసీ బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నాం : కవిత



హైదరాబాద్(జనంసాక్షి): బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని తెలంగాణ బీసీ బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. అంతకుముందు బంజారాహిల్స్ లోని తన నివాసం నుంచి జాగృతి శ్రేణులతో ర్యాలీగా లోయర్ ట్యాంక్‌బండ్‌కు వెళ్లారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి ఆమె నివాళులర్పించారు."స్థానిక మిగతా 2లో..

# నీకేం సంబంధం?

### మేం చేసిన దానికి నువ్వు క్రెడిట్ తీసుకోవడమేంటీ?
### కవిత ప్రకటనలపై పీసీసీచీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఎద్దేవా
### సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మరోసారి నిరూపితమైందని వ్యాఖ్య



హైదరాబాద్(జనంసాక్షి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని టీ–పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ నిర్ణయం వెనక ఖర్గే, రాహుల్‌గాంధీ ఆశయం ఉందని చెప్పారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మరోసారి నిరూపి తమైందని చెప్పారు. బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేస్తోందని వివరించారు. అయితే బీసీ రిజర్వేషన్లకు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవితకు ఏం సంబంధం అని ప్రశ్నించారు. మేం చేసిన దానికి ఆమె క్రెడిట్ మిగతా 2లో..

## ఎట్టకేలకు భారత్‌లోకి అడుగుపెట్టిన టెస్లా




కంపెనీ షోరూం ప్రారంభం ఈ వారంలోనే..

### మరీ మోదీ సంగతేంది?





# 75 ఏళ్లకు రిటైర్‌మెంట్..

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్
### ఆ వ్యాఖ్యలు మోదీని ఉద్దేశించినవే..: కాంగ్రెస్

న్యూఢిల్లీ(జనంసాక్షి):రాజకీయ నేతలు ఎవరైనా సరే 75 ఏళ్లు రాగానే రిటైర్మెంట్ తీసుకోవాలంటూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశ మవుతున్నాయి దీనిపై కాంగ్రెస్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా రంగంలోకి దిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించే మోహన్ భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని విమర్శలు గుప్పించింది. మోహన్ భాగవత్ గత బుధవారంనాడు నాగపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. రిటైర్మెంట్‌పై మరాఠా సామ్రాజ్య మొదటి పీష్వా, సంఘ్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే అభిప్రాయాన్ని ప్రస్తావించారు. 75 ఏళ్ల శాలువా మన మీద కప్పారంటే.. మిగతా 2లో..

### తెలంగాణ ఇంజనీరింగ్ కళాశాలలకు

# హైకోర్టులో చుక్కెదురు

హైదరాబాద్(జనంసాక్షి): ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలకు హైకోర్టులో చుక్కెదురైంది. ఫీజులు పెంచుకునేందుకు అనుమతివ్వాలని ఆయా కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఫీజుల పెంపు కోసం ఇచ్చిన వినతులపై టీఏఎఫ్ఆర్‌సీ (తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ) నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆరువారాల్లో నిర్ణయం తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించింది. ప్రభుత్వం తీసుకునే తుది నిర్ణయంపైనే ఫీజుల పెంపు ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది.ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపునకు సంబంధించి ఏటా ఓ తంతు నడుస్తోందంటూ టీఏఎఫ్ఆర్‌సీ మిగతా 2లో..



### బందీలను విడుదల చేయకపోతే హమాస్‌ను

# అంతం చేస్తాం

## నెతన్యాహు స్ట్రాంగ్ వార్నింగ్



టెలీ అవీవ్(జనంసాక్షి): ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విషయమై ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. 60 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణలో భాగంగా బందీల విడుదల సక్రమంగా జరగని పక్షంలో హమాస్‌ను సమూలంగా నాశనం చేస్తామని నెతన్యాహు హెచ్చరించారు.ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తాజాగా హమాస్ చెరలో ఉన్న బందీల కుటుంబ సభ్యులను కలిశారు. అనంతరం, నెతన్యాహు మాట్లాడుతూ.. హమాస్ చెరలో ఉన్న బందీలను కచ్చితంగా తిరిగి తీసుకువస్తాం. తాత్కాలిక కాల్పుల విరమణ సమయంలో సాధ్యమైనంత వరకు బందీలను విడిపిస్తాం. హమాస్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం ఇంకా ముగియలేదు. తాత్కాలిక కాల్పుల విరమణ మా ప్రభుత్వ అంతిమ లక్ష్యాన్ని సాధించకుండా నిరోధించింది. ఇరాన్‌పై చారిత్రాత్మక విజయం తర్వాత హమాస్ విషయమై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాతో చర్చలు జరిపారు. అందులో భాగంగానే ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు అంగీకరించింది. చర్చల తర్వాత 60 రోజుల కాల్పుల విరమణకు సిద్ధంగా మిగతా 2లో..

## మళ్లీ రెచ్చిపోయిన హౌతీలు

ఎర్రసముద్రంలో నౌకపై దాడిచేసి ముంచేసిన రెబల్స్



### ఐడీ కార్డు చూసి

# కాల్చేశారు!

- ప్రయాణికుల్ని అపహరించిన హత్యచేసిన దుండగులు
- బలూచిస్తాన్‌లో మరో ఘోరం..
- బలూచ్ వేర్పాటువాద మిలిటెంట్ గ్రూపులేనని అనుమానం



ఇస్లామాబాద్(జనంసాక్షి): బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఘోరం జరిగింది. బస్సుల్లో వెళుతున్న కొందరిని తుపాకులతో వచ్చిన దుండగులు అపహరించారు. ఆపై సమీపంలోని కొండల్లోకి తీసుకెళ్లి ఐడీ కార్డులు తనిఖీలు చేసి మరీ కిరాతకంగా కాల్చిచంపారు. బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో దారుణం చోటు చేసుకుంది. గురువారం సాయంత్రం పలు బస్సుల నుంచి ప్రయాణికులను తుపాకులు చూపించి బెదిరించి ఎత్తుకెళ్లారు. సమీపంలోని కొండ ప్రాంతాల్లోకి తీసుకెళ్లి ఐడీ కార్డులు పరిశీలించి కాల్చి మిగతా 2లో..



### కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్

# తప్పుల తడక

### మరోసారి కాళేశ్వరం కమిషన్ ఎదుట హరీశ్ హాజరు

హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ముందు విచారణకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుక్రవారం హాజరయ్యారు. బీఆర్‌కే భవన్‌లో మరోసారి పీసీ ఘోష్ కమిషన్‌ను హరీష్‌రావు కలిశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మరింత అదనపు సమాచారాన్ని ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఆరుసార్లు కేబినెట్ ఆమోదం పొందిందని గుర్తుచేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. అసెంబ్లీలో కూడా మూడుసార్లు ఆమోదించారని మాజీ మంత్రి మిగతా 2లో..

# బీజేపీ రామచంద్రా.. నోరు తెరవరేం..?

### భద్రాద్రి ఇవోపై దాడిపై బీజేపీ స్పదించకపోవడం దుర్మార్గం: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):భద్రాద్రి ఇవోపై దాడిని కెటిఆర్ ఖండించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పురుషోత్త పట్నంలో ఉన్న భద్రాద్రి దేవస్థాన భూముల్లో జరుగుతున్న ఆక్రమణలను, పక్కా భవన నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఆలయ మిగతా 2లో..



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
12.07.2025

# కల్తీకల్లు ఘటనలో కిడ్నీ బాధితులు పెరుగుతున్నారు

చేరిందని తెలిపారు. మరో ఇద్దరు బాధితులకు కూడా డయాలసిస్ చేయాల్సి పరిస్థితి ఉన్నట్లు- వెల్లడించారు. చికిత్స పొందుతున్న వారిలో 11 మంది ఆరోగ్యంగా నిలకడగా ఉన్నట్లు- వైద్యులు వెల్లడించారు. ఇంకో 12 మందిని అబ్జర్వేషన్లో ఉంచి చికిత్స అందిస్తున్నామని బులిటెన్లో పేర్కొన్నారు. కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితుల సంఖ్య 44కి చేరింది. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు- తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ని(గురువారం) తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌లో 31 మంది, గాంధీ ఆస్పత్రిలో ఆరుగురు చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరో ఏడుగురికి చికిత్స అందిస్తున్నట్లు- చెప్పారు. మంగళవారం కూకట్‌పల్లి పరిధిలోని పలు కల్లు కాంపౌండ్‌లలో కల్తీకల్లు తాగి పలువురు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

**కల్తీ కల్లు ఘటన.. బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోపై సస్పెన్షన్ వేటు**

హైదరాబాద్: కూకట్‌పల్లి పరిధిలో జరిగిన కల్తీ కల్లు వ్యవహారంలో ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంది. బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో వేణుకుమార్‌పై సస్పెన్షన్ వేటు వేసింది.డీటీఎఫ్ నర్సిరెడ్డి, ఏఈఎస్ మాధవయ్య, ఈఎస్ ఫయాజ్, ఏఈఎస్ జీవన్‌కిరణ్ పాత్రపై దర్యాప్తు కొనసాగిస్తోంది. కల్తీ కల్లు ఘటనలో ఇప్పటివరకు ఐదుగురు మృతి చెందారు. మొత్తం 37 మంది అస్వస్థతకు గురయ్యారు. నిమ్స్ ఆసుపత్రిలో 31 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో 27 మంది ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కూకట్‌పల్లిలోని పలు కల్లు దుకాణాల నుంచి అధికారులు నమూనాలను సేకరించారు. ఈ క్రమంలో వాటిని ల్యాబ్‌లో పరీక్షించగా.. కాంపౌండ్‌లలో సేకరించిన కల్లులో కెమికల్స్ ఉన్నట్లు గుర్తించారు. రసాయనాలు కలిపిన కల్లు వల్లే అస్వస్థతకు గురైనట్లు ఎక్సైజ్ అధికారులు నిర్ధరించారు.

# 75 ఏళ్లకు రిటైర్‌మెంట్

మనం ఒక నిర్దిష్ట వయసుకు చేరుకున్నామని అర్థం. అప్పుడు మనం పక్కకు జరిగి.. వేరే వాళ్లు పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని పింగ్లే వ్యాఖ్యలను భాగవత్ గుర్తుచేశారు. ఇది కాస్తా నెట్టింట చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది సెప్టెంబరుతో ప్రధాని మోదీకి 75 ఏళ్లు నిండుతాయి. ఆయనను ఉద్దేశించే భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. పలు అవార్డులు తీసుకొని, విదేశీ పర్యటనలు ముగించుకుని వస్తున్న ప్రధాని మోదీకి ఎలాంటి స్వాగతం లభించిందో చూడండి..! ఈ ఏడాది సెప్టెంబరు 17 నాటికి మోదీకి 75 ఏళ్లు పూర్తవు తాయనే విషయాన్ని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ గుర్తుచేస్తున్నారు. కానీ, భాగవత్‌కు కూడా ఈ ఏడాది సెప్టెంబర్ 11 నాటికి 75 ఏళ్లు నిండుతాయనే విషయాన్ని మోదీ గుర్తు చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ పోస్ట్ పెట్టారు. 'ఒక్క దెబ్బకు.. రెండు పిట్టలు' అంటూ ఎద్దేవా చేశారు. ఈ ఏడాది మార్చిలో ప్రధాని మోదీ నాగ్‌పుర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే మోదీ రి-టైర్మెంట్ గురించి చర్చ మొదలైంది. అప్పట్లో దీనిపై శివసేన (యూబీటీ-) ఎంపీ సంజయ్‌రౌత్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత 10, 11 ఏళ్లలో మోదీ ఎన్నడూ ఈ కార్యాలయానికి రాలేదు. దేశ నాయకత్వంలో మార్పు రావాలని ఆర్‌ఎస్‌ఎస్ కోరుకుంటోంది. ఆ సంస్థ నియమాల ప్రకారం మోదీ కూడా రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించాలని సంఘ్ భావిస్తోందని నాడు రౌత్ వ్యాఖ్యానించారు. అయితే, దీన్ని భాజపా కొట్టిపారేసింది. ఇప్పుడు భాగవత్ వ్యాఖ్యలతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది.

# ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్

### అద్భుతాన్ని ఆవిష్కరించిన జపాన్

### సెకనకు 1.02 పెటాబిట్స్ స్పీడ్‌తో పనిచేసే సామర్థ్యం

**టోక్యో(జనంసాక్షి):** ఆవిష్కరణలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ఆవిష్కరణలు వస్తాయో చెప్పలేని పరిస్థితి. ఎఐతో ప్రపంచం అంతా మారిందనుకుంటున్న వేళ అన్నింటా అద్భుతాలు ఆవిష్కృతం అవుతున్నాయి. బుల్లెట్ రైళ్లు, అత్యుత్తమ ఎయిర్‌పోర్టులు చూస్తున్నాం. రోబోలతో మొత్తం ప్రపంచ గతి మారుతోంది. వైద్యరంగంలోనూ ఆవిష్కరణలుకొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. ఈ క్రమంలో అధునాతన సదుపాయాల్లో ముందుండే జపాన్ ఇప్పుడు మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్‌ను ఆ దేశ పరిశోధకులు అభివృద్ధి చేశారు. సెకనకు 1.02 పెటాబిట్స్ స్పీడ్‌తో పనిచేసే ఈ ఇంటర్నెట్‌తో.. కేవలం రెప్పపాటులో నెట్‌ఫ్లిక్స్ లైబ్రరీలో ఉన్న డేటా మొత్తాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నిరూపించారు. అమెరికాలో ఉన్న సగటు ఇంటర్నెట్ కనెక్షన్ల కంటే ఇది 3.5 మిలియన్ రెట్ల వేగవంతమైనదని అంటున్నారు. ప్రత్యేక ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సాయంతో జపాన్ ఈ వేగవంతమైన నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసింది. ఇందుకోసం పరిశోధకులు ట్రాన్స్‌మిటర్లు, రిసీవర్లు, 19 లూపింగ్ సర్క్యూట్లను వినియోగించారు. ఈ లూపింగ్ సర్క్యూట్ ఒక్కోటి 86.1 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ లూప్స్ నుంచి సిగ్నళ్లు వెళ్లి డేటాను అందిస్తాయి. దీని సాయంతోనే సెకనుకు 1808 కిలోమీటర్ల దూరం వరకు డేటాను పంపించేందుకు వీలు లభిస్తుందని తెలిపింది. ప్రస్తుతానికి ఈ ఇంటర్నెట్ గృహ వినియోగదారులకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కన్పించట్లేదు. ప్రభుత్వాలు, డేటా సెంటర్ ఆపరేటర్లు, టెలికాం సంస్థలు దీన్ని వినియోగించు కునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 6జీ నెట్‌వర్క్, తర్వాతితరం సముద్రగర్భ కేబుళ్లకు ఈ జపాన్ ఇంటర్నెట్ ఓ మోడల్‌గా నిలవనుంది. జపాన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. .

# ఒక్క ఆధామైనా చూపండి..

### ఆపరేషన్ సింధూర్‌పై విదేశీ మీడియా దుష్ప్రచారం

### లక్ష్యాలను ఛేదించడంలో భారత్ అసమాన ప్రతిభ కనబరిచింది.

### ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవంలో అజిత్ ధోవల్



**చెన్నై(జనంసాక్షి):** ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ చేసిన దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందని విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాక్ దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందనే విషయాన్ని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాలు విసిరారు. చెన్నైలోని ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవంలో డోభాల్ మాట్లాడుతూ, పాకిస్థాన్ లోపలకు వెళ్లి విజయవంతంగా 9 ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడులు జరిపిందని, ఒక్క టార్గెట్ కూడా మిస్ కాలేదని చెప్పారు. ఉగ్రవాదులు ఎక్కడున్నారనే కచ్చితమైన సమాచారంతో ఈ దాడులు జరిపామని చెప్పారు. భారతదేశ ఇంటెలిజెన్స్, కార్యాచరణ కచ్చితత్వాన్ని ఈ మిషన్ చాటిచెప్పిందని అన్నారు. కేవలం 32 నిమిషాల్లో ఈ ఆపరేషన్ పూర్తి చేసినట్టు- చెప్పారు. భారతదేశ వ్యూహాత్మక ఆపరేషన్ విశ్వసనీయతను ప్రశ్నించే వారు భారత్ వైపు నష్టం జరిగిందని చెప్పే ఒక్క ఫోటోనైనా చూపించాలని సవాలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్‌లోని ఉగ్రస్థావరాలను ఎలా ధ్వంసం చేసిందనే విషయాలను వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించి దాయాదికి ముచ్చెమటలు పట్టించామని అన్నారు. సోషల్ మీడియాలో విదేశీ వార్తాసంస్థలు ఆపరేషన్ సిందూర్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలను డోభాల్ కొట్టిపడేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ అది చేసింది.. ఇది చేసిందంటూ విదేశీ మీడియా అసత్య కథనాలు ప్రసారం చేసిందని మండిపడ్డారు.

# తెలంగాణలో పవర్ షేరింగ్ లేదు

శుక్రవారం నాడు దిల్లీలో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను భాజపా ప్రభుత్వం హరిస్తోందన్నారు. ఆయనకు ఆ పదవి ఇవ్వడంపై బీజేపీ అధిష్టానం పునరాలోచన చేయాలన్నారు. రోహిత్ వేముల మరణానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుండా పదవులు ఇస్తున్న బీజేపీ.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరుపుతోందన్నారు. త్వరలోనే తెలంగాణలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని.. న్యాయశాఖ దీనిపై పనిచేస్తోందని చెప్పారు. రోహిత్ ఆత్మహత్యకు కారణమైన బండారు దత్తాత్రేయకు గవర్నర్ పదవి, ఏబీవీపీ నాయకుడు సుశీల్ కుమార్‌కు ఢిల్లీ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, రామచందర్ రావుకు తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఇచ్చారన్నారు. 2016లో యూనివర్శిటీ- యాజమాన్యం రోహిత్ వేములపై చర్యలు తీసుకునేలా యూనివర్శిటీ- వద్ద రామచందర్‌రావు ఆందోళన చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం దళితులు భయపడేలా బీజేపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దళితులు, ఆదివాసీలకు దేశంలో గౌరవం లేకుండా బీజేపీ ప్రవర్తిస్తోందని విమర్శించారు. దేశంలో దళితులు, ఆదివాసీలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారికి బీజేపీ పదవులు ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరమన్నారు ఉపముఖ్యమంత్రి. రాజ్యాంగానికి వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఫైర్ అయ్యారు. దేశంలో వందల ఏళ్లుగా వెనుకబడిన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయని తెలిపారు. దేశంలో ఉన్న ప్రతీ పౌరుడి హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని డిప్యూటీ- సీఎం స్పష్టం చేశారు. అలాగే రోహిత్ వేముల చనిపోతే కనీసం ఆ కుటు-ంబాన్ని కేసీఆర్ పరామర్శించలేదని వ్యాఖ్యలు చేశారు. ఏ రోజు కూడా యూనివర్శిటీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తోందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. యూనివర్సిటీలపై పెత్తనాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఏబీవీపీ, ఏఎస్ఏ మధ్య ఘర్షణ జరిగినప్పుడు భాజపా నేత రామచందర్‌రావు హెచ్‌సీయూకి వెళ్లి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. రోహిత్ వేములతో పాటు మరో నలుగురు విద్యార్థులను యూనివర్సిటీ- నుంచి సస్పెండ్ చేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో ఈఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దళిత, ఆదివాసీలను భాజపా చిన్నచూపు చూస్తోంది. కేంద్ర ప్రభుత్వం చర్యలను మేధావులు వ్యతిరేకించాలని భట్టి విక్రమార్క అన్నారు. 2017లో హైదరాబాద్ యూనివర్సిటీలో జరిగిన రోహిత్ వేముల ఆత్మహత్య దేశాన్ని కుదిపేసిందని గుర్తు చేస్తూ.. ఆ ఘటన వెనుక ఉన్న అసలు బాధ్యులను దేశ ప్రజలముందు నిలబడే చర్యనే అతి పెద్ద ప్రశ్నగా ఆయన అభివర్ణించారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 2017 లో రోహిత్ వేముల ఆత్మహత్య దేశాన్ని షేక్ చేసింది. సూసైడ్ లేఖలో రోహిత్ వేముల రాసిన అంశాలను పరిశీలిస్తే, ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటాలను అడ్డుకున్న ఏబీవీపీ సుశీల్ కుమార్కు డిల్లీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు ఇచ్చారు. ఇది దేశంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలు గమనించాలని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ విద్యార్థులపై రామచందర్ రావు ఒత్తిడి తెచ్చారని.. వీసీపై ఒత్తిడి తెచ్చిన వ్యక్తిని బీజేపీ ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడమంటే, దళితులను ఇబ్బంది పెట్టిన వారికి బహుమతి ఇచ్చినట్లే అని వ్యాఖ్యానించారు. అలాగే రోహిత్ వేముల కేసు పునర్విచారణకు కోర్టును ఆశ్రయించామని, త్వరలోనే తెలంగాణలో 'రోహిత్ వేముల చట్టం' తీసుకురావాలని సంకల్పించినట్లు- అయన వ్యాఖ్యానించారు.

# రాజాసింగ్ రాజీనామా ఆమోదం

విషయంలో అలిగిన రాజాసింగ్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ అందజేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ వేసేందుకు తనను అనుమతించలేదని, అందుకే రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు.
నా చివరి శ్వాస వరకు హిందుత్వం కోసమే పనిచేస్తా: రాజాసింగ్
హిందుత్వం కోసమే తన చివరి శ్వాస వరకు పనిచేస్తానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఇటీవల భాజపాకు ఆయన చేసిన రాజీనామాను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం ఆమోదించారు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు."హిందుత్వ భావజాలంతో దేశానికి, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో సరిగ్గా 11 ఏళ్ల క్రితం భాజపాలో చేరాను. పార్టీ నన్ను నమ్మి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు గోషామహల్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నా రాజీనామాను ఇవాళ భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదించారు. తెలంగాణలో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ రాత్రీపగలు పనిచేస్తున్న లక్షలాది భాజపా కార్యకర్తల బాధను నేను అధిష్ఠానానికి తెలియజేయలేకపోవచ్చు. ఏ పదవి, అధికారం, వ్యక్తిగత లబ్ధి కోసమో రాజీనామా చేయలేదు. నేను హిందుత్వం కోసమే పుట్టాను.. చివరి శ్వాస వరకు దానికోసమే పనిచేస్తాను" అని రాజాసింగ్ పేర్కొన్నారు.

# ఐడీ కార్డు చూసి కాల్చేశారు!

చంపారు. శరీరం నిండా తుట్లతో 9 మంది ప్రయాణికుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని అధికారి ఒకరు ప్రకటించారు. ఘటనకు కారకులు ఎవరనేది ఇంకా స్పష్టత రాలేదు. పాక్ ప్రభుత్వం ఈ దాడిని ఖండించింది. దుండగుల కోసం భద్రతాల బలగాలు రంగంలోకి దిగాయి.ఇదిలా ఉంటే.. బలూచ్ వేర్పాటువాద మిలిటెంట్ గ్రూపులు గతంలో ఇలాంటి ఘాతుకాలకు పాల్పడ్డాయి. ఇందులో బలోచ్ లిబరేషన్ ఆర్మీ అత్యంత బలమైంది. అఫ్గనిస్తాన్-ఇరాన్ సరిహద్దుల గుండా ఇది స్థావరాలను ఏర్పాటు చేసుకుని ఇది తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. అయితే పాక్ ప్రభుత్వం ఈ సంస్థపై నిషేధం విధించింది.బలూచిస్తాన్ అత్యంత అరుదైన ఖనిజాలకు మూలం. పాకిస్తాన్ ప్రభుత్వం ఈ వనరులను పంజాబ్ ప్రావిన్స్‌కు దోచిపెడుతోందని బలూచ్ లిబరేషన్ ఆర్మీ ఆరోపిస్తూ వస్తోంది. ఈ క్రమంలో పంజాబ్ ప్రావిన్స్ నుంచి వాహనాలను, ప్రజలను లక్ష్యంగా చేసుకుంటూ దాడులు చేస్తూ వస్తోంది.గత కొన్ని నెలలుగా బలూచిస్తాన్‌లో వరుస హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చిలో జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు హైజాక్ గురైంది. బొలాన్ జిల్లాలో బలూచ్ లిబరేషన్ ఆర్మీ సుమారు 500 మంది ప్రయాణికులతో వెళ్తున్న రైలును హైజాక్ చేసింది. అందులో 30 మందిని కాల్చి చంపింది. మరో 215 మందిని బందీలుగా తీసుకుంది. బందీలలో ఎక్కువ మంది సైనికులు, పోలీసు, యాంటీ టెర్రరిజం ఫోర్స్ సభ్యులుగా ఉండడం గమనార్హం. పాక్ సైన్యం హుటాహుటిన రంగంలోకి దిగి.. హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా దాడులు జరిపింది.

# తెలంగాణలో ఇంజినీరింగ్ కళాశాలలకు హైకోర్టులో చుక్కెదురు

తీరుపై నిన్న విచారణ సందర్భంగా హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏటా కాలేజీలు ఫీజుల పెంపునకు ప్రతిపాదనలు చేయడం, కౌన్సెలింగ్ పూర్తయి అడ్మిషన్లు చేపట్టేదాకా దానిపై టీఏఎఫ్‌ఆర్‌సీ సిఫారసులు చేయకపోవడం, కాలేజీలు కోర్టును ఆశ్రయించడం అన్నది ఏటా కొనసాగుతోందని వ్యాఖ్యానించింది. ఇంజినీరింగ్ కాలేజీల్లో గత బ్లాక్ పీరియడ్ ఫీజులే 2025-26కు వర్తిస్తాయంటూ జారీ చేసిన జీవో 26ను సవాలు చేస్తూ గురునానక్, గోకరాజు రంగరాజు కాలేజీలతో పాటు సుమారు 11 కళాశాలలు గురువారం లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి మూడేళ్లకోసారి కాలేజీలను పరిశీలించి పెంపుపై నిర్ణయం తీసుకోలేకపోవడం సరికాదన్నారు. డిసెంబరులో ప్రతిపాదనలు వస్తే జూన్ వరకు నిర్ణయం తీసుకోలేదని, 15 మంది సభ్యులదాకా ఉన్న కమిటీ నిర్ణయంలో జాప్యమెందుకన్నారు. టీఏఎఫ్‌ఆర్‌సీపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదని, కౌన్సెలింగ్ పూర్తయ్యాక పిటిషన్‌లు వేయడమేమిటని కాలేజీలను ప్రశ్నించారు.కళాశాలల తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ గత డిసెంబరులో ప్రతిపాదనలు సమర్పించామని, మార్చిలో కమిటీ సమావేశమైందని, అందులో తమ ప్రతిపాదనలు ఆమోదించిందని, దీనికి రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలే నిదర్శనమన్నారు. టీఏఎఫ్‌ఆర్‌సీ తరఫు సీనియర్ న్యాయవాది పి.శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ కాలేజీలు 5,000 పేజీలతో ప్రతిపాదనలు సమర్పించాయని, వీటిని పరిశీలించడానికి సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో గత బ్లాక్ పీరియడ్‌లో వసూలు చేసిన మొత్తాన్నే ఈ ఏడాదికి సిఫారసు చేసిందన్నారు. ప్రభుత్వం తరఫున రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ కాలేజీల్లో కొన్ని గత ఏడాది కంటే సుమారు 70 నుంచి 90 శాతం పెంపు అడుగుతున్నాయన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# బీజేపీ రామచంద్రా.. నోరు తెరవరేం..?

కార్యనిర్వహణ అధికారిణి పైనా, 30 మంది సిబ్బందిపైనా ఆ గ్రామస్తులు మంగళవారం కర్రలతో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఈ ఘటనపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. భద్రాద్రి ఆలయ ఈవోపై దాడి జరిగిన ఘటనపై బీజేపీ రాచమంద్రా నోరు తెరవరేం..? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాములోరి భూములను ఆక్రమించు కుంటోంటే మాటైనా మాట్లాడరేం? మీ భాగస్వామి ప్రభుత్వం చెరలో ఉన్నాయని వదిలేస్తున్నారా? లేక ఈసారి మొత్తం భద్రాద్రినే గంపగుత్తగా వారి చేతిలో పెడదామనుకుంటున్నారా? ఓట్ల కోసమే చేసే మీ రామజపాలను, సీట్ల కోసమే వేసే మీ దొంగ నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. మోదీతో మాట్లాడతారో, మీ దోస్తు దగ్గర మోకరిల్లుతారో మీ ఇష్టం.. భద్రాద్రిని కాపాడండి.. ఆక్రమణల చెర నుంచి విడిపించండి అని కేటీఆర్ పేర్కొన్నారు.

### బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్..

# రైల్ రోకో వాయిదా

ఎన్నికలకు ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో ఈనెల 17న చేపట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నాం. అయితే మాకు కొన్ని అనుమానాలు కూడా ఉన్నాయి. ఆర్డినెన్స్ ఇచ్చి వెంటనే రిజర్వేషన్లు అమలు చేయగలిగితే అధికారంలోకి వచ్చిన 18 నెలలు ఎందుకు ఆగారు? రాజకీయ లబ్ధి కోసమే అలా చేశారని మేం భావిస్తున్నాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తున్నారు.ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇబ్బంది పడుతున్నారు. రాజ్యాంగ సవరణ జరిగితే బీసీలకు రాజకీయంగా హక్కులు లభిస్తాయి. విద్య, ఉద్యోగాల గురించి కూడా ప్రభుత్వం చెప్పాలి. కేంద్రంలో అధికారంలో ఉన్నందున భాజపా అనుకుంటే ఒకే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వగలదు.. కానీ ఇవ్వడం లేదు. దోషమంతా కాంగ్రెస్‌పై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారేమో. ప్రజలు గమనిస్తున్నారు. బీసీ బిల్లును షెడ్యూల్-9లో పెట్టాలి. దీనికోసం బీసీ బీసీ బిల్లును షెడ్యూల్-9లో పెట్టాలి. దీనికోసం బీసీబిడ్డ, కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలి. ఆర్డినెన్స్ తీసుకొస్తామని చెప్పినందున ఈ వారం రోజులు ప్రభుత్వ కార్యాచరణను గమనిస్తాం. దీనిపై ముందుకెళ్లకపోతే రైల్ రోకో చేపడతాం" అని కవిత అన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు

ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న విషయం విదితమే ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క లతో పాటు మంత్రివర్గ సహచరులు హాజరుకానున్న తెల్ల రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం జరుప తల పెట్టిన బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించడంతో పాటు తిరుమలగిరి కేంద్రంలో జరిగిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశంలో సహచర మంత్రి ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన తెల్ల రేషన్ కార్డుల పంపిణీ తో రాష్ట్ర జనాభాలో 84% మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుందన్నారు తెల్ల రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ ఓ చారిత్రాత్మక నేపద్యం అని అది తనకు జన్మనిచ్చిన తుంగతుర్తి నియోజకవర్గం నుండే ప్రారంభం కావడం మహదానందంగా ఉందన్నారు.అంతకు ముందు ఉగాది పర్వదినం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అయిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హుజుర్నగర్ నుండి కావడం తనకు గొప్ప అనుభూతిని మిగిల్చిందన్నారు. నిరుపేదలకు ఆహార భద్రత కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీకే దక్కుతుందన్నారు.సోనియాగాంధీ చేసిన చట్టాన్ని రాష్ట్రంలో జరిగిన ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు.అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డుల మంజూరు తో పాటు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోలు నాణ్యమైన సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేయడానికి మించిన సంతృప్తి ఏముంటుందని ఆయన ప్రశ్నించారు.నిరుపేదలకు కడుపు నిండా అన్నం పెట్టాలి అన్నదే ప్రభుత్వ సంకల్పమని అందుకు నాణ్యమైన సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయడమే తగిన నిర్ణయమని ఆలోచించి అమలులోకి తెచ్చా మన్నారు.ధాన్యం దిగుబడిలో తెలంగాణా రాష్ట్రం యావత్ భారతదేశం లోనే సింహ బాగంలో నిలిచిందన్నారు.భారత ప్రభుత్వం చేసిన ప్రకటననే ఇందుకు నిదర్శనమన్నారు. అధికారం లోకి వచ్చిన మీదట సాగు అయిన వానాకాలం, యాసంగి పంటలతో ముందెన్నడూ లేని రీతిలో 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావడం రికార్డ్ సృష్టించిందన్నారు.దశాబ్దాలుగా డిమాండ్ ఉన్న ఎస్సి వర్గీకరణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మీదటనే అమలులోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.ఎస్సి వర్గీకరణ కోసం ముఖ్యమంత్రి నియమించిన మంత్రివర్గ ఉప సంఘానికి తానే చైర్మన్ గా ఉండడం నాకు సంతృప్తినిచ్చిందని ఆయన చెప్పారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మీదటనే బలహీన వర్గాల నుండి వస్తున్న కులగణన డిమాండ్ కు పచ్చ జెండా ఊపి పారదర్శకంగా పూర్తి చేశామన్నారు.యావత్ భారత దేశంలోనే కులగణన చేపట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణయో అని అది కుడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రమని ఆయన పేర్కొన్నారు.ఎప్పుడో 1930 ప్రాంతంలో కులగణన నిర్వహించారని 100 ఏళ్ల మీదట మొట్ట మొదటిసారిగా తెలంగాణా రాష్ట్రంలో నిర్వహించామని ఆ ఘనత ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదే నని ఆయన కొనియాడారు.అటువంటి కులగణన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘానికి కుడా తాను చైర్మన్ గా వ్యహారించాడం తన రాజకీయ జీవితంలో ఓ మైలురాయిగా మిగిలి పోతుందన్నారు.బలహీన వర్గాల కు 42%రిజర్వేషన్లకు చట్ట బద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంద న్నారు.ఆర్డినెన్స్ ద్వారా అమలులోకి తీసుక రావడంతో పాటు రేపటి స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్లు అమలు పరుస్తామన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో భోనగిరి లోకసభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామ్యూల్,యం.ఎల్.సి శంకర్ నాయక్,డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్,సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సభ సక్సెస్ కు సన్నద్ధం కావాలి**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెల్ల రేషన్ కార్డుల పంపిణీతో పాటు తిరుమలగిరి లో జరుప తల పెట్టిన ముఖ్యమంత్రి సభ విజయవంతానికి లీడర్,క్యాడర్ సన్నద్ధం కావాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు,గ్రామ కమిటీ అధ్యక్షులు ఇతర బాధ్యులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పాల్గొననున్న సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి పరామర్శ
అస్వస్థతకు గురైన మాజీ మంత్రి సీనియర్ కాంగ్రెస్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డిని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,లక్ష్మణ్ కుమార్ లు శుక్రవారం పరామర్శించారు తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోనీ ఆయన స్వగృహంలో ఉన్న దామోదర్ రెడ్డి ఇంటికి చేరుకున్న మంత్రులు ఆయనను పరామర్శించారు

# నీకేం సంబంధం?

తీసుకోవడమేంటని, కవితను చూసి జనాలు నవ్వుకుంటున్నారని అన్నారు. ఆమె ఉద్యమిస్తే మేం ఆర్డినెన్స్ తెచ్చామా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పదేళ్లు ఏం వెలగబెట్టారని ఆమె బీసీ పాట పాడుతున్నారు. బీసీ రిజర్వేషన్లు రాహుల్ అజెండా, రేవంత్ నిబద్ధత అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కవితకు రాజకీయంగా ఎక్కడా చోటు లేకపోవడంతో డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు కాంగ్రెస్ మేలు చేస్తే కవిత ఎందుకు రంగులు పులుముకుంటుందని ప్రశ్నించారు. కవితకు, భవితకు సంబంధం లేదని అన్నారు. రాహుల్ గాంధీ ఆదేశం మేరకు రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలను వంచించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు తగ్గించిన ఘనత కేసీఆర్ దని అన్నార. కేసీఆర్ కూతురైన కవిత పండుగ చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ నేతలు ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా ఇచ్చిన హామీని నిలబెట్టు-కుందని చెప్పారు. బీసీల విషయంలో చిత్తశుద్ధితో ముందుకు వెళ్తున్నట్టు- చెప్పారు.

# కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తప్పుల తడక

హరీశ్‌రావు తెలిపారు. ఈ వివరాలన్నీ డాక్యుమెంట్లతో సహా కమిషన్‌కు ఇచ్చానని చెప్పుకొచ్చారు. మిగిలిన వివరాలు రేవంత్ ప్రభుత్వం దగ్గరే ఉన్నాయని వివరించారు. కమిషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ అసత్యాలేనని ఆరోపించారు. 50 ఏళ్లుగా కాంగ్రెస్‌వి అబద్ధాలు, మోసాలేనని విమర్శించారు. కృష్ణా జలాల్లో 299 టీ-ఎంసీల కేటాయింపు కాంగ్రెస్ పాపమేనని మండిపడ్డారు. సెక్షన్ 3 కింద నీళ్ల పంపిణీ చేయాలని అప్పుడే అడిగారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రజా భవన్‌లో కాళేశ్వరంపై ఇచ్చింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కాదు...కవర్ పాయింట్ ప్రజెంటేషన్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానం, అహంకారం బయటపెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లు చేసిన ద్రోహాన్ని కప్పిపుచ్చుకోవడానికి కవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని దెప్పిపొడిచారు. 299 టీ-ఎంసీల పేరుతో శాశత్వ ఒప్పందమని సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఆనాడే 299 టీ-ఎంసీలకి ఉమ్మడి రాష్ట్రంలో ఒప్పందం చేశారని గుర్తుచేశారు. శాశ్వత ఒప్పందం కేసీఆర్ చేసి ఉంటే...సెక్షన్ 3 కోసం పోరాటం ఎందుకు చేస్తారని నిలదీశారు.సెక్షన్-3 విషయంలో ఉమా భారతి, గడ్కరీనీ కలిశారని చెప్పుకొచ్చారు మాజీ మంత్రి హరీష్‌రావు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేసి సెక్షన్-3ని కేసీఆర్ సాధించారని మాజీ మంత్రి హరీష్‌రావు ఉద్ఘాటించారు. బోర్డు తాత్కాలిక నీటి వినియోగం కోసం ఒప్పందం చేస్తుందని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సైతం 299 టీఎంసీలకు సంతకాలు చేశారని మరి మీరు ఎలా చేశారని ప్రశ్నించారు. కృష్ణా నదిలో తెలంగాణ వాటాను రేవంత్ ప్రభుత్వం సాధించాలని కోరారు. రేవంత్ రెడ్డి అజ్ఞానంతో మాట్లాడారని.. తాను చాలా బాధతో చెబుతున్నానని అన్నారు. కృష్ణానదిని దోచుకో అని రేవంత్ రెడ్డి చంద్రబాబుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానాన్ని తాను బయటపెట్టిన తర్వాత ఆయన మాట మార్చారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎలాగూ తెలియదు... ఉత్తమ్ కుమార్ రెడ్డికి కూడా తెలీదు అంటే బాధేస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు చెప్పినట్లు- కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందా అని ప్రశ్నించారు. 573 టీ-ఎంసీలు చాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పడం అజ్ఞానమని

# బందీలను విడుదల చేయకపోతే హమాస్‌ను అంతం చేస్తాం

ఉన్నామని తెలిపాం.గాజాలో పూర్తి నిరాయుధీకరణ, సైనికీకరణను తొలగించడం, బంధీలను విడుదల చేయడం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. 60 రోజుల సమయంలో ఇవన్నీ జరిగితే ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేయదు. ఒకవేళ హమాస్ కనుక మళ్లీ కాల్పులు విరమణను ఉల్లంఘిస్తే.. ఈసారి ఇజ్రాయెల్ దాడులు మరింత బలంగా ఉంటాయి. హమాస్‌ను లేకుండా చేసి ఇజ్రాయెల్ భద్రతను పునరుద్ధరించే వరకు మేము ఆగము' అని హెచ్చరించారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఇజ్రాయెల్‌కు చాలా గొప్ప విజయాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ యోధుల ధైర్యసాహసాలకు ధన్యవాదాలు. మేము హమాస్ సైనిక సామర్థ్యాలను చాలావరకు నిర్వీర్యం చేశాం. హమాస్ విషయంలో మేము దౌత్యం, సైనిక శక్తి కలయిక ద్వారా పనిచేయాలనుకుంటున్నాము. దౌత్యం పని చేయకపోతే సైనిక శక్తి తమ పని తాము చూసుకుంటుందని హెచ్చరించారు. ఏదో ఒక విధంగా ఇజ్రాయెల్ అనుకున్న లక్ష్యాన్ని చేరుతుందని స్పష్టం చేశారు.

# పర్యావరణహిత నిర్మాణాలే పరిష్కారం

**2024-25లో నిర్మాణ రంగం వృద్ధి రేటు 11.97 శాతం**

**కాంపోజిట్, స్టీల్ స్ట్రక్చర్స్ నిర్మాణాలకు ప్రోత్సాహం**

**యువ సివిల్ ఇంజినీర్లు వినూత్నంగా ఆలోచించాలి**

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**




**మంథని, (జనంసాక్షి) :** ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల తదితర ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని, ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాలని సివిల్ ఇంజనీర్లను కోరారు. మూడున్నరేళ్లలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్(హైదరాబాద్) సెంటర్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో "నెక్స్ట్ - జెన్ హైరైస్ బిల్డింగ్స్ (అడ్వాన్స్మెంట్స్ ఇన్ కాంపోజిట్, స్టీల్ స్ట్రక్చర్స్)" అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సును ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. "2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చింది. రాష్ట్ర సేవల స్థూల విలువ జోడింపులో ఇది 24.9 శాతం. ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనం" అని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. "ఇటీవల కాలంలో దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో హైరైస్ భవన నిర్మాణాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. మన హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాల సంఖ్య 200 కంటే ఎక్కువగా ఉంది. మరో 250 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఇలాంటి తరుణంలోనే మనం పర్యావరణహితంగా అడుగులు వేయాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ తరహా భారీ భవనాల నిర్మాణంలో రీన్‌ఫోర్స్ సిమెంట్ కాంక్రీట్(ఆర్ సీసీ) నిర్మాణాలకు బదులుగా కాంపోజిట్, స్టీల్ స్ట్రక్చర్స్ కు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది" అని అభిప్రాయపడ్డారు. "కంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ వినియోగం వల్ల భవనం పూర్తయ్యేందుకు పట్టే సమయం 40 శాతం, భారం 30 శాతం తగ్గుతుంది. భూకంపాలను సమర్థవంతంగా తట్టుకోగలవు. నిర్మాణ సమయంలో వెలువడే కాలుష్యం తగ్గుతుంది. మరీ ముఖ్యంగా... పునర్వినియోగం వల్ల సర్క్యులర్ ఎకానమీ వృద్ధి చెందుతుంది" అని చెప్పారు. "తెలంగాణలో ఆవిష్కరణలు కేవలం మాటలకే పరిమితం కావడం లేదు. ఆచరణలోనూ చూపిస్తున్నాము. భావితరాల కోసం కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ నిర్మాణాలను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నాం. ఇందుకు నగరవాసులకు అందుబాటులోకి తెచ్చిన స్టీల్ వంతెనలు గొప్ప ఉదాహరణ. నిర్మాణ రంగంలో ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్ వినియోగం, బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా నిర్మాణ అనుమతుల్లో వేగం, జవాబుదారీతనం, విశ్వాసాన్ని పెంపొందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నారు. కాంపోజిట్ స్టీల్ హై-రైజ్ డిజైన్‌పై జాతీయస్థాయిలో ఒకే రకమైన మార్గదర్శకాలు(కోడ్) తెచ్చేలా కేంద్రం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)తో కలిసి పని చేస్తామన్నారు. సాంప్రదాయబద్ధంగా కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్నంగా ఆలోచించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు మా ప్రభుత్వం ఎల్లపుడూ సిద్ధంగా ఉంటుందని యువ సివిల్ ఇంజనీర్లకు సూచించారు. స్మార్ట్ నగరాలు, స్థిరమైన గృహనిర్మాణం, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరుస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ప్రతినిధులు ఎస్ జీఎస్ మూర్తి, మహేందర్ రెడ్డి, శేషాద్రి, కాశీరాం, నర్మదా, రమేష్, భీం రావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై రాజకీయం చేయెద్దు

**రిజర్వేషన్లను ఎవరు అడ్డుకోవాలని చూసినా వదిలిపెట్టం**

**క్యాబినెట్ తీర్మానం బీసీల పోరాట విజయమే**

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో బీసీల విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని, 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి బీసీలకు ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. క్యాబినెట్ నిర్ణయానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి,పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,బిసి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకాటి శ్రీహరి,ఇతర క్యాబినెట్ మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ సంఘాల నేతలు కుల సంఘాలు మేధావులతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచాలని 18 నెలలుగా అనేక రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని, గల్లీ నుండి ఢిల్లీ వరకు నిర్వహించిన పోరాట ఫలితమే ఈ 42 శాతం రిజర్వేషన్ల ప్రకటన, ఇది ముమ్మాటికి బీసీల విజయమని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం మొదటగా తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలని, ఆ తర్వాత బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశామని తమ డిమాండ్ ను గౌరవించి తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లును రాష్ట్ర గవర్నర్ ద్వారా గత ఏప్రిల్ 11వ తేదీన రాష్ట్రపతికి పంపిందని, రాష్ట్రం ప్రభుత్వం పంపించిన బిల్లు జూలై 11 నాటికి మూడు నెలలు పూర్తయిందని అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో కనీసం స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు ముగించాలని కోర్టు తీర్పులు ఇంకొక వైపు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పంపించిన బీసీ బిల్లును కనీసం పరిగణలోకి తీసుకోకపోవడంతో ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం తనకున్నటువంటి సర్వ అధికారాలు ఉపయోగించి గత ప్రభుత్వం చేసిన పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి ప్రత్యేక పరిస్థితుల దృశ్య బీసీ రిజర్వేషన్ల 42 శాతం పెంచడానికి ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చి గవర్నర్ ద్వారా ఆమోదించుకొని బీసీ రిజర్వేషన్లు కచ్చితంగా 42 శాతం అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని ఇలాంటి సమయంలో రాజకీయ పార్టీలు బీసీల రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బీసీ రిజర్వేషన్లను రాజకీయంగా బలిపీఠం ఎక్కించకుండా బీసీ రిజర్వేషన్ల పెంపుకు అన్ని పార్టీలు సహకరించాలని శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లను ఆట కెక్కించాలని చూస్తే ఎవరిని కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని న్యాయస్థానాలను అడ్డుపెట్టుకొని కొంతమంది కోవర్టుల ద్వారా లేనిపోని న్యాయపరమైన చికాకులు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తే కచ్చితంగా వారికి తగిన బుద్ధి చెప్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

## అక్కల మరణంతో తమ్ముడు ఆత్మహత్య

**పర్వతగిరి జులై 11 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో కొంకపాక గ్రామానికి చెందిన యువకుడు పస్తం ప్రభాకర్(27) నెల రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని నేడు ఎంజీఎం ఆసుపత్రిలో మరణించాడు వివరాల్లోకి వెళితే ప్రభాకర్ కు 9 మంది సోదరీమణులు అందులో గత రెండు సంవత్సరాలగా ఇద్దరు అక్కలు చనిపోగా వారి దాన సంస్కారాలకు మరియు వారి పిల్లల పోషణార్థం గ్రామంలో మరియు కులస్తుల వద్ద ఇతర గ్రామాల్లో అప్పులు చేశాడు. తిరిగి అప్పులు చెల్లిస్తూ చెల్లించాలన్న భయంతో మనస్థాపానికి గురై మద్యానికి బానిసై నెలరోజుల క్రితం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు యువకుడిని వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా ఈరోజు చనిపోయినట్లు,పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# కల్తీకల్లు బాధితుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి ఆరా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కల్తీ కల్లు తాగి నిమ్స్, గాంధీ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి, నిమ్స్, గాంధీ డాక్టర్లు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పేషెంట్ల కండీషన్‌ను డాక్టర్లు మంత్రికి వివరించారు. ప్రస్తుతం నిమ్స్‌లో 35 మంది, గాంధీలో 18 మంది చికిత్స పొందుతున్నారని అధికారులు మంత్రికి తెలిపారు. నిమ్స్‌లో ఉన్న 35 మందిలో ఐదుగురిని ఈరోజు డిశ్చార్జ్ చేస్తున్నామని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప వెల్లడించారు. మిగిలిన 30 మందికి చికిత్స కొనసాగిస్తున్నామని వివరించారు. గాంధీలో ఉన్న 18 మందిలో నలుగురు డయాలసిస్‌పై ఉన్నారని డాక్టర్లు తెలిపారు. మిగిలిన 14 మంది పేషెంట్ల కండీషన్ స్టేబుల్‌గా ఉందని వివరించారు. పేషెంట్లందరికీ మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు, డాక్టర్లకు మంత్రి సూచించారు. పూర్తిగా కోలుకునే వరకూ హాస్పిటల్స్‌లోనే ఉంచాలని, ఆ తర్వాతే డిశ్చార్జ్ చేయాలని ఆదేశించారు.

# సింగరేణి నివాసాలకు పట్టాలు ఇవ్వాలి



**మంచిర్యాల , జూలై 11 (జనంసాక్షి) :** సింగరేణి ప్రాంతమైన శ్రీరాంపూర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైద్రాబాద్లోని సింగరేణి భవన్లో సింగరేణి సీఎండీ బలరాంకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా సింగరేణి ప్రాంతంలో శాశ్వతంగా ఇండ్లు కట్టుకుని నివసిస్తున్న పేదలకు గూడు లభించినట్లు అవుతుందని, ఈ మంచి కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనేలా చూడాలని విన్నవించారు. గత ప్రభుత్వం ఇండ్ల పట్టాలు ఇచ్చినట్లు పేపర్లకే పరిమితం కాగా ఎలాంటి పట్టాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. సింగరేణి ప్రాంతంలో సుదీర్ఘకాలం పనిచేసి అనారోగ్యం బారిన పడిన వారు సైతం నిబంధనల ప్రకారం వారికి సహకారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ మాజీ అధ్యకుడు వెరబెల్లి రఘునాథ్. ముకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులను ఆగస్టు 15 లో పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**కాటారం జూలై 11 (జనంసాక్షి) :** భూభారతిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆగస్టు 15 లోపు పూర్తి చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కాటారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఫైళ్ళను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ భారతి లో వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకుని ఎంత మందికి నోటీసులు జారీ చేశారని ప్రశ్నించారు. మొత్తం మండలంలో 5,610 భూభారతి దరఖాస్తులు వచ్చాయని అందులో 412 మంది దరఖాస్తు దారులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపగా,భూ భారతి లో వచ్చిన దరఖాస్తులను క్రేత్ర స్థాయిలో పరిశీలించి ఆగస్ట్ 15 వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు డిటి రామ్మోహన్, ఆర్.ఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల సాంప్రదాయాలు దెబ్బ తినకుండా ఘనంగా ఏర్పాట్లు

**సమ్మక్క సారలమ్మ గణ కీర్తి ప్రపంచ వ్యాప్తంగా తెలియజేయడానికి ఏర్పాటు**

**జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం**

**మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



**ములుగు ప్రతినిధి, జూలై 11(జనంసాక్షి) :** వచ్చే సంవత్సరం జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జరుగనున్న శ్రీ సమ్మక్క సారలమ్మ మహా మేడారం జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేస్తామని, ఆదివాసీ సాంప్రదాయాలు దెబ్బ తినకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవిచందర్ లతో కలిసి ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క సారలమ్మ లను దర్శించుకోగా గిరిజన పూజారులు డోలు వాయిద్యాల మధ్య ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న గణ కీర్తిలను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. వేల సంవత్సరాల పాటు నిలిచిపోయేలా సమ్మక్క సారలమ్మ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని, ఇప్పటికే జాతరలో శ్వాశత పనులు జరుగుతుండగా మరో 112 కోట్ల రూపాయలతో సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వానికి అంచనాలు తయారు చేసి నివేదిక సమర్పించడం జరిగిందని అన్నారు. మేడారం మహా జాతరను విజయవంతం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, జాతరకు కావలసిన నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. క్యూ లైన్ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, జాతర విజయవంతానికి జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో సమన్వయంగా ముందుకు సాగాలని సూచించారు. జంపన్న వాగుపై ఇరువైపులా భక్తులు సేద తీరడానికి అహ్లదకరంగా ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, గిరిజన పూజారుల సాంప్రదాయానికి విగాధ కలగకుండా పూజార్ల ఆలోచన విధానంతోనే ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఈ ఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కర్నాటక ప్రభుత్వం కీలక నిర్ణయం

**స్కూలు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం**

**వెల్లడించిన డిప్యూటి సిఎం శివకుమార్**

**బెంగళూరు, జులై 11 (జనంసాక్షి) :** కర్ణాటక ప్రభుత్వం విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పింది. కర్ణాటక పబ్లిక్ స్కూల్స్ సహా ప్రభుత్వ పాఠశాలల్లో లోయర్ కిండర్ గార్టెన్ నుండి ప్రీ-యూనివర్సిటీ- కోర్సు వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు సర్వీసును ప్రకటించింది. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి శివకుమార్ ఉచిత బస్సుపై ప్రకటన చేశారు. మారుమూల, వెనుకబడిన ప్రాంతాల పిల్లలకు ప్రయాణ ఖర్చులను తగ్గించడం, పాఠశాల హాజరును పెంచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపారు. ఈ సేవ విద్యార్థులు విద్యను పొందడాన్ని సులభతరం చేయడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు, సమయపాలన, మొత్తం విద్యా పనితీరును మెరుగుపరుస్తుందని ప్రభుత్వం విశ్వసిస్తుందని చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదిగా.. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది! ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కర్ణాటక ప్రభుత్వ పాఠశాలల్లో రఔఏ నుండి ÷ఖఈ వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు సర్వీసును ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ- సిఎం శివకుమార్ చెప్పారు.

# బీసీ రిజర్వేషన్లు 42% సాధించే వరకు పోరాడుతూనే ఉంటాం

**రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** వెనుకబడిన కులాల సంక్షేమం, అభ్యున్నతికి 42% రిజర్వేషన్స్ సాధించే వరకు తమ పార్టీ పోరాడుతూనే ఉంటుందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. బీసీలతో పాటు బడుగు, బలహీన, అల్పసంఖ్యాక వర్గాలు,మహిళల సాధికారత కోసం బీఆర్ఎస్ ఆలోచిస్తుందని, ఎల్లవేళలా వారి పక్షాన నిలబడుతున్నదన్నారు. చట్టసభలలో మహిళలు, బీసీలకు 33% చొప్పున రిజర్వేషన్స్ అమలు చేయాలని కోరుతూ మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు రాష్ట్ర ఏర్పాటు జరిగిన తొలినాళ్లలోనే అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించి కేంద్రానికి పంపారని ఎంపీ రవిచంద్ర వివరించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్ లో శుక్రవారం ఆయన శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్,తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్,ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ తదితర ప్రముఖులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆర్డినెన్స్ పేరుతో బీసీ రిజర్వేషన్లు అమలు చేసేదే ఉంటే,అది అంత చులకైనదే అయితే ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఇప్పటికే చేసుండే వారేనన్నారు. ఆ ముఖ్యమంత్రులకు అది తెలియదా? రేవంత్ రెడ్డికే తెలివుందా? అని ఎంపీ రవిచంద్ర ప్రశ్నించారు. రిజర్వేషన్స్ పెంపుదల విషయంలో ఆర్డినెన్స్ వల్ల ఏ మాత్రం ప్రయోజనం లేదని,న్యాయస్థానాలు కొట్టివేస్తాయని రేవంత్ రెడ్డికే కాదు, అందరికీ తెలిసిందేనన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎవరో ఒకరితో కోర్టులో కేసు వేయించి ఆర్డినెన్స్ కొట్టుడుపోయేలా చేసి బీసీలను మభ్యపెట్టడానికే రేవంత్ రెడ్డి కుట్ర పన్నారని ఎంపీ వద్దిరాజు మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో మోసపు మాటలు చెప్పి బీసీల ఓట్లు వేయించుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికే రాష్ట్రపతి వద్ద బిల్లు ఉండగా,అదే అంశంలో తిరిగి ఆర్డినెన్స్ తీసుకువస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది బీసీలను మరోసారి మభ్యపెట్టడం,మోసం,దగా చేయడమే తప్ప మరొకటి కాదని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. మంత్రిమండలిలో మున్నూరుకాపు,యాదవ, ముస్లిం, లంబాడీలకు స్థానం కల్పించకపోవడం, కార్పోరేషన్ల ఛైర్మన్ల నియమాకం జరపకుండా, నిధులివ్వకుండా పేద,బడుగు, బలహీన వర్గాలకు పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఎంపీ రవిచంద్ర ఆవేదన చెందారు. బీసీలకు మంచి జరగాలని,న్యాయం చేయాలనే ఆలోచన, చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షాన్ని ప్రధాని నరేంద్రమోడీ వద్దకు తీసుకుపోవాలని ఎంపీ వద్దిరాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయ, విద్యా,ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్స్ కల్పించే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడితే బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశానుసారం రాజ్యసభలో తాము సంపూర్ణ మద్దతునిస్తామన్నారు. రిజర్వేషన్ల పెంపుదలకు చట్టబద్ధత లభించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించాలని, అందుకోసం బీసీలందరిని ఏకతాటిపైకి తెచ్చి బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తూనే ఉంటుందని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు.

## అడవి హాంఫట్.. రక్షకులే భక్షకులు!

**అటవీలో కలప మాయం...**




**కొత్తగూడ/గంగారం జూలై 11 (జనంసాక్షి) :** ఏజెన్సీలో గుట్టు చప్పుడు కాకుండా అరుదైన కలప మాయం చేస్తున్న అధికారులు ఎవరు...? మహబూబాద్ జిల్లా గంగారం మండలం రామారం గ్రామంలో సుమారుగా 50 టేకు కలప దుంగలు గ్రామంలో విడతలవారీగా నిలువచేసి ఉండడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఆ నోట ఈ నోట బయటికి పొక్కడంతో సుమారుగా రెండు ట్రాక్టర్ ల అరుదైన టేకు కలప రాత్రి రాత్రి మాయమైన పరిస్థితి నెలకొంది. ఫారెస్ట్ అధికారులు చెట్లను పెంచాల్సింది పోయి నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇష్టాను తీరంలో చెట్లను కాలగర్భంలో కలిపే విధంగా వారి చర్యలు ఉన్నట్లుగా తెలుస్తుంది. కర్ర కోత మిషన్లు వాడుతూ పట్టణ ప్రాంతానికి తరలిస్తున్న అధికారులు ఎవరు...! గంగారం ఫారెస్ట్ రేంజ్ అధికారి మంగీలాల్ ను వివరణ అడగగా అట్టి కర్రను ఇల్లందు డిపోకు తరలించడం జరిగిందని తెలిపారు. సరే దొరికింది డిపోకు తరలించడం బాగానే ఉన్నప్పటికీ గ్రామ నడిబొడ్డులో కర్ర ఎలా వచ్చింది. ఆ దొరికిన కర్రను అడవిలో దొరికినట్టుగా చిత్రీకరిస్తున్న పరిస్థితి ఎందుకు నెలకొంది. ఆ కర్రను కొట్టింది... తెచ్చింది... ఎవరు అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. ఈ అధికారులు ఎవరిపై కేసు చేస్తారనేది నెలకొంది.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
12 జులై 2025
తెలంగాణ

# వాజ్‌పేయి

## గాంధీయ సోషలిజం, వాస్తవిక జాతీయవాదం



అటల్ బిహారీ వాజ్‌పేయి భారత రాజకీయ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఆకర్షించిన నాయకుడు. ఆయన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సిద్ధాంతాన్ని గాంధీయ సోషలిజంతో అలాగే వాస్తవిక జాతీయవాదంతో సమన్వయం చేసిన నేతగా ప్రఖ్యాతి గాంచారు. అంతే కాదు హిందూ జాతీయవాదంతో కూడిన ఒక విశిష్ట రాజకీయ దృక్పథాన్ని రూపొందించారు. ఈ సమన్వయం వాజ్‌పేయి యొక్క పాలనలో స్పష్టంగా కనిపిస్తుంది. ఇది ఒకవైపు బీజేపీ యొక్క సాంస్కృతిక జాతీయవాదాన్ని బలపరిచింది. మరోవైపు విస్తృత ఆకర్షణ కోసం సమ్మిళిత రాజకీయ విధానాన్ని అవలంబించింది. ఈ వ్యాసం వాజ్‌పేయి యొక్క రాజకీయ దూరదృష్టిని, ఆయన సిద్ధాంతపరమైన సమన్వయాన్ని, భారత రాజకీయ ముఖ చిత్రంపై దాని ప్రభావాన్ని విశ్లేషిస్తూ, విమర్శనాత్మక దృక్కోణంతో పరిశీలిస్తుంది.

వాజ్‌పేయి రాజకీయ జీవితం భారతీయ జనసంఘ్‌తో ప్రారంభమైంది, ఇది బీజేపీకి పూర్వ సంస్థ. జనసంఘ్ హిందూ జాతీయవాదం స్ఫూర్తిగా బలమైన సిద్ధాంత ప్రాతిపదికన నడిచింది. ఈ విధానాన్ని రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ (ఆర్ఎస్ఎస్) సమర్థించింది. ఈ సిద్ధాంతం భారతీయ సంస్కృతి అలాగే హిందూ గుర్తింపును కేంద్రంగా చేసుకుని, జాతీయవాద భావనను నిర్మించింది. అయితే, వాజ్‌పేయి ఈ హిందూ జాతీయవాదాన్ని గాంధీయ సోషలిజంతో సమన్వయం చేయడం ద్వారా ఒక విశిష్ట రాజకీయ గుర్తింపును సృష్టించారు. గాంధీయ సోషలిజం సమానత్వం, స్వావలంబన, గ్రామీణాభివృద్ధిపై దృష్టి సారిస్తుంది. ఇది బీజేపీ యొక్క సాంప్రదాయ సిద్ధాంతంతో సరిపోలనప్పటికీ, వాజ్‌పేయి దానిని వాస్తవికంగా అనుసరించారు.

వాజ్‌పేయి యొక్క పాలన (1998–2004) ఈ సమన్వయానికి ఒక ఆచరణాత్మక రూపాన్ని ఇచ్చారు. ఉదాహరణకు చూస్తే ఆయన నాయకత్వంలో బీజేపీ నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ) అనే సమ్మిళిత కూటమిని నడిపింది. ఈ కూటమిలో విభిన్న రాజకీయ భావజాలాలు కలిగిన పార్టీలు సభ్యత్వం కలిగి ఉన్నాయి. కానీ, వాజ్‌పేయి తన సమన్వయ దృష్టితో అవన్నీ ఏకం చేశారు. హిందూ జాతీయవాదం యొక్క కొన్ని అంశాలు, ఉదాహరణకు అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటి అంశాలు, బీజేపీ యొక్క కోర్ ఓటర్లను ఆకర్షించాయి. అయితే, వాజ్‌పేయి ఈ అంశాలను సమతుల్యం చేస్తూ, ఆర్థిక సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, అలాగే విదేశాంగ విధానంలో వాస్తవిక దృక్పథాన్ని అవలంబించారు. ఉదాహరణకు, గోల్డెన్ క్వాడ్రిలాటరల్ ప్రాజెక్ట్ అలాగే గ్రామీణ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు వంటి కార్యక్రమాలు గాంధీయ సోషలిజం యొక్క స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి. ఇవి గ్రామీణ భారతదేశం యొక్క అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్నాయి.

వాజ్‌పేయి యొక్క వాస్తవిక జాతీయవాదం ఆయన విదేశాంగ విధానంలో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. 1998లో పోఖ్రాన్ అణు పరీక్షలు భారతదేశ జాతీయ భద్రతను బలోపేతం చేయడంలో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ నిర్ణయం హిందూ జాతీయవాద శిబిరంలో జాతీయ గర్వాన్ని రేకెత్తించింది. కానీ, అదే సమయంలో అంతర్జాతీయ సమాజంతో సంబంధాలను దెబ్బతీయకుండా ఉండటానికి వాజ్‌పేయి సమయస్ఫూర్తి తో జాగ్రత్తగా నడిచారు. ఆనాటి అమెరికాతో సత్సంబంధాలను బలోపేతం చేసుకోవడం, పాకిస్తాన్‌తో శాంతి చర్చలు (లాహోర్ బస్ యాత్ర వంటివి), అలాగే చైనాతో సంబంధాలను మెరుగుపరచడం వంటి చర్యలు ఆయన వాస్తవిక దృష్టిని, రాజనీతిజ్ఞతను ప్రదర్శించాయి. ఈ విధానం హిందూ జాతీయవాదం అనే సైద్ధాంతిక దృక్పథాన్ని ఒకవైపు అలాగే మరోవైపు ఆదర్శవాదాన్ని ఆచరణాత్మక రాజనీతిని సమన్వయం చేసే దృష్టి కోణాన్ని ఏక కాలంలో ప్రదర్శించటం ఆయన తన ప్రజ్ఞాపాటవాన్ని చూపినట్లైంది.

అయితే, వాజ్‌పేయి యొక్క ఈ సమన్వయం విమర్శల నుండి తప్పించుకోలేదు. ఒకవైపు, హిందూ జాతీయవాద శిబిరం ఆయనను కొన్నిసార్లు అతిగా సమ్మిళితంగా ఉన్నారని భావించింది. ఉదాహరణకు, అయోధ్య వివాదంలో ఆయన తీసుకున్న సమతుల్య వైఖరి ఆర్ఎస్ఎస్ మరియు విశ్వ హిందూ పరిషత్ వంటి సంస్థ లలో కొంత అసంతృప్తిని కలిగించింది. మరోవైపు, విమర్శకులు వాజ్‌పేయి పాలనలో హిందూ జాతీయవాద ఎజెండాను మరింత బలంగా అమలు చేయకపోవడం వల్ల సెక్యులరిజం బలహీనపడిందని వాదించారు. 2002 గుజరాత్ అల్లర్లు ఈ విమర్శలకు ఒక కేంద్ర బిందువుగా మారాయి. వాజ్‌పేయి ఈ అల్లర్లను ఖండించినప్పటికీ, ఆయన ప్రభుత్వం దానిని సమర్థవంతంగా నిరోధించలేక పోయిందని విమర్శలు ఎక్కువగానే వచ్చాయి. ఈ సంఘటన హిందూ జాతీయవాదం యొక్క సవాళ్లను అలాగే దానిని సమ్మిళిత రాజకీయాలతో సమన్వయం చేయడంలోని సంక్లిష్టతను బహిర్గతం చేసింది.

వాజ్‌పేయి యొక్క రాజకీయ సిద్ధాంతం యొక్క విజయం ఆయన విస్తృత ఆకర్షణలో ఉంది. ఆయన కవిత్వాత్మక భాషా చాతుర్యం లో ఉంది. ఆయన ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, అందర్నీ కలుపుకొని పోయే సమ్మిళిత దృష్టి బీజేపీని ఒక జాతీయ పార్టీగా మార్చడంలో కీలక పాత్ర పోషించాయి. ఆయన హిందూ జాతీయవాదాన్ని గాంధీయ సోషలిజంతో మిళితం చేసి, ఆర్థిక సంస్కరణలు అలాగే జాతీయ భద్రత వంటి వాస్తవిక అంశాలతో సమతుల్యం చేయడం ద్వారా ఒక కొత్త రాజకీయ గుర్తింపును సృష్టించారు. ఈ సమన్వయం బీజేపీ యొక్క సాంస్కృతిక జాతీయవాద ఎజెండాను మరింత విస్తృతంగా ప్రేక్షకులకు ఆకర్షణీయంగా చేసింది. అయితే, ఈ సమన్వయం అన్ని సమయాల్లో సమతుల్యంగా ఉండలేదు, మరియు కొన్ని సందర్భాల్లో హిందూ జాతీయవాదం యొక్క తీవ్రత ఆయన సమ్మిళిత దృష్టిని సవాలు చేసింది.

అటల్ బిహారీ వాజ్‌పేయి యొక్క రాజకీయ జీవితం ఒక సంక్లిష్టమైన సిద్ధాంతానికి, విజయవంతమైన ఆచరణాత్మక సమన్వయానికి నిదర్శనం. ఆయన గాంధీయ సోషలిజంతో పాటు వాస్తవిక జాతీయవాదంతో హిందూ జాతీయవాదాన్ని సంమిళితం చేసి, బీజేపీ యొక్క సిద్ధాంతాన్ని విస్తృత ఆకర్షణ కలిగిన రాజకీయ శక్తిగా మార్చారు. ఈ సమన్వయం ఆయన పాలనలో ఆర్థిక సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు విదేశాంగ విధానంలో స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, ఈ సమన్వయం విమర్శల నుండి పూర్తిగా తప్పించుకోలేదు. కొన్ని సందర్భాల్లో సమతుల్యతను కాపాడడంలో సవాళ్లను ఎదుర్కొంది. వాజ్‌పేయి యొక్క వారసత్వం భారత రాజకీయాలలో ఒక సమ్మిళిత, వాస్తవిక, ఆకర్షణీయ నాయకత్వంగా నిలిచింది. ఇది బీజేపీ భవిష్యత్తు రాజకీయ వ్యూహాత్మక విజయాలకు బీజం వేసింది.




డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# కామ్రేడ్ డీవీ 41వ వర్ధంతి

# భారత విప్లవోద్యమ రథసారథికి రెడ్ సెల్యూట్

**కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వర రావు (డీవీ) గారి 41వ వర్ధంతి సందర్భంగా, ఆయన త్యాగాలు, విప్లవ స్ఫూర్తి, పీడిత ప్రజల కోసం అలుపెరగని పోరాటం గుండెల్ని కదిలిస్తాయి. భూస్వామ్య కుటుంబంలో జన్మించి, నిజాం నిరంకుశత్వానికి, దోపిడీలకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపించిన ఈ మహోన్నత నాయకుడి జీవితం, నేటి యువతకు స్ఫూర్తి దీపంలా నిలుస్తుంది. "దున్నేవాడికే భూమి" నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన, జైలు గోడల్లోనూ విప్లవ గ్రంథాలు రచించిన ఆయన ధైర్యం, నిబద్ధత మనల్ని ఉత్తేజపరుస్తాయి. కామ్రేడ్ డీవీ గారి స్మృతిని స్మరిస్తూ, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు మన హృదయాల్లో విప్లవ జ్వాల రగిలించాలి. ఆయనకు మా రెడ్ సెల్యూట్!**




జులై 12, కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వర రావు (డి.వి) గారి 41వ వర్ధంతి సందర్భంగా, భారత విప్లవోద్యమంలోని ఈ అగ్రనేత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సిద్ధాంతకర్త, మాజీ ఎంపీ, మరియు యుసీసీఆర్ఐ (ఎం-ఎల్) వ్యవస్థాపకుడైన కామ్రేడ్ డీవీ గారికి మా రెడ్ సెల్యూట్.

కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వర రావు 1917 జూన్ 1న నాటి నల్గొండ జిల్లా, నేటి సూర్యాపేట జిల్లాలోని చందుపట్ల గ్రామంలో భూస్వామ్య సంపన్న కుటుంబంలో జన్మించారు. భూస్వామ్య దేశ్‌ముఖ్ కుటుంబంలో పుట్టినప్పటికీ, ఆయన తన జీవితమంతా పీడిత ప్రజల కోసం ఉద్యమించారు. బాల్యంలోనే వితంతువైన రంగమ్మ గారిని వివాహం చేసుకున్న ఆయన, సామాజిక సంస్కరణలకు తన వంతు కృషి చేశారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ చదువుతున్న సమయంలో, 'వందే మాతరం' ఉద్యమంలో పాల్గొన్నందుకు కళాశాల యాజమాన్యం ఆయనను బహిష్కరించింది. దీంతో ఆయన నాగపూర్‌లోని జబల్పూర్ విశ్వవిద్యాలయంలో చదువును కొనసాగించారు. అక్కడ చదువుతున్న రోజుల్లోనే కమ్యూనిస్టు సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. జబల్పూర్ నుండి డిగ్రీతో పాటు కమ్యూనిస్టు భావజాలాన్ని కూడా తీసుకొచ్చారు.

నాటి నిజాం రాష్ట్రంలో ప్రజలు నిరంకుశ భూస్వామ్య విధానాలు, వెట్టిచాకిరీ వంటి దోపిడీలతో సతమతమవుతున్న సమయంలో, 1939లో నిషేధిత కమ్యూనిస్టు పార్టీలో చేరి పీడిత ప్రజల పక్షాన పోరాటం సాగించారు. ప్రజలను చైతన్యం చేసి, నిజాం నిరంకుశత్వానికి, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటాన్ని నడిపించారు. ఈ పోరాటంలో భీమిరెడ్డి నర్సింహారెడ్డి వంటి వీరులను కమ్యూనిస్టు భావజాలంతో స్ఫూర్తిపరిచి, విప్లవ యోధులుగా తీర్చిదిద్దారు. "అక్టోబర్ విప్లవం" వంటి పుస్తకాల ద్వారా ప్రజల్లో విప్లవ చైతన్యాన్ని రగిలించారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. "దున్నేవాడికే భూమి" అనే నినాదంతో, కమ్యూనిస్టుల నాయకత్వంలో తెలంగాణలో 3,000 గ్రామాల్లో 10 లక్షల ఎకరాల భూమిని పీడిత ప్రజలకు పంచడంలో ఆయన నిర్ణయాత్మక పాత్ర వహించారు. ఆంధ్ర మహాసభకు నాయకత్వం వహిస్తూ, తెలంగాణ రైతాంగ పోరాటాన్ని (1946–51) ప్రపంచానికి చాటిచెప్పారు.

1957లో మిర్యాలగూడ నుండి ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిచినప్పటికీ, పార్లమెంటరీ విధానంతో సంతృప్తి చెందలేకపోయారు. "అసెంబ్లీలు, పార్లమెంట్ బాతాకానీ షాపులు" అని, విప్లవ పోరాటం ద్వారానే పీడిత ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన గట్టిగా నమ్మారు. ఈ నమ్మకంతో, కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డితో కలిసి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్ట్ విప్లవకారుల కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు.

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డితో ఆయనకు విడదీయలేని స్నేహబంధం ఉండే ది. విప్లవోద్యమంలో విభేదాలు, అవకాశవాద ధోరణులను ఎదిరిస్తూ, ఐక్య త కోసం రచనలు చేశారు. "జనగామ ప్రజల విరోచిత పోరాటం" అనే పుస్తకం ద్వారా సాయుధ పోరాటంలో ప్రజల పాత్రను వివరించగా, "పోరాట ఉద్యమానికి పునాదులు వేయండి" అనే సర్క్యులర్ విప్లవకారులకు స్ఫూర్తినిచ్చింది. "తక్షణ కార్యక్రమం" అనే డాక్యుమెంట్ విప్లవోద్యమ నిర్మాణానికి మార్గదర్శకంగా నిలిచింది.

తెలంగాణ సాయుధ పోరాట అనుభవాలను "తెలంగాణ ప్రజల సాయుధ రైతాంగ పోరాటం (1946–51)" అనే పుస్తకంలో కళ్లకు కట్టినట్లు వివరించారు. 1969లో 'హైదరాబాద్ కుట్ర కేసు'లో అరెస్టై, మద్రాస్ జైలులో ఉన్న సమయంలో "భారత జనతా ప్రజాతంత్ర విప్లవం – ఒక వివరణ" అనే గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథం కోర్ట్ స్టేట్‌మెంట్‌గా ప్రసిద్ధి చెందింది. ఈ సమయంలోనే తరిమెల నాగిరెడ్డి "తాకట్టులో భారత దేశం" అనే గ్రంథాన్ని రచించారు. కోర్టులో నలుగు రోజుల పాటు పాలకవర్గాల మోసపూరిత విధానాలను ఎండగడుతూ, విప్లవ లక్ష్యాన్ని సమర్థించారు. "భారత విప్లవం భారత ప్రజల జన్మహక్కు, విప్లవకారులు దాని కోసం పనిచేయడం వారి జన్మహక్కు" అని కోర్టులో ధైర్యంగా ప్రకటించారు. ఈ విప్లవాన్ని ఏ రాజ్యాంగం, చట్టం లేదా సాయుధ బలగాలు అణచివేయలేవని ఆయన స్పష్టం చేశారు. 1975లో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డితో కలిసి యుసీసీఆర్ఐ (ఎం-ఎల్) పార్టీని స్థాపించారు.

ఎమర్జెన్సీ విధించిన సమయంలో అజ్ఞాతంలోకి వెళ్లిన ఆయన, 1984 జూలై 12న 66వ ఏట గుండెపోటుతో కన్నుమూశారు. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో 5 ఏళ్లు జైలులో, 20 ఏళ్లు అజ్ఞాతంలో గడిపిన ఆయన, బహిరంగంగా ఉన్న 20 ఏళ్లు ప్రజల కోసమే జీవించారు. అతివాద, మితవాద, అవకాశవాద ధోరణులకు వ్యతిరేకంగా తుదిశ్వాస వరకు పోరాడారు.

నేటి యువత కామ్రేడ్ డీవీ గారి స్ఫూర్తిని స్వీకరించి, పీడిత ప్రజల పక్షాన నిలబడి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి. ఆయనకు నిజమైన నివాళి అంటే పీడిత ప్రజల కోసం పోరాటం చేయడమే. భారత విప్లవోద్యమ రథసారథి కామ్రేడ్ డీవీ గారికి మా రెడ్ సెల్యూట్.

**అనంతుల మధు**
తెలంగాణ యువజన సంఘం
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ (DSO)
మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ఫోన్: 9505866698






# వాన జాడ కరువు!

## అంచనాలు తప్పుతున్న వానలు

**మనం కూర్చున్న కొమ్మను మనమే నర్కుంటుంన్నా మన్న "ఇంగిత జ్ఞానం" లేని స్థితికి మనిషి స్వార్థం పెరిగిపోయింది. "నైరుతి పైన ప్రభావం" మన దేశంలో వ్యవసాయ రంగానికి కీలకమైన నైరుతి రుతు పవన వర్షాల్లోనూ ఏటికేడు మార్పులు చోటు చేసుకున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. హిందూ మహాసముద్రం వేగంగా వేడెక్కడంతో మెరిడియల్ థర్మల్ గ్రేడియంట్ బలహీనపడి రుతుపవనాల గమనం మందగిస్తుంది. దేశవ్యాప్తంగా ఈ సీజన్లో కురిసే వర్షాల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. దీని ప్రభావం భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంపై పడుతోంది. సాధారణంగా జూన్ 1 నుంచి నైరుతి సీజన్ మొదలవుతుంది. ఈసారి ముందుగానే రుతుపవనాలు కేరళను తాకాయి. జూన్ లో నమోదు కావాల్సిన వర్షపాతం ముందుగానే వేసవిలో నమోదయింది.**



మనదేశంలో వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే అంటే.. ఏప్రిల్, మే నెలల్లో వాతావరణ శాఖ రెండుసార్లు వాతావరణ పరిస్థితుల అంచనాలను విడుదల చేస్తుంది. అలా గత ఏప్రిల్, మే నెలలో ఇచ్చిన అంచనాలు నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే వస్తాయని చెప్పింది. అలానే మే చివర,జూన్ మొదట్లోనే పలకరించి ముందస్తు మురిపించింది.నేటికీ జులై మాసం మధ్యలోకి వచ్చినా కూడా మేఘాలు మురిపిస్తూ వర్షాలు మాత్రం కురిపించడం లేదు.కానీ ఉత్తర భారత దేశంలో భారీ వర్షాలతో జలదిగ్బంధంలో జన జీవనాన్నిఅతలా కుతలం చేస్తుంది. అంటే వానాకాలం సీజన్ ప్రాంతాలవారీగా పడితే, అతివృష్టి లేదంటే అనావృష్టితో ప్రజలను ముఖ్యంగా రైతాంగాన్ని "రెంటికి చెడ్డ రేవడిలా" చేస్తుంది. దీని ప్రభావం దేశ ఆర్థిక పరిస్థితులపై, ప్రజల జీవన విధానంపై మెండుగా పడుతుంది. ఇంతగా మార్పులకు ప్రధాన కారణం మనిషి స్వార్థం, పాలకుల సామ్రాజ్య కాంక్ష, పారిశ్రా మికీకరణ, కార్పొరేటీకరణల వల్లనే అనేది కాదనలేని వాస్తవం. మనం సృష్టించలేని పంచభూతాలను విధ్వంసం చేస్తున్నాం.. ఎంతగా అంటే? మన మనుగడకు విఘాతం కలిగిస్తుందన్న సోయి కూడా లేకుండా. భూ వాతావరణం వేడెక్కేలా, గాలి, నీరు పర్యావ రణం కలుషితమయ్యేలా (పొల్యూషన్, పెస్టిసైడ్, ప్లాస్టిక) వీటి వల్ల కాలుష్యమై సమతుల్యత గాడి తప్పి ఏడాది పొడుగునా ఉకపోతే, మరోవైపు అకాల వర్షాలు, శీతాకాలం కూడా గాడి తప్పుతోంది. ఈ స్థితికి కారణం మనుష్యులే.

**"రోజుకు సగటున 6.5 మిల్లీమీటర్ల పైగా వర్షం.."**

వాతావరణంలో తేమ శాతం పెరగడంతో ప్రపంచవ్యాప్తంగా తరచూ తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. నైరుతిలో మధ్య భారతంలో 1950 నుంచి 2015 మధ్యలో సగటున రోజుకు 150 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిసిన సందర్భాలు 75 శాతం మేర పెరిగాయి. కరువు ప్రాంతాలైన రాజస్థాన్, గుజరాత్‌లో వర్షపాతం గణనీయంగా పెరుగుతుంది. కొద్దిరోజులుగా గుజరాత్ లో భారీ వర్షాలు కురుస్తున్నాయి తరచూ వరదలు సంభవిస్తున్నా యి. అలాగే దేశంలోని జిల్లాల వారీగాను వార్షిక వర్షపాతం లో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. సౌరాష్ట్ర, కచ్ రాజస్థాన్లోని ఆగ్నేయ ప్రాంతాలు, తమిళనాడులో ఉత్తర, ఏపీలోని ఉత్తరాంధ్ర, నైరుతి ఒడిస్సా, ఛత్తీస్గడ్, మధ్యప్రదేశ్, ప్రశ్చిమ బెంగాల్, మణి పూర్, మిజోరాం, కొంకణ్, గోవా, ఉత్తరఖండ్లలో నైరుతిలో రోజుకు సగటున 6.5 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిసింది. అలాగే గత 30 ఏళ్లలో వార్షిక వర్షపాతంలో ఉత్తర్ ప్రదేశ్ ,బీహార్, మేఘాలయ, పశ్చిమబెంగాల్, నాగాలాండ్ ,అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ తదిత రాష్ట్రాల్లో గణనీయమైన తగ్గుదల కనిపించింది. ఇలా వాతావరణ మార్పుల ప్రభావంతో దేశంలోని రాష్ట్రాల్లో నూ వర్షపాతంలో వైవిధ్యం కనబడుతోంది.. నిర్మలంగా ఉన్న ఆకా శం ఒక్కసారిగా ఉరుముతుంది. జల్లులు మొదలై గంటల వ్యవధిలో కుంభ వృష్టిగ కురుస్తుంది. ఆకస్మిక వరదల ప్రభావంతో ప్రాణ ,ఆస్తినష్టం సంభవిస్తుంది. గత ఏడాది విజయవాడలో కురిసిన కుంభవృష్టి మొదలు తాజాగా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ లోని ఆకస్మిక వరదల వరకు ఇదే దోరణి, వాతావరణ మార్పుల ప్రభావం వర్షపాత క్రమాన్ని మార్చేస్తుంది. కొన్నేళ్లుగా వర్షాలు కురుస్తున్న రోజులు తగ్గుతుండగా.. తక్కువ సమయంలోనే ఎక్కువ వర్షపాతం నమోదవుతోంది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆధ్వర్యంలో గతంలో జరిగే దీర్ఘకాలిక సమాచార విశ్లేషణలోనూ ఈ విషయం వెల్లడైంది. ఇలా వాతావరణ మార్పుల కారణంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో అతి భారీ వర్షపాతం సహా ప్రకృతి వైపరీత్యాల్లో (సివియర్ వెదర్) తాత్కాలిక, ప్రాదేశిక వైవిధ్యం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తిం చారు. ఈ మార్పులు భవిష్యత్తులోన కొనసాగుతాయని వీటిని నివారించలేమని గతంలోనే ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్ (ఐపీసీసీ) నివేదికలోనూ ప్రస్తావించారు. ఇలానే తెలంగాణలో ఆంధ్ర ప్రదేశ్లో పలు జిల్లాల వారీగా, ప్రాంతాలవారీగా అధిక వర్షము ఓవైపు తక్కువ వర్షం మరోవైపు కురుస్తూ సమతుల్యత దెబ్బ తింటున్నది. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయ, ఇతర రంగాల్లో ప్రణాళికలు సరి చేసుకోవాల్సి వుంది. దేశవ్యాప్త సగటు వర్షపాతం క్రమంగా పెరుగుతుందని ఓ అంచనా.. దేశంలో వరదల ముప్పు ఎక్కువగా పొంచి ఉన్న (పల్న ర బులిటీ) రాష్ట్రాల్లో అస్సాం మొదటి స్థానంలో ఉంది. ఆ జాబితాలో తెలుగు రాష్ట్రాలు రెండో స్థానంలో ఉన్నాయి.గత నాలుగు దశాబ్దాల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు రెండో స్థానానికి రావడం ఇదే తొలిసారి. మూడో స్థానంలో కర్ణాటక, నాలుగో స్థానంలో మహారాష్ట్ర ఉన్నాయి. ఇలా అంచనా తప్పి తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం సంభవించడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి.

ఈ పరిస్థితులకు అనుగుణం గా వ్యవసాయ, ఇతర రంగాల్లో ప్రణాళిక సరిచేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నా రు. ఇదంతా రాత్రికి రాత్రో, ఒక్క రోజులో వచ్చిన మార్పు కాదు. మానవుడు ప్రకృతి విరుద్ధ జీవనం విడనాడాలి. పాలకులు శీఘ్ర అభివృద్ధి,పారిశ్రామికీకరణ పేరుతో కాలుష్యాన్ని పెంచి పోషించడం, నేల కనిపించకుండా కాంక్రీట్ జంగల్‌గా మార్చడం, నగరీకరణ పేరుతో నేలను నిలువెల్లా గుల్లపొడుస్తున్న తీరు మానాలి. పర్యావరణానికి హాని జరగకుండా అభివృద్ధికి బాటలు పరచాలి.. ముమ్మాటికి ఇది పాలకులు, పాలితులు, కార్పొరేట్ వర్గాలు సంఘటితంగా కంకణ బద్ధులైతేనే సాధ్యం. ఋతువులు గతి తప్పక సమ శీతోష్ణస్థితి ఏర్పడితే మానవ మనుగడ సవ్యంగా సాగుతోంది.



**మేకిరి దామోదర్**
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# ఆధ్యాత్మిక ముసుగులో అక్రమ దందా

## దొంగ బాబాలు, స్వామిజీల ఆశ్రమాలపై ఆరోపణలు



భారతదేశంలో ఆధ్యాత్మికత అనే ముసుగులో కొందరు స్వామిజీలు, బాబాలు, సన్యాసినులు ప్రజల మూఢ నమ్మకాలను ఆసరాగా చేసుకొని అక్రమ కార్యకలాపాల ద్వారా కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల అండదండలతో ఈ మోసాలు, అక్రమ సంపాదన దందాలు నడుస్తున్నాయి. ఈ ఆశ్రమాలపై లైంగిక వేధింపులు, భూమి ఆక్రమణ, మాదక ద్రవ్యాల వినియోగం, హత్య కేసులు, విదేశాల్లో ఆశ్రమ నిర్మాణం వంటి ఆరోపణలు ఉన్నాయి. మీడియా కథనాల ఆధారంగా, కొన్ని రాష్ట్రాల్లో ఈ అక్రమాలను సంక్షిప్తంగా వివరిస్తున్నాము, నిడివి పరిమితి కారణంగా అన్ని రాష్ట్రాల వివరాలు ఇవ్వలేకపోతున్నాము.

**ఆధ్యాత్మికత అనే ముసుగులో భారతదేశంలో కొందరు స్వామిజీలు, బాబాలు ప్రజల మూఢ నమ్మకాలను ఆసరాగా చేసుకొని అక్రమ కార్యకలాపాల ద్వారా కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో నడిచే ఈ ఆశ్రమాలపై లైంగిక వేధింపులు, భూమి ఆక్రమణ, మాదక ద్రవ్యాలు, హత్య కేసులు వంటి ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుండి గుజరాత్, హర్యానా నుండి తమిళనాడు వరకు, ఈ దొంగ బాబాలు సమాజంలోని విశ్వాసాలను దుర్వినియోగం చేస్తూ, ప్రభుత్వాల నిర్లక్ష్యం మధ్య అక్రమ దందాలను కొనసాగిస్తున్నారు. ఈ మోసాల గుట్టు రట్టు చేసి, ప్రజలను చైతన్యం చేయడం ఈ రోజు అవసరం.**

ఆంధ్రప్రదేశ్‌లో పుట్టపర్తి సాయిబాబా ఆశ్రమం అత్యంత ప్రసిద్ధమైనది, కానీ ఇది హత్య కేసులు, లైంగిక వేధింపులు, అక్రమ సంపాదన ఆరోపణలను ఎదుర్కొంది. 1993లో ఆశ్రమంలో నలుగురు భక్తుల హత్య సంచలనం రేపింది, ఈ ఘటన అంతర్గత వివాదాల ఫలితమని ఆరోపణలు వచ్చాయి. దర్యాప్తు సమయంలో సాయిబాబా సన్నిహితులను ప్రశ్నించిన పుటికీ, స్పష్టమైన ఫలితాలు రాలేదు. ఇటీవల, సాయిబాబా శతజయంతిని ప్రభుత్వ పండుగగా జరపాలని జీవో నంబర్ 862 జారీ కావడం వివాదాస్పదమైంది, ఎందుకంటే ఆయనపై గతంలో మోసం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నాయి. తిరుపతి జిల్లాలో కల్కి భగవాన్ ఆశ్రమం అటవీ భూముల ఆక్రమణ ఆరోపణలను ఎదుర్కొంది. నెల్లూరులో రామదూత స్వామిజీ చెరువు, అటవీ భూములను ఆక్రమించి ఆశ్రమం నిర్మించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆశ్రమాల్లో మాదక ద్రవ్యాల వినియోగం, లైంగిక వేధింపులు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. విశాఖపట్నంలో స్వరూపానంద స్వామి ఆశ్రమానికి భూముల కేటాయింపు రద్దైనప్పటికీ, ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నా యని విమర్శలు ఉన్నాయి.

గుజరాత్‌లో ఆశారాం బాపు, తన కుమారుడు నారాయణ్ సాయితో కలిసి 400 ఆశ్రమాలను నిర్మించారు, ఇవి లైంగిక వేధింపులు, హత్య కేసులు, భూమి ఆక్రమణ ఆరోపణలను ఎదుర్కొన్నాయి. 2013లో ఆశారాంపై చిన్నారిపై అత్యాచార ఆరోపణలతో కేసు నమోదై, 2018లో జీవిత ఖైదు విధించబడింది. 2014లో అమృత్ ప్రజాపతి హత్య కేసులో ఆశారాం సన్నిహితులపై ఆరోపణలు వచ్చాయి. అహ్మదాబాద్‌లో సబర్మతి నది ఒడ్డున నిర్మితమైన ఆశ్రమం భూమి ఆక్రమణ ఆరోపణలను ఎదుర్కొంది. గుజరాత్ ప్రభుత్వం దర్యాప్తు చేపట్టినప్పటికీ, డీకే త్రివేది కమిషన్ రిపోర్టు బహిర్గతం కాలేదు. హర్యానాలో రాంపాల్ సింగ్ ఆశ్రమంపై 2014లో హత్య, లైంగిక వేధింపులు, అక్రమ ఆయుధాల సేకరణ ఆరోపణలతో కేసులు నమోదయ్యాయి. భక్తులను బందీలుగా ఉంచి, మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరిగాయని మీడియా వెల్లడించింది. 2018లో రాంపాల్‌కు జీవిత ఖైదు విధించబడింది. ఆశ్రమంలో మాదక ద్రవ్యాలు, అక్రమ ఆయుధాలు బయటపడ్డాయి.

రాజస్థాన్‌లో సంత్ అమర్‌పురి మహారాజ్ ఆశ్రమంపై భూమి ఆక్రమణ, లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. భక్తుల నుండి భారీగా డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2020లో జైపూర్ సమీపంలో ఒక ఆశ్రమంలో మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకోబడి, నిర్వాహకులపై కేసులు నమోదయ్యాయి. తమిళనాడులో కంచి కామకోటి పీఠంపై 2004లో శంకరరామన్ హత్య కేసు ఆరోపణలు వచ్చాయి. జయేంద్ర సరస్వతి 2013లో నిర్దోషిగా విడుదలయ్యారు, కానీ ఈ ఆరోపణలు పీఠం యొక్క పవిత్రతను ప్రశ్నించాయి. జగ్గి వాసుదేవ్ నేతృత్వంలోని ఈషా ఫౌండేషన్ అటవీ భూముల ఆక్రమణ, భక్తుల మానసిక నియంత్రణ, భారీ డబ్బు వసూళ్ల ఆరోపణలను ఎదుర్కొంది. ఒడిశాలో రజనీష్ (ఓషో) ఆశ్రమం 1980లలో పూణేలో స్థాపించబడి, లైంగిక స్వేచ్ఛ, మాదక ద్రవ్యాలు, అక్రమ సంపాదన ఆరోపణలను ఎదుర్కొంది. అమెరికాలో రజనీష్‌పురం ఆశ్రమంపై బయోటెర్రరిజం, హత్యా యత్నం, అక్రమ ఆయుధాల ఆరోపణలతో 1985లో రజనీష్ బహిష్కరణకు గురయ్యారు.

ఉత్తరప్రదేశ్‌లో బాబా రాందేవ్ పతంజలి యోగపీఠం కల్తీ ఔషధాల ఆరోపణలను ఎదుర్కొంది. 2024లో సుప్రీంకోర్టు రాందేవ్‌కు క్షమాపణ చెప్పించింది. నేపాల్ రాందేవ్ ఉత్పత్తులను నిషేధించింది. గుర్మీత్ రామ్ రహీమ్‌పై 2017లో అత్యాచార ఆరోపణలతో జీవిత ఖైదు విధించబడింది. మహారాష్ట్రలో ఓషో ఆశ్రమం, నిత్యానంద ఆశ్రమాలపై లైంగిక వేధింపులు, మాదక ద్రవ్యాల ఆరోపణలు వచ్చాయి. నిత్యానంద 2010 నుండి పరారీలో ఉండి, "కైలాస" దేశం స్థాపన ప్రకటనతో వివాదాస్పదమయ్యారు. ఈ అక్రమ కార్యకలాపాలు ఆధ్యాత్మిక విశ్వాసాలను దుర్వినియోగం చేస్తున్నాయి. ప్రభుత్వాలు ఈ దొంగ బాబాలపై కఠిన చర్యలు తీసుకొని, ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకొని, ఆశ్రమాలను కూల్చివేయాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండి, మూఢ నమ్మకాలను విడనాడాలి.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్,**
9849328496

# ఆన్‌లైన్ ద్వారా మోసపోయిన వారికి డబ్బులు రికవరీ

మోమిన్‌పేట, జూలై 11 (జనం సాక్షి) : మోమిన్‌పేట సర్కిల్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఆన్ లైన్ మోసాలకు గురి చేసిన నిందితులను పట్టుకొని లబ్ధిదారులకు డబ్బులు ఇప్పించిన సంఘటన మోమిన్ పేట సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. మోమిన్ పేట పోలీస్ స్టేషన్ మర్పల్లి పోలీస్ స్టేషన్ నవాబుపేట పోలీస్ స్టేషన్ ల యందు ఆన్లైన్ సైబర్ క్రైమ్ నేరాలకు సంబంధించిన వివిధ ఫిర్యాదులు రాగా అట్టి ఫిర్యాదుల మేరకు మోహినిపేట సర్కిల్ వారు కేసులు నమోదు చేసి అట్టి కేసులను మోమిన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్ ఆధ్వర్యంలో చేదించి అర్టికేసులలో డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తుల అకౌంట్లో హెూల్డ్ చేసి మరియు అట్టి అకౌంట్ లో నుండి డబ్బులు రికవరీ చేసి ఫిర్యాదుదారులకు తమ అకౌంట్లో జమ చేయించనైనది అని మోమిన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్ తెలిపారు. అదేవిధంగా మోమిన్ పేటకు చెందిన శివకుమార్ తన ఫోను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించి తన అకౌంట్లో ఉన్నటువంటి 1,44000వేల రూపాయలను తమ అకౌంట్లో ట్రాన్స్ఫర్ చేసుకోవడం జరిగింది. ఇట్టి విషయమై శివకుమార్ 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయడం జరిగింది ఇందులో 1,44000/- వేల రూపాయలు ఇవ్వడం జరిగింది 64,000 రిఫండ్ కావడం జరిగింది మిగతా 80 వేల రూపాయలు కోర్ట్ ఆర్డర్ పెండింగ్ లో ఉంది అదేవిధంగా మోమిన్ పేటకు చెందిన శివశంకర్ రెడ్డికి ఇన్సూరెన్స్ రెన్యువల్ అని ఫోన్ రాగా తొమ్మిది వేల రూపాయలు ఫోన్ పే చేయడం జరిగింది. అది ఫ్రాడ్ కాలనీ గ్రహించి 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయడం జరిగింది. తమ తొమ్మిది వేల రూపాయల్లో హెూల్డ్ అవ్వగా 9000 రూపాయలను రిఫండ్ చేయించడం జరిగింది అదేవిధంగా మర్పల్లికి చెందిన రాజు తన ఫోన్ పోవడంతో తన అకౌంట్లో నుండి లక్ష రూపాయలు పోయినవి 1930కి కాల్ చేసి లక్ష రూపాయలు హెూల్డ్ చేయించి లక్ష రూపాయలను రిఫండ్ చేయించడం జరిగింది. అదేవిధంగా మర్పల్లికి చెందిన ఆసిఫ్ అలీ తనకు వాట్సప్లో వచ్చినటువంటి లింకును క్లిక్ చేయగా 252000/- వేల రూపాయలు పోగొట్టుకోవడం జరిగింది. అందులో 25 వేల రూపాయలు హెూల్‌లో ఉండగా రిఫండ్ చేయించడం జరిగింది. అదేవిధంగా మర్పల్లికి చెందిన బ్రాహ్మం 27 వేల రూపాయలను ఇంస్టాగ్రామ్‌లో ధనిలోన యాప్ ఇన్స్టాల్ చేయగా తన యొక్క 27000/- రూపాయలు పోయినవి అందులో 9600 హెూల్‌లో ఉండగా రిఫండ్ చేయించడం అయినది అదేవిధంగా మర్పల్లి కి చెందిన మల్లయ్య అతనికి వాట్సప్ లో వచ్చినటువంటి లింకును క్లిక్ చేయగా 90 వేల రూపాయలు పోగొట్టుకోవడం జరిగింది అందులో భాగంగా 35 వేల రూపాయల హెూల్డ్ లో ఉండగా 20,000 రిఫండ్ చేయించడం జరిగింది అదేవిధంగా నవాబ్ పేటకు చెందిన అరవింద్ రెడ్డి ఆన్లైన్లో గేమ్ ఆడి 1,20,000 పోగొట్టుకున్నాడు అందులో 90000/- హెూల్డ్ లో ఉండగా 60,000/-వేల రూపాయలు రిఫండ్ చేయించడం జరిగింది 30 వేల రూపాయలు కోర్ట్ ఆర్డర్ పెండింగ్లో ఉంది. అని మోమిన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ తెలిపారు. ప్రజలు ఎటువంటి గుర్తుతెలియని వ్యక్తుల నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు, పార్ట్ టైం జాబులకు సంబంధించిన ఫోన్ కాల్స్ కు ప్రజలు తమ సమాధానం ఇచ్చేటప్పుడు తమ యొక్క బ్యాంకు వివరాలు గానీ తమ ఎటిఎం వివరాలు గానీ ఎవరికి చెప్పకూడదు వాట్సాప్‌లలో వచ్చినటువంటి లింకులను క్లిక్ చేయకూడదు. ఏపీకే ఫైల్స్‌లను కూడా తెరవకూడదు. ఈ విధంగా తమ వ్యక్తిగత వివరాలను ఎవరికి షేర్ చేయకూడదు గుర్తు తెలియని వ్యక్తులతో చెప్పి మోసపోరాదు అని మోమిన్‌పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్ ప్రజలకు అవగాహన చేయనైనది. అదేవిధంగా అదేవిధంగా బాధితులకు జరిగినటువంటి విషయాలను తెలుసుకొని బాధితులకు తమ చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని చెప్పడం జరిగింది. బాధితులు తమ డబ్బులు తమకు రావడంతో హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఇప్పటివరకు మోమిన్‌పేట సర్కిల్‌లో 42,58,555 రూపాయలు సైబర్ క్రైమ్ ద్వారా పోగొట్టుకోవడం జరిగింది. అందులో 10,46,883 రూపాయలు ఓల్డ్లో ఉండగా 865778 రూపాయలు రిఫండ్ చేయించడం జరిగింది. రూపాయలు 1,81,005 రిఫండ్ పెండింగ్ ఉంది అని మోమిన్ పేట సీఐ వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోమిన్ పేట్ సిఐ వెంకట్ మోమిన్ పేట ఎస్ఐ అరవింద్ మోమిన్ పెట్ సర్కిల్ సైబర్ వారియర్ ఎండి జావిద్ భాష పిసి 6779 మరియు అనిల్ పిసి 9691 పాల్గొనడం జరిగింది.



# జూబ్లిహిల్స్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతాం

- 5.12 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ప్రజా పాలన ప్రభుత్వంలో అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధిపై ప్రణాళిక
- పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్, జూలై 11 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 5.15 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. షేక్ పేట్ వార్డులో 315.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఫ్లైఓవర్ క్రింద స్పోర్ట్స్ పార్క్‌కి, కమ్యూనిటీ డెవలప్మెంట్, ఫుట్‌పాత్‌తో పాటు హరిజన బస్తీ వద్ద సిసి రోడ్లు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఇక వెంగల్ రావునగర్ వార్డులో గురుద్వార్ కమాన్ వద్ద 100.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం యూసఫ్ గూడ వార్డులో రూ.95.75 లక్షల వ్యయంతో కమలాపురి అసోసియేషన్ కమ్యూనిటీహాల్ పక్కన చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణలకు శంకుస్థాపన చేశారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో 5 కోట్ల రూపాయలకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని జూబ్లిహిల్స్ నియోజకవర్గంను అన్ని రంగాల్లో ముందుంచుతామని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని సమస్యలు తొలగిస్తున్నామన్నాడు. గత 10 సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలో బస్తీలు, కాలనీలు అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రాతినిధ్యం వహించిన వారిలో వారికి సన్నిహిత ఉన్నవారి నియోజకవర్గాలు మాత్రమే అభివృద్ధి జరిగాయని వివక్షపూర్తితంగా వ్యవహరించారని పేర్కొన్నారు. హైదరాబాద్‌ల తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు లేకుండా పరిష్కారం చేస్తున్నామని నగరంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక ప్రణాళికలు వేస్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ఇళు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని,సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో పాటు మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, తమ ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి అండగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంత్రులు వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావులు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాము ఎక్కడికి వెళ్లిన ప్రజలు నాళాలు, సీసీ రోడ్లు, డ్రింకింగ్ వాటర్ సమస్యలను తీర్చమని పబ్లిక్ కోరుతున్నారని ప్రజా సమస్యలన్నింటినీ తీరుస్తామన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే స్పెషల్ శాంక్షన్ చేయించి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కమిషనర్ ఆర్వీ కర్ణన్,కలెక్టర్ దాసరి హరిచందన, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు, అధికారులు పాల్గొన్నారు.

# ఆకతాయిలకు చెక్ పెట్టేలా నిరంతరం నిఘా ఉంచాలి

- పోక్సో, అత్యాచార కేసులలో బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చూడాలి
- మహిళలపై జరిగే నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలి
- భరోసా కేంద్రాన్ని సందర్శించిన ఉమెన్ సేఫ్టీ వింగ్ ఎస్పీ చేతన



సంగారెడ్డి ప్రతినిధి, జూలై 11 (జనం సాక్షి) : ఆకతాయిలకు చెక్ పెట్టేలా నిరంతరం నిఘా ఉంచాలని ఉమెన్స్ సేఫ్టీ వింగ్ ఎస్పి చేతన పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా భరోసా కేంద్రాన్ని ఉమెన్స్ సేఫ్టీ వింగ్ ఎస్పి చేతన సందర్శించారు. ఈ సందర్భంగా చేతన భరోసా కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. ప్రతీ రికార్డును ఆన్లైన్ చేయాలని సూచించారు. భరోసా సెంటర్ కు వచ్చిన బాధ్యత మహిళలకు అన్ని రకాల సేవలు ఒకే గొడవ కింద అందించే విధంగా చూడాలని భరోసా సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీసు శాఖ, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖలో తదితర శాఖల సమన్వయంతో బాధిత మహిళలకు సత్వర న్యాయం జరిగే విధంగా మెడికో, లీగల్ సేవలు అన్ని భరోసా కేంద్రాలలో నిర్వహించే విధంగా చూడాలని అన్నారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ... పోక్సో, అత్యాచారా కేసులలో బాధితులను హక్కున చేర్చుకొని, వారిలో ధైర్యాన్ని నింపి, వారి సమస్యకు సత్వర పరిష్కారం దిశగా అన్నిరకాల సేవలను భరోసా సెంటర్ నందు అందించాలని అన్నారు. డ్యూటీ పరంగా ఎలాంటి సమస్యలున్న మా దృష్టికి తీసుకురావాలని, ఒక్కొక్క విభాగానికి చెందిన సిబ్బంది అందిస్తున్న సేవలను వివరంగా అడిగి తెలుసుకొని, తగు సలహాలు సూచనలు చేశారు. షి టీమ్ బృందాలు వివిధ పాఠశాల, కళాశాలల వద్ద విద్యార్థుల భద్రతకై నిరంతరం గస్తీ కాస్తూ ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టాలని సూచించారు. విజిటింగ్ లో భరోసా నోడల్ అధికారి సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ ఈ.సంజీవ రావు, ఇన్స్పెక్టర్ రామానాయుడు, భరోసా సెంటర్, షి టీమ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నాలాల ఆక్రమణల తొలగించిన హైడ్రా

- కూకట్‌పల్లి, చింతలబస్తీలో నాలాల విస్తరణ
- వరద సాఫీగా సాగేందుకు హైడ్రా చర్యలు



హైదరాబాద్, జూలై 11 (జనంసాక్షి) : నగరంలో నాలాల ఆక్రమణలను తొలగించడంపై హైడ్రా దృష్టి పెట్టింది. శుక్రవారం కూకట్‌పల్లి, ఖైరతాబాద్ పరిసరాల్లోని నాలాల ఆక్రమణలను తొలగించింది. నాలాల ఆక్రమణల వల్ల కాలనీలు, బస్తీలు నీట మునగకుండా చూడాలని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత అధికారులతో కలసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐడీఎల్ నాలాతో పాటు.. బుల్కాపూర్ నాలా ఆక్రమణలను తొలగించాలని ఆదేశించడంతో హైడ్రా రంగంలోకి దిగింది. శుక్రవారం ఈ రెండు నాలాల ఆక్రమణలను తొలగించే పనులు ప్రారంభించింది. రంగారెడ్డి జిల్లా శంకరపల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి మొదలైన ఈ నాలా ఐటీ ప్రాంతాలను సస్యశ్యామలం చేసి హైదరబాద్‌లో అడుగుపెట్టి చింతలబస్తీ, తుమ్మలబస్తీ మీదుగా ఖైరతాబాద్ చౌరస్తా మీదుగా హుస్సేన్ సాగర్‌లో కలుస్తున్న చరిత్ర ఈ నాలాది. ఈ నాలా చాలా చోట్ల ఆక్రమణలకు గురైంది. మరీ ముఖ్యంగా తుమ్మలబస్తీ – ఆనందనగర్ మధ్య 8 మీటర్లుండాల్సి ఉండగా.. కేవలం 5 మీటర్లకే పరిమితమైంది. దీంతో వర్షాలు పడినప్పుడు.. వరద సాఫీగా సాగక తుమ్మలబస్తీతో పాటు.. అటు ఆనందనగర్ కాలనీల్లోకి మురుగు నీరు పోటెత్తతున్నట్టు స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. శ్రీధర్ ఫంక్షన్ హాల్ యజమానులు నాలాలో నిర్మించిన ప్రహరీని హైడ్రా తొలగించింది. పై భాగంలో కూడా కొంతమేర ఆక్రమణ జరగగా.. అక్కడ నివాసితులు తమకు తాము తొలగిస్తామని హామీ ఇవ్వడంతో వారికి కొన్ని రోజులు హైడ్రా గడువు ఇచ్చింది. ఖైరతాబాద్ చౌరస్తా వద్ద కల్వర్టుకు ముందు ధర్మాకోల్ వ్యర్థాలను కూడా హైడ్రా తొలగించింది. దీంతో వరద సాఫీగా సాగేందుకు మార్గం ఏర్పడింది.

# రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలం

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి, జూలై 11 (జనం సాక్షి) : అసైన్ రైతుల నుంచి భూములు సేకరించడంలో చూపిన ఉత్సాహాన్ని అధికారులు భూ నిర్వాసితులకు పరిహారం అందజేయడంలో చూపడం లేదని సంగారెడ్డి బిఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. శుక్రవారం సంగారెడ్డిలో ఆయన మాట్లాడుతూ ఫసల్వాది, ఆరుట్ల, ఇంద్రకరణ్, కంది గ్రామాలలో హెచ్ఎండిఏ మోడల్ లే ఔట్ వేసేందుకు ల్యాండ్ పూలింగ్ జరిగింది. భూములు సేకరించగా అందులో భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి 600 గజాలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకొని ఇప్పటి వరకు వారికి హక్కు పత్రాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతూ తమకు అందాల్సిన పరిహారం అందించాలని అర్జీలు పెట్టిన పట్టించుకోవడం లేదని ఫైర్ అయ్యారు. దశాబ్దాలుగా అసైన్డ్ ల్యాండ్ నమ్ముకొని జీవన ఆధారాన్ని గడిపిన పేద రైతులు ఇప్పటికి పరిహారం అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ల్యాండ్ పూలింగ్ కోసం భూములు కోల్పోవడంతో రైతులకు గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం ద్వారా రైతులకు అందాల్సిన రైతు బంధు, రైతు భీమా పథకాలు అందడం లేదన్నారు. ల్యాండ్ పూలింగ్ తో రైతుల నుంచి భూముల పత్రాలను లాక్కొని ఇప్పటి లే ఔట్ వేయలేదని, రైతులు తీవ్ర అన్యాయానికి గురి అవుతున్నారని అన్నారు. ల్యాండ్ పూలింగ్ లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు తక్షణమే పరిహారం చెల్లించాలని, లేదా వారి భూములు వారికి అందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

# ఇబ్రహీంపట్నంలో గిరిజన బాలికల వసతి గృహం ప్రారంభం

ఇబ్రహీంపట్నం, జూలై 11 (జనం సాక్షి) : ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి



గృహంలో ఫిన్టెక్ వారి సహకారంతో సి ఎస్ ఆర్ నిధులతో 1 కోటి 10 లక్షల వ్యయం తో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఈ సందర్భంగా నేరెళ్ల శారద మాట్లాడుతూ కెఫిన్ టెక్నాలజీ ద్వారా ఈ హాస్టల్ను దత్తత తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించడం సంతోషించేదగ్గ విషయమని అన్నారు. అమ్మాయిలకు అన్ని వసతులతో సౌకర్యాలు ఉంటే చదువుకోడానికి ఉపయోగంగా ఉంటుందని సమాజంలో బాగు చేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేయడం అభినందించదగ్గ విషయమని ఒకప్పుడు అన్నదానం గొప్పగా భావించేవారు నేడు విద్యాదానం చేయడం అనేది గొప్ప విషయమని అన్నారు. అవకాశాలను ఉపయోగించుకొని బాగా చదివి సమాజానికి ఉపయోగపడాలని ప్రైవేట్ హాస్టల్ కంటే మెరుగ్గా ప్రభుత్వ హాస్టల్ ను ప్రభుత్వం అన్ని రకాల వసతులతో సదుపాయాలు కల్పిస్తున్నారని అన్నారు. ఉషా సంస్కృతిని వీడనాలని ఎలాంటి తారతమ్యాలు లేకుండా అందరికీ విద్య అందుబాటులో ఉండాలని ప్రతి ఇంటి నుంచి నిత్య అందరికీ ఒకే విధంగా ప్రధానికి ముఖ్యమంత్రికి లేఖ రాయాలని అన్నారు. సోషల్ మీడియా పట్ల ప్రమాదంగా ఉండాలని మన వ్యక్తిగత విషయాలు ఎవరికి చెప్పకూడదని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మహిపాల్, కెఫిన్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు, హాస్టల్ వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు ఘన స్వాగతం..




రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 11 (జనంసాక్షి) : రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీభూషణ్ రామకృష్ణ గవాయ్ కు శుక్రవారం నాడు సాయంత్రం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ తో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పగిడిగంటం శ్రీనర్సింహాలకు రాష్ట్ర హై కోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ తోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు డీజీపీ డా. జితేందర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, సైబరాబాద్ సిపి అవినాష్ మొహంతి ఏ.జి. సుదర్శన్ రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు.

# మెరుగైన వైద్యం కోసం 30 పడకల ఆసుపత్రి నిర్మాణం

- కోనాపూర్ నుండి మాడ్గుల వరకు డబల్ లైన్ రోడ్ల నిర్మాణం
- హాజరైన మంత్రులు దామోదర్ రాజనర్సింహ,
- కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 11 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షేమానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని మంత్రులు అన్నారు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల కేంద్రంలో 12.70 కోట్ల రూపాయలతో నిర్మించబోయే 30 పడకల ఆసుపత్రి భవనానికి, మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు మాడ్గుల నుండి దేవరకొండ రోడ్ వరకు రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించే బీటీ (డబుల్ లైన్) రోడ్డునకు శంకుస్థాపన చేశారు. మంత్రులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంబేద్కర్, జ్యోతిరావు పూలే, చాకలి ఐలమ్మ విగ్రహలకు,మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన రాష్ట్ర మంత్రులు, స్థానిక శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ,,,రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో భాగంగా నేడు మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు మాడ్గుల నుండి దేవరకొండ రోడ్డు వరకు డబల్ లైన్ రోడ్ పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని ,ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని,ఉచిత కరెంటు,రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని,రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ది పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ,,తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ ముందు తీసుకెళుతున్నామని,సన్న బియ్యానికి 500 రూపాయల బోనస్




ఇస్తున్నామని,ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇస్తున్నామని, 200 యూనిట్ల వరకు జీరో బిల్లు కరెంటు ఇస్తున్నామన్నారు. బీసీ కులగణన చేపట్టి 42 శాతం చేపట్టడం జరుగుతుందని అన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ,,,జిల్లాలోని మాడ్గుల కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యమును అందించేందుకు గాను మండలంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని,ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేసుకుంటూ ముందుకు వెళ్ళుతున్నామని,త్వరలోనే మహిళా సాధికారత సంపూర్ణంగా తీసుకురావడం జరుగుతుందని,పేదవారికి బాసటగా నిలుస్తూ సంక్షేమానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని పని చేస్తున్నామని అన్నారు. అనంతరం మంత్రులు మాడ్గుల మండలంలోని 220 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వరరావు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ హనుమంత్ రెడ్డి సంబంధిత అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై క్యాబినెట్ నిర్ణయం హర్షణీయం

- చట్టపరమైన ఇబ్బందులు లేకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.
- విద్యా ఉద్యోగ కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలి
- కామారెడ్డి డిక్లరేషన్ పూర్తిగా అమలు చేయాలి జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్

తాండూరు, జూలై 11 (జనంసాక్షి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని జాతీయ బిసి కార్యవర్గ సభ్యులు తాండూర్ నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్ కుమార్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం పంచాయతీరాజ్ చట్టం 2018 సవరించి ఆర్డినెన్స్ తేవడం ద్వారా రిజర్వేషన్లు వర్తింపజేయాలని నిర్ణయాన్ని సాగతిస్తున్నామని జాతీయ బిసి సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య మరియు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీసీల సమిష్టి విజయం అని అన్నారు. తెలంగాణ క్యాబినెట్ ఆర్డినెన్స్ తీసుకోవడం ఇది కేవలం మొదటి అడుగు మాత్రమేనని చట్టపరమైన ఇబ్బందులు ఎలాంటి అడ్డంకులు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలుయ్యేలా ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని అదేవిధంగా అన్ని వర్గాల వారు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. ఎన్నికలకు ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థల రిజర్వేషన్లతో పాటు విద్య,ఉద్యోగ,కాంట్రాక్ట్ లకు కూడా రిజర్వేషన్లను కల్పించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని కామారెడ్డి డిక్లరేషన్ లో చెప్పిన విధంగా అన్ని హామీలను అమలు



చేసేందుకు ఒక ప్రకటన విడుదల చేయాలి. కొత్తగా 22 వేల 33 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలన్న మంత్రివర్గ నిర్ణయంలో బీసీలకు 42 శాతం ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించాలని రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ సుకుర్ ,బిసి మహిళా జిల్లా అధ్యక్షురాలు మధు లత శ్రీనివాస్ చారి ,బిసి మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు అనిత ,ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి జగదీశ్వరి, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్ ,నాయి బ్రాహ్మణ సమాజ అధ్యక్షులు పరమేష్ ముదిరాజ్ ,సంఘం యువజన కార్యదర్శి రాము ముదిరాజ్, ఆర్య కటిక సమాజ్ నాయకులు సురేష్ స్వేరోస్, అధ్యక్షులు శివ ,సోషల్ మీడియా ఇన్చార్జ్ బసవరాజ్ ,బిసి యువ నాయకులు దుబాయ్ వెంకట్, నరసింహ, పండు గౌడ్ ,రమేష్, సయ్యద్ ,శ్రీశైలం ,బాలు ,సోమేష్, కిషోర్, వివేక్ ,జాంగిర్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | శనివారం 12 జూలై 2025

# దేశానికే దిక్సూచిగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం

- కల్వకుర్తి మండలంలోని 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ





**కల్వకుర్తి, జూలై 11 (జనం సాక్షి) :** కల్వకుర్తి నియోజకవర్గం లోని మాడుగుల వెల్దండ చారకొండ మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలకు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయడం జరిగింది. కల్వకుర్తి మండలంలోని ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలతో దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కల్వకుర్తి మండలం లోని వంగపడకల ఆసుపత్రి శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ప్రతి ఒక్కటి నెరవేర్చుకుంటూ వెళ్తుందని ఇందిరమ్మ రాజ్యంలోనే బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తూ ముందుకు వెళుతుందని అన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందని ముఖ్యంగా ఒకేసారి రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని కొనియాడారు. గత ప్రభుత్వాలు దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదని ఇచ్చిన 6 గ్యారెంటీలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజల బతుకులు మారుతాయని అన్నారు. వచ్చిన ఏడాదిలోపే చిన్న ప్రతి ఒక హామీని నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్నారని బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఏ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పరుస్తున్నారని అన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మేమంతా కలిసికట్టుగా పనిచేస్తున్నామని ముఖ్యంగా మహిళలకు అండగా నిలిచిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం మే అని అన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే ఏనాడు కూడా కల్వకుర్తి నియోజకవర్గని పట్టించుకోలేదని నేను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఎన్నో నిధులు తీసుకొచ్చి కల్వకుర్తి మండలానికి అభివృద్ధి అంటే చూపించానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గానికి 250 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. నా చివరి శ్వాస వరకు కల్వకుర్తి ప్రజల అభివృద్ధి కొరకే పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా ఎమ్మెల్యే కుచ్ కుల రాజేష్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూదిని రామ్ రెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బృంగి ఆనంద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ వావిలా సంజీవ్ యాదవ్, అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వరిసాగుపై ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

- సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. దశరథ్

**కొండాపూర్, జూలై 11 (జనం సాక్షి) :** వరి సాగు తెలంగాణ రాష్ట్రంలో అవసరం లేదని బిజెపి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడటం సరికాదని వరి సాగుపై రైతులను అవమానించేలా బిజెపి మాట్లాడటం సిగ్గుచేటని సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సి హెచ్ దశరథ్ అన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలంలోని మందా పూర్ వచ్చిన సందర్భంగా సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్. దశరథ్ జిల్లా కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి తో కలిసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వరి సాగు వద్దని చెప్పడం రైతులను భయ భ్రాంతులకు గురి చేయడం పద్ధతి కాదన్నారు. బియ్యం తినకుండా బతకలేమా తెలంగాణకు బియ్యం అవసరమా అని మాట్లాడటం ఎంతవరకు సమంజసము ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు . ఎంపీ అన్నం తినకుండానే జీవిస్తున్నారా అని ప్రశ్నించారు. వెంటనే ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ నేతలు రాష్ట్ర రైతాంగానికి క్షమాపణ లు చెప్పాలని డిమాండ్ చేశారు.



# వసతి గృహాల విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం

- వసతి గృహాల్లో మెనూ పాటించని వారిపై చర్యలు
- జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 11 (జనం సాక్షి) :** సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్లో ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలఅధికారులతో, జిల్లాలో వసతి గృహాల నిర్వహణ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై విస్తృతంగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వసతి గృహాలలో మౌలిక సదుపాయాల విషయంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. వసతి గృహాలలో నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్లు ,మంచినీటి నాణ్యత, ఆరోగ్యకరమైన వాతావరణం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ఆహార నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి మెనూను పాటించకపోతే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు సరైన సమయంలో పాఠ్యపుస్తకాలు నిబంధనలకు అనుగుణంగా యూనిఫాంలో అవసరమైన పాఠశాల సామాగ్రి అందించాలన్నారు. వసతిగృహాల్లో మరమ్మతులు చేపట్టాల్సిన మరమ్మతులు వివరాలు అందించాలని, పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కల్లెక్టర్ చంద్రశేఖర్ , సాంఘీక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డి ,బీసీ సంక్షేమాధికారి జగదీష్ , మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి దేవుజా పాల్గొన్నారు.

# క్రమశిక్షణకు కేరాఫ్ ఎన్‌సీసీ..!

- విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు
- ఎన్‌సీసీలో చేరిన 47 మంది విద్యార్థులు
- గత సంవత్సరం ఎన్‌సీసీలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ అందజేత




**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 11 (జనం సాక్షి) :** ఎన్సీసీ క్రమశిక్షణకు కేరాఫ్ అడ్రస్ కొనసాగుతోంది. హైస్కూల్, కళాశాల విద్యార్థులకు చదువుతో పాటుగా ఉత్తమ భవిష్యత్తు ఎన్సీసీ శిక్షణ ద్వారా అందుతోంది. అంకితభావం, నైతిక విలువలు, శారీరక దారుఢ్యం, దేశభక్తి వంటి అంశాలను విద్యా ర్థుల్లో పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్సీసీ కీలక భూమిక పోషిస్తోంది. రక్షణ రంగంలో రెండో వరుసగా, సైనిక, వైమానిక, నేవీ సంస్థలతో కూడిన ఎన్సీసీ దేశ రక్షణకు సంబంధించి విద్యార్థులను సమాయత్తపరిచే విభాగంగా పేర్కొంటారు. లేత ప్రాయంలో పసి పిల్లలను గారాబం చేస్తే ముద్దుగానే ఉంటుంది. కాని వారి భవిష్యత్ పై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. క్రమశిక్ష ణతో పాటు విద్యార్థులను మానసి కంగా, శారీరకంగా దృఢంగా తయారు చేయాలంటే కాస్త కఠిన శిక్షణ తప్పదు. సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలంటే చిన్ననాటి నుంచే వారి జీవనశైలి విభిన్నంగా ఉండాలి. అప్పుడే ప్రతి విద్యా ర్థి దేశానికి సేవ చేసే సైనికుడవుతాడు. అని అంటున్నారు ఎన్సీసీ అధికారులు. ఎన్సీసీలో చేరిన విద్యార్థులు క్రమశిక్షణతో పాటు వ్యక్తిత్వ వికాసం, మంచి నడ వడిక అలవర్చుకుంటున్నారు. యువత ఉజ్వల భవితకు ఎన్సిసి బాటగా నిలుస్తున్నది.

### ఎన్‌సీసీలో చేరిన 47 మంది విద్యార్థులు

సంగారెడ్డి జిల్లా రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాలలో 2025 -26 విద్యాసంవత్సరానికి ఎన్సిసిలో చేరికలు జరిగాయి 47 మందిని చేర్పించడం జరిగిందని అవల్దార్ (పిఐ) బల్వీందర్ సింగ్, ఎన్సిసి అసోసియేట్ అధికారి శంకర్ తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో గత సంవత్సరం ఎన్సిసి పరీక్ష రాసిన విద్యార్థులకు ఉత్తీర్ణత అయినట్లు సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని వార్తలు తెలిపారు. వేసవి సెలవుల్లో క్యాంపు పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపు సర్టిఫికెట్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, మీనా భవాని,వీణ, శంకర్, శ్రీనివాసు, కృష్ణ,,పాల్గొన్నారు.

## పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**శివ్వంపేట, జూలై 11 (జనంసాక్షి) :** శివ్వంపేట మండలం చెన్నాపూర్ గ్రామంలో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం ఏమాత్రం తీసిపోకుండా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. అనంతరం వివిధ అనారోగ్య సమస్యలతో పలు దవాఖానాలలో వైద్యం పొందిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వారి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా పరిషత్ మాజీ కోప్షన్ సభ్యులు మన్సూర్, మాజీ సర్పంచ్ బోళ్ల భారతి భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, మాజీ ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు నర్సింగరావు, నువ్వుల దశరథ, ఆకుల ఇందిరా శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షులు ములుగు నాగేశ్వరరావు, నాయకులు మర్రి మహేందర్ రెడ్డి, నరసింహారెడ్డి, మహిపాల్ రెడ్డి, భిక్షపతి రెడ్డి, రాంచందర్ గౌడ్, జగన్ రెడ్డి, సంతోష్ కుమార్, బోళ్ల మధు లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

### పత్తాలేని డీఈఈ, ఏఈ

మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో ఎన్ ఆర్ ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి స్థానిక శాసన సభ్యురాలు సునీతా లక్ష్మారెడ్డి హాజరైన ఈ కార్యక్రమానికి పంచాయతీ రాజ్ నర్సాపూర్ డి ఈఈ గానీ, శివంపేట ఏఈ, మండల స్థాయి అధికారులు గానీ ఎవ్వరూ కూడా జీపీ బిల్డింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కాకపోవడం ఏమిటని పలువురు చర్చించుకోవడం జరిగింది.

## వనపర్తి జిల్లాలో భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జూలై 11 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లాలో భారీ వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలిపారు .వర్షాల సమయంలో ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేందుకు జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రమాదకర పరిస్థితి ఏర్పడితే వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 08545-233525, 08545-220351 నువ్వ సంప్రదించవచ్చు అని తెలిపారు. ప్రజలు వానకు సంబంధించి ఎలాంటి అపాయకర పరిస్థితులు, నీటి ముంపు ప్రాంతాలు ఇతర సమస్యలపై వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉన్నదని, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- నీళ్లు నిల ఉండకుండా చూసుకోవాలి
- ఫ్రైడే డ్రైడేలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**మెదక్ జిల్లా బ్యూరో, జూలై 11 (జనం సాక్షి) :** వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ నీళ్లు నిలువ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నిజాంపేట మండలం రాంపూర్, నగరం గ్రామాలలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి ఫ్రైడే డ్రై డే పరిసరాల పరిశుభ్రత, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమైందని శానిటేషన్ పనులు విస్తృతంగా చేపట్టాలన్నారు. పిచ్చి మొక్కలు తొలగించాలని మురుగు కాలువలు శుభ్రపరచాలని దోమల ను పారద్రోలేందుకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ చికెన్ గున్యా మలేరియా వంటి జరాలు సోకకుండా సిబ్బంది అందుబాటులో ఉండాలని అధికారులు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకుంటూ అపరిశుభ్రత ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యం, విస్తృతంగా చేపట్టాలి...ఫ్రై డే, డ్రై డే నిరంతరం నిర్వహణ ఉండాలన్నారు. పంచాయతీ సెక్రెటరీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీలు క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శించి ప్రజల ఆరోగ్య పరిరక్షణపై తగిన సూచనలు సలహాలు అందిస్తున్నారన్నారు.

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు, ఎయిర్ కూలర్లు పాత టైర్లు, లలో దోమలు నిల్వ ఉండి గుడ్లు పెట్టి ప్రజలకు వివిధ రకాల వ్యాధులను కలుగజేస్తాయని వివరిస్తూ పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారించాలన్నారు.మల్టీపర్పస్ వర్కర్స్ ఈ రెండు మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాల పరిశుభ్రత దృష్టిపెట్టే విధంగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తూ నాగారం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు మొత్తం లబ్ధిదారులు ప్రారంభించడం జరిగిందని శుభ పరిణామంగా పేర్కొన్నారు జిల్లావ్యాప్తంగా 9 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని ఇప్పటివరకు 5 వేల ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించి వివిధ దశలలో నిర్మాణాలు కొనసాగుతున్నాయని చెప్పారు. లబ్ధిదారులకు ఇల్లు ప్రారంభించి బేస్మెంట్ స్థాయి పూర్తి చేసిన పక్షంలో అత్యంత పారదర్శకంగా వారం రోజుల్లో లబ్ధిదారుల ఎకౌంట్లో 1 లక్ష రూపాయలు జమ చేయడం జరుగుతుందని వివరించారు. పంచాయితీ మల్టీపర్పస్ వర్కర్లకు జూన్ మాసం వరకు జీతాలు జమ చేయడం జరిగిందని ఉత్సాహంగా సేవలు అందిస్తున్నారని వారి సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ముంచిన నకిలీ మందులు

- షాపు యజమానిపై చర్యలు తీసుకోవాలి
- లబోదిపోమంటున్న రైతు వెంకట్ నాయక్



**నారాయణఖేడ్, జూలై 11 (జనం సాక్షి) :** నకిలీ విత్తనాలు, నకిలీ గడ్డి మందులు, నకిలీ గైసిల్ మందులను నమ్మి రైతులు మోసపోకుండా ఒకవైపు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుంటే. కొంతమంది దళారులు మాత్రం రైతులను నిండా ముంచుతున్నారు. నారాయణఖేడ్ డివిజన్‌లోని మనూర్, నాగల్ గిద్ద, నారాయణఖేడ్, సిర్గాపూర్, కల్హేరు, నిజాంపేట, కంగ్టి మండలాలలో ఫర్టిలైజర్ యజమానులు అధిక దిగుబడి వస్తుందని ఆశ చెప్పి నకిలీ విత్తనాలను అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. రైతులను నిలువున ముంచుతున్న దళారులు ఆట కట్టించడంలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారు. నకిలీ విత్తనాలమ్మితే కఠిన చర్యలు చేపడతామని అంటున్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదు. దీంతో నకిలీ విత్తనాల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తోంది. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయింది అన్న చందంగా ప్రస్తుతం రైతుల పరిస్థితి తయారయింది. రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాలు, నకిలీ మందుల విక్రయాలను అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్న వ్యవసాయ అధికారుల అండదండతో ఫర్టిలైజర్ షాపుల యజమానులు తీరు మాత్రం మారడం లేదు. ఫర్టిలైజర్ షాప్ లో యజమానులు తమ స్వలాభం కోసం నకిలీ విత్తనాలు, నకిలీ గడ్డి మందులు, గైసిల్ విక్రయిస్తూ రైతులను నిండ ముంచుతున్నారు. సరిహద్దులో ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్, సిర్గాపూర్, కల్హేరు , నిజాంపేట , మనూర్, నాగల్ గిద్ద, కంగ్టి మండలాలకు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి నాసిరకం మందులు తెచ్చి అమాయకులకు అంటగడుతున్నారు. ఫర్టిలైజర్ దుకాణాలు మమ్మల్ని ఆపేది ఎవరన్నా ధీమాతో యథేచ్ఛగా వ్యాపారులు రైతులకు నకిలీ మందును అంటగడుతున్నారు. మనూరు మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన రైతు రాథోడ్ వెంకట్ నాయక్ తన పత్తి పంటకు వారం క్రితం ఫర్టిలైజర్ దుకాణంలో పత్తి కోసం గైసిల్ మందును కొనుగోలు చేశారు. దీంతో గైసిల్ మందు రెండు ఎకరాల్లో పత్తి పొలంలో వాడారు. కానీ మందు వేసిన కొద్దిసేపటికి పత్తి పంట పూర్తిగా వాడిపోయింది. పంటను చూసి తల్లడిల్లిన రైతు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే గైసిల్ మందు విక్రయించిన షాపు యజమానిని అడగాలని ఉచిత సలహాలు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. దీంతో అయోమయంలో పడిపోయిన రైతు మందు విక్రయించిన యజమానిని నిలదీశారు. అయినా అధికారుల అండదండలు ఉన్నా ఫర్టిలైజర్ షాప్ యజమాని రైతునే దబయించాడు. తాను ఇచ్చింది నాణ్యమైన కంపెనీ గైసిల్ మందులే అని, మీరే సరిగా పిచికారి చేయలేదని ఎదురు సమాధానం ఇచ్చాడు రైతులకు, నాగల్ గిద్ద మండల కేంద్రంలో తుల్జా భవాని ఫర్టిలైజర్ షాపు యజమాని సమాధానంతో కంగుతిన్న రైతు నువ్వు అమ్మిన మందును నువ్వు చెప్పినట్లే పిచికారి చేశామని గట్టిగా నిలదీయడంతో పాటు ఆందోళన దిగడంతో షాప్ యజమాని దుకాణం యజమాని కాళ్ల బేరానికి వచ్చాడు. నకిలీ గై సీల్ మందు పిచికారి మూలంగానే తమ పత్తి పంట ఎండిపోయిందని ఫర్టిలైజర్ యజమానికి నిలదీశారు. రైతు ఫిర్యాదుతో వ్యవసాధికారి మహేష్ చౌహాన్ పంట పరిశీలించారు. అనంతరం ఫర్టిలైజర్ యజమానితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. నష్టపోయిన రాథోడ్ వెంకట్ నాయక్ కు నష్టపరిహారం ఇవ్వనున్నట్లు హామీఇచ్చారు.

# వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి జులై 11(జనంసాక్షి) :** భారీ వర్షాలతో ఏర్పడే వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం నాడు మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండలం సర్వా, వేమనపల్లి మండలం రాచర్ల గ్రామాలలో ప్రాణహిత నది తీరంలో వరద నీరు పంట చేలలోకి రావడంతో కోటపల్లి మండల తహశిల్దార్ రాఘవేందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మయ్య, సి.ఐ. బన్సీలాల్ లతో కలిసి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వరద కారణంగా నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున చేపలు పట్టేందుకు, వాగులు, నదులు దాటేందుకు ఎవరు వెళ్ళకుండా బందోబస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలందరికీ తెలిసే విధంగా గ్రామాలలో టాం-టాం వేయించాలని తెలిపారు. గ్రామాలలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. వరద విపత్తి సమయంలో ప్రజల సహాయార్థం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యుత్ బిల్లుల సంబంధిత సమస్యలపై సైతం ఈ నంబర్లో సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని, పాఠశాలలో కొనసాగుతున్న మూత్రశాలల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలకు వచ్చేలా చూడాలని, విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎ.ఓ., సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎమ్ఆర్ త్వరగా రైస్ మిల్లర్లు సహకరించాలి

**జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జనగామ ప్రతినిధి, జూలై 11(జనంసాక్షి) :** రబీ, ఖరీఫ్ 2024.25 సీఎంఆర్ డెలివరీ, రేషన్ కార్డులు, రెవెన్యూ సదస్సు లలో వచ్చిన దరఖాస్తులు తదితర అంశాల పైన అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తహసీల్దార్ లతో, రైస్ మిల్లర్ల తో రివ్యూ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యాలను అనుగుణంగా రైస్ మిల్లర్లు సీఎంఆర్ను నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలన్నారు. లేనిచో చర్యలు తప్పవన్నారు. ఖరీఫ్ (వానాకాలం) 2024-25 సీజన్ కు సంబంధించి 91827.554 మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను 73664.210 మెట్రిక్ టన్నుల బియ్యం, (80.22%) ఇప్పటికే మిల్లింగ్ చేసి డెలివరీ చేయగా ఇంకా 18163.344 మెట్రిక్ టన్నులు డెలివరీ చేయాల్సి ఉందనీ.... అలాగే రబీ (యాసంగి) 2024-25 సీజన్ కు సంబంధించి 144834.216 మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను 38135.916 మెట్రిక్ టన్నుల బియ్యం, (26.33%) ఇప్పటికే మిల్లింగ్ చేసి డెలివరీ చేయగా ఇంకా 106698.300 మెట్రిక్ టన్నులు డెలివరీ చేయాల్సి ఉందన్నారు. దేవరోప్పుల మండలం మన్పహాడ్ గ్రామానికి చెందిన శ్రీ సాయి రామ్ మోడ్రన్ బిన్నీ రైస్ మిల్ రబీ 2022 -23 అలాగే 2023 -24 పంటకు సంబంధించిన 5.67 కోట్ల విలువగల సిఎంఆర్ ను క్లియర్ చేయనందున యజమాని పి చంద్రశేఖర్ రెడ్డి పైన క్రిమినల్ కేసు వేయడం జరిగిందని.. అలాగే రెవెన్యూ రికవరీ ఆక్ట్ ప్రకారం ఆస్తుల జప్తుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండ... రైస్ మిల్లర్ యజమానులు.. సివిల్ సప్లై అధికారులు సమన్వయము గా పని చేయాలిసిన అవసరం ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ లతో సమీక్షిస్తూ.. కొత్త రేషన్ కార్డు ల జారీ అలాగే పాత రేషన్ కార్డు లలో మార్పులు, చేర్పులు కి సంబందించి ప్రక్రియ వేగవంతం కావాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, నోటిస్ లు ఇచ్చిన దరఖాస్తు లకి సంబందించి వారం లో రెండు రోజులు హియారింగ్స్ పెట్టి భూ సమస్య లను పరిష్కరించాలన్నారు. ఎన్ ఎఫ్ బి ఎస్ దరఖాస్తు లకు సంబందించి అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనను వేగవంతం చేయడం వలన ఎన్ ఎఫ్ బి ఎస్ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 769 మంది అర్హులైన లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వానికి పంపగా.. అందులో 576 మందికి 20,000 చొప్పున 1,15,20,000 రూపాయలు మంజూరు అయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశం లో ఆర్డీవో లు, సివిల్ సప్లై అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నేరాల నియంత్రణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

**వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్...**

**చెన్నారావుపేట, జూలై 11 (జనం సాక్షి):** నేరాల నియంత్రణ పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్ లో నమోదు అవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేసులు పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు.రాత్రి వేళలో దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని సివిల్ వివాదాల్లో తలదూర్చకూడదని సూచించారు. విధుల పట్ల ఎవరైనా అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, నెక్కొండ సిఐ శ్రీనివాస్, చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న కాళేశ్వరం భూ సేకరణ పనులు వేగవంతం



**భూపాలపల్లి, జూలై 11 (జనం సాక్షి):** జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం కాటారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఫైళ్ళను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ భారతి లో వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకుని ఎంత మందికి నోటీసులు జారీ చేశారని ప్రశ్నించారు. మొత్తం మండలంలో 5,610 భూభారతి దరఖాస్తులు వచ్చాయని అందులో 412 మంది దరఖాస్తు దారులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపగా, భూ భారతి లో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆగస్ట్ 15 వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు ,డిటి రామ్మోహన్, ఆర్.ఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫైలేరియాను అరికట్టాలి

**మహబూబాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవిరాథోడ్**



**మహబూబాబాద్ బ్యూరో , జూలై 11(జనం సాక్షి):** ఫైలేరియాను అరికట్టాలని మహబూబాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవిరాథోడ్ అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలోని ఐఎంఏ భవనంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ జాతీయ ఫైలేరియా నియంత్రణలో భాగంగా మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో 6 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటి ఉప కేంద్రాల సిబ్బంది, వైద్యాధికారులకు సన్నాహక ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ మాట్లాడుతూ పై ఫైలేరియా వ్యాధి ముఖ్యంగా మురికి నీటిలో పెరిగే క్యూలెక్స్ దోమ వల్ల ఒకరి నుండి ఒకరికి వ్యాపిస్తుందని పరిసరాల పరిశుభ్రత మురుగునీరు నిల్వ ఉండకుండా చూడడం దోమలు పెరిగే ప్రాంతాలను గుర్తించి వాటిని పూడ్చివేయడం, ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి దోమల పెరుగుదలను అరికట్టాల్సిన బాధ్యత అందరి పైన ఉందని తెలిపారు. ఫైలేరియా వ్యాధిని నియంత్రించడానికి తప్పకుండా డీఈసీ ట్యాబ్లెట్లు మింగించాలని, మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ శిక్షణ జిల్లాలోని కోమట్ల గూడెం, గంగారం, కొత్తగూడ,బయ్యారం, ముల్కనూరు, గంధంపల్లి, పీహెచ్సీలో పరిధిలోని వైద్యాధికారులకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు, హెచ్ఈఓస్, సూపర్వైజర్స్, ఎం ఎల్ హెచ్ పీ ల కి,ఒకరోజు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని సిబ్బంది అందరూ మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ సునీల్ కుమార్ జోనల్ మలేరియా ఆఫీసర్ , ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ శిరీష పాల్గొని సిబ్బందికి శిక్షణ ఇస్తూ ఈ మధ్యకాలంలో చేసిన సర్వేల ఆధారంగా ఫైలేరియా వ్యాధికి కారణమైన మైక్రో ఫైలేరియా ఆనవాళ్లను ఐదు సంవత్సరాల పిల్లల్లో గుర్తించడం జరిగిందని, జిల్లాలో పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని, ప్రతి గ్రామంలో తేదీ 10-08-2025 నుండి 25-08-2025, వరకు డిఇసి టాబ్లెట్లను, ఆల్బెండజోల్, ఐవర్ మెట్రిన్, మింగించడం జరుగుతుందని, పేర్కొంటూ ముఖ్యంగా డీఈసీ టాబ్లెట్లు, రెండు సంవత్సరాలు లోపు పిల్లలకి ఇవ్వకూడదని, అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు ఇవ్వకూడదని, దీర్ఘకాలపు వ్యాధులు ఉన్న వారికి కూడా ఈ టాబ్లెట్లు ఇవ్వకూడదని, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ సారంగం, డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్యాధికారులు, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, హెల్త్ఎడ్యుకేటర్ పురుషోత్తం, కె.వి.రాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ రామక్రిష్ణ, స్వామి, ఫా హీముద్దీన్, లింగారెడ్డి, అనిల్ ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పేదవారి కళను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



**ములుగు ప్రతినిధి, జులై 11 (జనంసాక్షి) :** పేద వాడి కలలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజా, నిర్మాణం పనులను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థ సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి 5 లక్షల రూపాయలతో ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. పేదవారి సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన నిరుపేదల అందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎంపిడిఓ రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటి సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# మూత లేని సెప్టిక్ ట్యాంక్ భక్తుల ప్రాణాలతో చెలగాటం



**కాళేశ్వరం, జూలై 11 (జనం సాక్షి) :** భూపాలపల్లి జిల్లా లోని కాళేశ్వరం లో సరస్వతి పుష్కరాల సందర్భంగా సాధారణ పుష్కర ఘాట్ వద్ద నిర్మించ తలపెట్టిన శౌచాలయాల సెప్టిక్ ట్యాంక్ పై మూత లేకపోవడం గమనార్హం. సదరు కాంట్రాక్టర్ సరస్వతి పుష్కరాల వరకే నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ పుష్కరాలు సమీపించడంతో దానిని అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చేయబడుతున్నప్పటికీ నిర్మాణం బయట తీసిన సెప్టిక్ ట్యాంకుపై మూత పెట్టకపోవడంతో భక్తుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. నది ఉదృతంగా ప్రవహిస్తూ ఉండడం , పుష్కర ఘాట్ ఒడ్డుపై భక్తులు నడుస్తూ పూజలు నిర్వహిస్తుండడంతో సదరు సెప్టిక్ ట్యాంక్ మధ్యలో ఉండి మూత లేకపోవడంతో భక్తులు అందులో పడి గాయాల పాలయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు సదరు నిర్మాణంపై దృష్టి పెట్టి ఆ ట్యాంక్ పై మూత ఏర్పాటు చేసే విధంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# అంతర్రాష్ట్ర రాకపోకలకు అంతరాయం

**163 జాతీయ రహదారిని ముంచెత్తిన గోదావరి వరద నీరు**



**వాజేడు, జూలై 11 (జనంసాక్షి) :** ఇటీవల ఎగువ రాష్ట్రాలలో కురిసిన వర్షాల కారణంగా గోదావరి అత్యధికంగా చేరడంతో ఉధృతంగా పెరుగుతూ ఉగ్రరూపం దాల్చింది. ములుగు ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు వద్ద మూడు గంటల సమయానికి గోదావరి నీటిమట్టం 15 మీటర్లకు చేరుకుంది.దీనితో తెలంగాణ- ఛత్తీస్ ఘడ్, సరిహద్దు ప్రాంతమైన టేకులగూడెం గ్రామం వద్ద 163 జాతీయ రహదారిపైకి గోదావరి వరద నీరు చేరడంతో అంతరాష్ట్ర రాకపోకలకు అంతరాయం కలిగింది. రహదారిపై నుండి మూడు అడుగుల ఎత్తులో వరద ప్రవహిస్తూ ఉండడంతో అటువైపుగా వెళ్లేందుకు ఎవరూ సాహసించడం లేదు. కొంతమంది మాత్రం సాహసించి వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

# ఫోరెన్సిక్ అండ్ టాక్సికాలజీ వైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సు

**ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి**




**వరంగల్ ఎంజీఎం, జూలై 11(జనంసాక్షి):** కాకతీయ మెడికల్ కాలేజీలో ఫోరెన్సిక్ అండ్ టాక్సికాలజీ వైద్యుల రాష్ట్రస్థాయి రెండు రోజుల సదస్సుకు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ మరియు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మల గీతాంబ మాట్లాడుతూ "ఫోరెన్సిక్ విభాగంలోని నిపుణులందరూ ఒకే వేదిక లో చర్చించుకునే అవకాశం కాబట్టి కార్యక్రమం ఫలవంతం కావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆకాంక్షించారు. కోర్టులలో జరిగే నేర విచారణ ప్రక్రియలో ఈ ఫోరెన్సిక్ అంశం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చిన్న చిన్న దొంగతనాలు మొదలుకొని హత్య వంటి ఘోరమైన నేరాలు జరిగినప్పుడు నిందితుల ఆచూకీ గుర్తించటానికి ఈ విభాగం ఉపయోగపడుతుందన్నారు. ఇటీవల గుజరాత్లో జరిగిన విమాన ప్రమాదంలో మృతులను డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించి వారి కుటుంబ సభ్యులకి అందజేసిన ఉదంతాన్ని న్యాయమూర్తి గుర్తు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య గారు మాట్లాడుతూ... మెడికల్ విభాగంలో ఫోరెన్సిక్, పాథాలజీ వైద్యులు కీలక పాత్ర పోషిస్తారని ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. నేర విచారణలో ఫోరెన్సిక్ ఆధారాల ప్రధానమని తెలిపారు. వైద్యపరమైన ఆధారాలను విశ్లేషించడంతో పాటు న్యాయ ప్రక్రియలో ఫోరెన్సిక్ వైద్యులు సహాయం చేస్తారని పేర్కొన్నారు. అనుమానాస్పద మరణాలు, హత్యలు, ప్రమాదాలు, ఆత్మహత్యల వంటి సందర్భాల్లో ఫోరెన్సిక్ వైద్యులు పాత్ర గొప్పదని అన్నారు. ఫోరెన్సిక్ వైద్యుల సమస్యలను పార్లమెంట్ వేదికగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఏడాది ఫోరెన్సిక్ స్టేట్ కాన్ఫరెన్స్ నిర్వహించాలని తద్వారా ఏమైనా సమస్యలు ఉంటే త్వరగా పరిష్కరించుకోవచ్చని ఎంపీ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కెఎంసి ప్రిన్సిపల్ సంధ్య, ఫోరెన్సిక్ వైద్యుల రాష్ట్ర అధ్యక్షులు అభిజిత్ సుబేదా, ఉస్మానియా హెచ్ ఓ డి శ్రీధరాచారి, గాంధీ హెచ్ ఓ డి కృపా సింగ్, ఇతర ఫోరెన్సిక్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక జనాభాతో అభివృద్ధికి ఆటంకం

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి..**




**వరంగల్ ప్రతినిధి, జులై 11 (జనంసాక్షి):** అధిక జనాభాతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వరంగల్ కలెక్టరేట్ లో శుక్రవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అనర్థాలకు కారణం అవుతుందన్నారు. ఈమేరకు జనాభా నియంత్రణ అవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. జనాభా నియంత్రణ అదుపులో ఉండాలని, లేనిచో భావితరాలకు మౌలిక వసతులు, ఆరోగ్య రంగంపై ఒత్తిడి, విద్యా వనరులపై ప్రభావము ,ఉద్యోగ అవకాశాల కొరత ,లింగ అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు వస్తాయని ,వనరులు సరిపోక సమస్యలు ఉద్భవిస్తాయని అన్నారు. జనాభాను నియంత్రణలో ఉంచడానికి బాలికల విద్యను ప్రోత్సహించాలని, బాల్య వివాహాలను నిర్మూలించాలని ,గర్భ నిరోధక పద్ధతులపై అవగాహన కల్పించాలని, ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహించాలని, సామాజిక అభిప్రాయాలను మార్చడానికి విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖతోపాటు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలలో జనాభా పెరుగుదల వలన వచ్చు సమస్యల పైన అవగాహన కల్పించాలని అన్నారు.ఈ సందర్భంగా జనాభా నియంత్రణలో కృషిచేసిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని సన్మానించడం, కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన దంపతులకు వెయ్యి రూపాయల ప్రోత్సాహక బహుమతి కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.అనంతరం జనాభా పెరుగుదలను అరికట్టడానికి ప్రజల్లో అవగాహన కల్పనకు రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముందుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం ఈ సంవత్సరం థీమ్ "శరీరము మరియు మనసు సిద్ధంగా ఉన్నప్పుడే తల్లి కావడానికి సరి అయిన సమయం" పురస్కరించుకొని ఎంజీఎం వరంగల్ నర్సింగ్ స్కూల్ వద్ద నుండి ఎంజీఎం సర్కిల్ వరకు నర్సింగ్ విద్యార్థులు ,వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ద్వారా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బి సాంబశివరావు వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం జరుపు కోవడం 1989 జులై 11న మొదలైనదని తెలిపినారు. ప్రపంచంలో ఇండియాలోనే జనాభా మొదటి స్థానంలో చేరుకున్నది, దానిని నియంత్రించడానికి వైద్య ఆరోగ్యశాఖ ప్రజలలో తాత్కాలికమైన , శాశ్వతమైన కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్వో విజయలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య, ఆర్ఎంఓ డాక్టర్ శశి కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అర్చన, డాక్టర్ ఆచార్య , డాక్టర్ విజయకుమార్, డాక్టర్ మోహన్ సింగ్, వైద్యాధికారులు ఆరోగ్యశాఖ సిబ్బంది, నర్సింగ్ కాలేజ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



- పకడ్బందీగా సంస్థాగత నియామకాలు
- యువకులకూ ప్రాధాన్యత కల్పిస్తాం
- సిడబ్ల్యూసి ఆహ్వానితులు చల్లా వంశీ చంద్ రెడ్డి

**ఖమ్మం, జూలై 11 (జనం సాక్షి) :** కాంగ్రెస్ తోనే అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతుందని అందరికీ సమన్యాయమే కాంగ్రెస్ ప్రధాన సిద్ధాంతమని సిడబ్ల్యూసి శాశ్వత ఆహ్వానితులు, మాజీ ఏఐసీసీ కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సూచన మేరకు ప్రతి పోలింగ్ బూత్లో కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. పోలింగ్ స్థాయిలో పోలింగ్ బూత్ కమిటీ, గ్రామ శాఖ, మండల శాఖ,జిల్లా శాఖ అన్ని స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేసుకొని ఈ కమిటీలను బలోపేతం చేయబోతున్నామని అన్నారు. అందుకు గాను 2025 సంవత్సరాన్ని సంస్థాగత సంవత్సరంగా అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. దానిలో భాగంగా గుజరాత్ ను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోని పూర్తి చేయడం జరిగింది అని అన్నారు .ప్రతి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నియామకం కోసం స్వయంగా రాహుల్ గాంధీ గుజరాత్ వెళ్లి ప్రతి జిల్లాకు ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి స్థాయి వాళ్లను కూడా ప్రతి జిల్లాకి ఒకరని పంపించి అక్కడ ఉన్నటువంటి కార్యకర్తలతోటి నాయకులతోటి ప్రతి ఒక్కరితో మాట్లాడి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను నియమించడం జరిగింది అని అన్నారు. నాతోపాటు ఇంకా 9 మందిని ప్రతి ఒక్కరిని ఒక్కొక్క ఉమ్మడి జిల్లాకు వ్యవహారాలను చూడడానికి మండల కమిటీలు మండల అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ కమిటీలను ఆ నియామకాలని పర్యవేక్షించడానికి తనను కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాకి ఇన్చార్జిగా నన్ను పంపించడం జరిగిందని అన్నారు.

వివిధ కార్పోరేషన్లు వివిధ గవర్నమెంట్ డైరెక్టర్లు మెంబర్లకు సంబంధించినటువంటి నియామకాలు రాష్ట్ర స్థాయిలో పూర్తి చేయడానికి ఈ జిల్లా నుంచి ప్రతిపాదనలు 12వ తారీకు వరకు పిసిసి అధ్యక్షులకు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి,మహబూబాబాద్ ఇంచార్జి పోట్ల నాగేశ్వరరావు, ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గ ఇంచార్జి చక్కిలం రాజేశ్వరరావు, వైరా, సత్తుపల్లి నియోజకవర్గ ఇంచార్జి దైదా రవీందర్,అశ్వారావుపేట నియోజకవర్గ ఇంచార్జి పెసర మహిపాల్ రెడ్డి,సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ సభ్యులు శ్రీమతి మట్టా రాగమయి,ఖమ్మం సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావేద్, సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, టి పి సి సి ప్రధాన కార్యదర్శులు కట్ల రంగారావు,మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, టి పి సి సి అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, మండవ సుమంత్ రెడ్డి, పాపతోటి భాగ్యరాజు, సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,పుచ్చకాయల వీరభద్రం, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు యడ్లపల్లి సంతోష్, జెర్రిపోతుల అంజనీ కుమార్,కార్పొరేటర్ మహ్మద్ రఫీదాబేగం, ముస్తఫా తదితర నాయకులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటితేనే భావి తరాలకు భవిష్యత్

- ఎమ్మెల్యే పోచారం



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూలై 11 (జనం సాక్షి) :** భావి తరాలకు భవిష్యత్తు ఉండాలంటే ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అయన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచి, ఆకుపచ్చని తెలంగాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం-2025 కార్యక్రమంలో బాగంగా శుక్రవారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం 2కోట్ల 75లక్షల ఎకరాలు, ఈ ప్రకృతి మనకు అనుకూలంగా ఉండాలి అంటే సరైన సమయంలో వర్షాలు పడాలంటే వాతావరణం సమతుల్యం ఉండాలి, ఈ ప్రయత్నంలోనే మన రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం-2025 కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది 18.02 కోట్ల మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఇందులో అత్యధికంగా పంచాయతీరాజ్ శాఖ 7 కోట్లు, పురపాలక శాఖ 8 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ మేరకు ఆయా శాఖలు, జిల్లాల వారీగా పలు లక్ష్యాల్ని నిర్దేశించారు. అటవీ, వ్యవసాయ శాఖలు కూడా కోటి మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అందుకు గాను ప్రతి ఇంటికి ఆరు మొక్కలను ప్రభుత్వం నుండి పంపిణీ చేయనున్నామని, పంపిణీ చేసిన మొక్కలను విద్యార్థినివిద్యార్థులే కాకుండా ఉపాధ్యాయ బృందం, అధికారులు, ప్రతి ఒక్కరు మొక్కలను నాటి ఈ మహోత్సవం-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అవకాశాలను అందిపుచ్చుకోండి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

చర్ల, జూలై 11 (జనం సాక్షి) : ప్రభుత్వం కల్పించే ప్రతి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జిపిఎస్ వి పాటిల్ పేర్కొన్నారు. చతిస్గడ్ తెలంగాణ సరిహద్దులోని చర్ల మండలం మారుమూల పూసుగుప్ప గ్రామంలో 81 బెటాలియన్ క్యాంపు సరిహద్దుల్లో కోటిన్నర వ్యయంతో నిర్మించిన సంచార వైద్యశాలను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి ఆయన మాట్లాడారు. ఎంత మారుమూల ప్రాంతంలో ఆసుపత్రి ఏర్పాటు ఎంతో శుభ పరిణామం అన్నారు. మారుమూల ప్రాంతాల ప్రజల కు ప్రత్యేక వైద్య సేవలు అందించే సంకల్పంతో ఈ ఆసుపత్రి నిర్మాణం చేయడం జరిగిందన్నారు. సరిహద్దు గ్రామాల ప్రజలు ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలన్నారు. గ్రామాలలో వనరులను సద్విని చేసుకొని తద్వారా ఆర్థిక సావాలమ్మ దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ సూచించారు. పత్తి సాగులో అంతర్ పంటగా మునగ సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే చేపల పెంపకాన్ని చేయడం ద్వారా ఆర్థికంగా ముందుకు సాగవచ్చు అన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరగటం కోసం మేకలను పెంచుతూ వాటి పాలను తాగించాలన్నారు. ఈ సందర్భంగా వారు నూతన అంబులెన్స్ ను జెండా ఊపి ప్రారంభించారు. సిఆర్పిఎఫ్ 81 కమాండెంట్ ఎంకే సింగ్, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, సిఐ రాజు వర్మ, తహసిల్దార్ శ్రీనివాస్ ,ఎంపీడీవో యాదయ్య, ఎస్సైలు నర్సిరెడ్డి కేశవ్ పాల్గొన్నారు

## బీసీల 42 శాతం రిజర్వేషన్ల అమలు చారిత్రాత్మకం

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, జూలై 11 (జనం సాక్షి) :** బీసీల 42 శాతం రిజర్వేషన్ అమలు చారిత్రాత్మక నిర్ణయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. మైలార్దేవ్పల్లిలోని ఆయన నివాసంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల అంశంపై బీసీల హక్కులు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ కూడా ఒక బీసీ పీసీసీ అధ్యక్షుడిగాగా ఉండడం బీసీలందరికీ గర్వకారణమన్నారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మైలార్ దేవ్ పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ, మాజీ అధ్యక్షుడు ప్రేమ్ గౌడ్, ఎస్. వెంకటేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు

- సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 11 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిత గ్రామంలో పారిశుద్ధ్యం ట్రాక్టర్ నిర్వహణ తడిపొడి చెత్త సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు అదేవిధంగా కందుకూరు మండలం కొత్తగూడ గ్రామపంచాయతీ కార్యదర్శి ఉమాదేవి ఎన్నికల విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించి విధులు నిర్వహించడంలో పూర్తిగా విఫలం చెందినందుకు వీరిద్దరిని సస్పెండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో విధి నిర్వహణలో అధికారులు ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించిన శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, జూలై 11 (జనం సాక్షి) :** పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు భూ భారతి,రేషన్ కార్డుల ధృవీకరణ, మీ-సేవ దరఖాస్తులు, ఎఫ్-లైన్ పిటిషన్లపై అన్ని మండలాల తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి ద్వారా భూమి వివాదాలు తగ్గి,రైతులకు, భూ యజమానులకు శాశ్వత న్యాయం జరగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.భూమి సమస్యలపై ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, రెవిన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని దరఖాస్తులపై తదుపరి చర్యలకు ముందు త్వరితగతిన నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అసైన్‌మెంట్ భూముల సమస్యలను పూర్తిగా పరిశీలించి,నివేదికను సమర్పించాలని అన్నారు. దరఖాస్తులు పూర్తిగా ఆన్లైన్ విధానంలో నిర్వహించాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుల దరఖాస్తులను వెంటనే పూర్తిచేసి,అదనపు కుటుంబసభ్యుల చేర్పు, అనర్హుల తొలగింపు ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. మీ సేవ దరఖాస్తులు,ఎఫ్-లైన్ పిటిషన్లు కొన్ని నిర్ణీత కాల పరిమితిని మించి పెండింగ్‌లో ఉన్న వాటిని అత్యవసరంగా పూర్తిచేసి ప్రజలకు ఆలస్యం లేకుండా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్,సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడీ రామ్ చందర్,అన్ని మండల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## పొలానికి అడ్డుగా వేసుకున్న కంచెను ధ్వంసం చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు



**ఇబ్రహీంపట్నం, జూలై 11 (జనం సాక్షి) :** పోచారం గ్రామంలో పొలానికి అడ్డుగా వేసుకున్న కంచెను ధ్వంసం చేసిన వ్యక్తులపై చట్టపరింపైన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళ్తే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో సర్వే నెంబరు 196లో గల భూమికి అడ్డుకంచె 26 కడీలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసము చేశారు. ఈ విషయంపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో దోర్న కృష్ణ రెడ్డి తండ్రి పెంటా రెడ్డి రిటైర్డ్ టీచర్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మా పొలం కు వేసుకున్న కంచెను ధ్వంసం చేశారని వంశమైన కడ్డీలు విలువ సుమారుగా 40,000/- నుంచి 50,000/- వరకు ఉంటుందని, ఎవరు గుర్తు తెలియని వ్యక్తులు తాగిన మైకంలో చేసినట్లు పక్కన ఉన్న మద్యం బాటిల్లను ఆధారంగా అర్థమవుతుందని, నాకు జరిగిన ఈ అన్యాయానికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బీసీల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

- స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు
- బీసీ రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం
- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ, జూలై 11 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదం పొందిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరకొండ పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ,ఎంపీ రఘువీర్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహాన్ని పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఇప్పటికే చట్టం చేసిందని తెలిపారు. ఫిబ్రవరి 4.2024 నుండి కుల గణన సర్వే చేస్తామని నిర్ణయం నుండి నివేదిక వరకు 2025 ఫిబ్రవరి 4న కుల గణన ఆమోదం చేసుకొని రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసుకున్నామని గుర్తు చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని అన్నారు. పలు పార్టీలు రాజకీయాలకు పరిమితం అవుతూ పార్టీలు మాటలకే పరిమితం కాకుండా బీసీల 42 శాతం రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వాలి అని అన్నారు.స్థానిక సంస్థల 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- తుంగతుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం..
- మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి




**తుంగతుర్తి, జూలై 11 (జనం సాక్షి) :** తుంగతుర్తి నియోజకవర్గాన్ని కనీవిని ఎరగని రీతిలో స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తానని రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండల కేంద్రంలో శుక్రవారం. ఈనెల 14 న తిరుమలగిరి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే సీఎం సభ ఏర్పాట్ల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే మందుల సామెల్ ఆధ్వర్యంలో జరగబోయే రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమ సభ ఏర్పాట్లను ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖ మంత్రి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే సామెల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తిరుమలగిరిలో నిర్వహించే భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 95 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు ప్రజా ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం సామాజిక న్యాయానికి కట్టుబడి పని చేస్తుందని అన్నారు.పదేళ్లుగా ప్రజల సమస్యలను కళ్లారా చూసిన సీఎం రేవంత్ రెడ్డి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో గాని గత టీఆర్ఎస్ పార్టీ 10 ఏళ్ల పాలనలో గాని ఏనాడు కూడా రేషన్ కార్డుల పంపిణీ జరగలేదని అన్నారు.స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారి పేదలకు సన్నబియ్యం ఇస్తున్న ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అన్నారు. ఈ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మందుల సామేల్ నిరంతరం పోరాటం చేస్తున్నారని ఆయన నాయకత్వంలో ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో రానున్న రోజుల్లో అభివృద్ధి పరుస్తామని తెలిపారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్య మనడానికి నిదర్శనం దళిత ఎమ్మెల్యే అడ్లూరీ లక్ష్మణ్ కు మంత్రి పదవి, గిరిజన బిడ్డ అయినా శంకర్ నాయక్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించిందని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంకర్ నాయక్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సుధీర్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మహిళ కమిటీ జిల్లా అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, జిల్లా ఎస్పీ నరసింహ, సివిల్ సప్లై శాఖ డైరెక్టర్ ప్రసాద్, ఆర్డీవో వేణు మాధవరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ రాంబాబు, వివిధ శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వివిధ మండలాల అధ్యక్షులు, సింగిల్విండో చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు వైస్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, జై భీమ్ జై బాపు జై సంవిధాన్ మండల కోఆర్డినేటర్లు, వివిధ యువజన సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ల డ్రైవింగ్ చట్టరీత్యా నేరం

- మైనర్ల డ్రైవింగ్‌పై దేవరకొండ పోలీసు ప్రత్యేక దృష్టి
- మైనర్లు వాహనం నడిపితే 25 వేలు జరిమానా
- సీఐ నరసింహులు



దేవరకొండ, జూలై 11 (జనం సాక్షి) : మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారకులు కావద్దని, మైనర్ డ్రైవింగ్ చట్టరీత్య నేరమని దేవరకొండ సీఐ ఎం.నరసింహులు అన్నారు. కొత్త ట్రాఫిక్ నిబంధనల ప్రకారం మైనర్లు వాహనం నడిపితే 25 వేలు జరిమానా, వాహనం సీజ్, వాహన యజమాని, తల్లిదండ్రుల పై కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. మైనర్లు వాహనం నడపడం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలను నిర్మూలించే ప్రయత్నంలో, సిఐ నరసింహులు, అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ పి.మౌనిక ఐపీఎస్ సూచన మేరకు దేవరకొండ పోలీసులు పట్టణంలో నిత్యం పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ నరసింహులు జనం సాక్షితో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వాహన చట్టంలో కీలక మార్పులు తీసుకొచ్చిందని, మైనర్లు వాహనం నడిపితే భారీ జరిమానా విధించడమే కాకుండా, పోలీస్ నిబంధనల ప్రకారం శిక్ష పడుతుందని తెలిపారు. కావున నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలని తెలిపారు. అధిక శబ్దం చేస్తూ వాహనాలు నడిపి ఎదుటివారిని భయభ్రాంతులకు గురిచేసిన వాహనాలకు, నెంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై నడిపితే ఎవరిని ఉపేక్షించబోమని సూచించారు. రోడ్డు ప్రయాణం చేసే వాహన చోదకులు సరైన వాహన పత్రాలు కలిగి ఉండాలని అన్నారు.

### మైనర్లతో డ్రైవింగ్ చేపిస్తే యజమానులపై చట్టరీత్యా చర్యలు

మైనర్లకు వాహనం ఇవ్వడం నేరమని తల్లిదండ్రులు గ్రహించాలని,మైనర్లు వాహనం నడిపి ప్రమాదాలు జరిగితే వారితో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యులేనని హెచ్చరించారు. వాహన చట్టం 2019 ప్రకారం 18 ఏళ్ల లోపు పిల్లలకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులకు మూడేళ్లు జైలు శిక్ష అలాగే త్రిబుల్ డ్రైవింగ్ సెక్షన్ 128,184,177, ప్రకారం శిక్ష పడుతుందని అన్నారు. ఎవరైనా మితిమీరిన వేగంతో వాహనం నడిపితే 1000 నుంచి 2000 రూపాయలు జరిమానా విధిస్తామని, మైనర్లు కారు లేదా బైక్ డ్రైవింగ్ చేస్తూ దొరికితే 25 వేల జరిమానా 25 ఏళ్ల వచ్చేవరకు డ్రైవింగ్ లైసెన్సుకు అనర్హత వేటుతో పాటు వాహన యజమాని వాహన పత్రాలు రద్దు చేస్తామని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే 600 జరిమానా ఉంటుందన్నారు. వాహనదారులు హెల్మెట్,సీటు బెల్టు తప్పకుండా ధరించాలని తెలిపారు. రాంగ్ రూట్లో వాహనం నడిపిన, అతివేగం,రాష్ డ్రైవింగ్ చేయడం వల్ల విలువైన ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలకు కూడా హాని కలుగుతుందనే విషయాన్ని ప్రతి ఒక్క వాహనదారుడు గుర్తుంచుకోవాలని తెలిపారు. ప్రాణం విలువైందని ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన ఇరువురి కుటుంబ సభ్యులకు తీరని శోకం మిలుగుతుందని అన్నారు. ఇకపై మైనర్లు వాహనం నడిపితే వాహన ఉల్లంఘన చట్టం కింద కేసులు నమోదు చేస్తామని భద్రత నియమాలను పాటించాలని సూచించారు.




# ఐటీ షేర్లు ఢమాల్

## అమెజాన్‌లా మరో ఫేక్ వెబ్‌సైట్

### అచ్చం నిజమైన పోర్టల్‌లానే..

ప్రముఖఈ–కామర్స్సంస్థలోప్రస్తుతంప్రైమ్డేసేల్ 2025 నడుస్తోంది. జూలై 12–14 వరకుఅమ్మకాలుజరుగు తుండగాదీనికిసంబంధించినహడావుడి నాలుగు రోజులముందుహడావుడి ప్రారంభమైంది . అమెజాన్ ప్రైమ్ డే సేల్ 2025 కోసం ఓ వైపు కొనుగోలుదారులు సిద్ధమవుతుండగా, ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు కూడా వినియోగదారులను మోసం చేసేపనిలో పడ్డారు .అమెజాన్లానే 1000 సైట్లు మెరుపు డీల్స్, డిస్కౌంట్ల కోసం లక్షలాది మంది లాగిన్ అవుతారని భావిస్తున్న నేపథ్యంలో ఈ షాపింగ్ ఉత్సుకతఆన్లైన్ మోసాలకు తెరలేపుతుందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెక్ పాయింట్ రీసెర్చ్ ప్రకారం, అమెజాన్ను పోలిన 1,000 కొత్త వెబ్సైట్లు 2025 జూన్లోనమోదయ్యాయి. వీటిలో 87% అనుమానాస్పదమైనవి లేదా పూర్తిగా హానికరమైనవిగా గుర్తించారు. ఈ సారూప్య డొమైన్లు చిన్న అక్షర తేడాలు లేదా ".టాప్" లేదా ".ఆన్లైన్" వంటి అసాధారణ ఎ?క్స్టెన్షన్లనుకలిగి ఉంటాయి. ఇలావినియోగదారులనునమ్మించిమోసగించడానికేవీ టినిరూపొం దించినట్లుకనిపిస్తోంది.వినియోగదారులనుమోసగించడానికిస్కామర్లు సాధార ణంగా రెండు ప్రధాన ట్రిక్స్పైఆధారపడతారు. అవిఒకటినకిలీ వెబ్సైట్లు, రెండోదిఫిషింగ్ ఈమెయిల్స్.అమెజాన్ చెక్అవుట్ లేదా లాగిన్ పేజీలను అనుకరించడానికి నకిలీ డొమైన్లు సృష్టిస్తున్నారు. అవి మొదటి చూసినప్పుడు అసలైనవెబ్సైట్లలాగానేఅనిపిస్తాయి. దీంతోవీటిద్వారాకొనగోళ్లకు ప్రయత్నిస్తేమొత్తానికిమోసంవస్తుంది. పాస్వర్డ్లు, ఇతరవివరాలుకూడా చోరీకి గురయ్యే ప్రమాదంఉంది.ఇకమరోమార్గంలో"రీఫండ్ డ్యూ" లేదా "అకౌంట్ ప్రాబ్లమ్" వంటి విషయాలతోఫిషింగ్ ఈమెయిల్స్ ఉన్నాయి. ఈ సందేశాలు మామూలుగాఅమెజాన్ సపోర్ట్ టీమ్ నుండే వచ్చినట్లు అనిపిస్తాయి. అక్కడకనిపించినలింక్లను క్లిక్ చేస్తేస్కామ్ వెబ్సైట్లకు దారితీసేఅవకాశంఉంది. ప్రైమ్ డే సందర్భంగా కొనుగోలుదారులుహడావుడిగాఉంటారనిసైబర్ నేరగాళ్లకు తెలుసు. వారు మీ అత్యవసరతను తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటారు.సురక్షితంగా ఉండటానికినిపుణులు కొన్ని జాగ్రత్తలను సూచిస్తున్నారు. ఇవిసాధారణమైనవే కానీ శక్తివంతమైనవి. అవి.. అధికారిక అమెజాన్ యాప్ లేదా వెబ్సైట్లోమాత్రమేషాపింగ్చేయండి మీ ఖాతాను అప్డేట్ చేయమని లేదా రీఫండ్ క్లెయిమ్ చేయమని కోరే ఈమెయిల్స్ పట్ల జాగ్రత్తగా ఉండండి. ఆకర్షణీయంగా అనిపించే ఫ్లాష్ డీల్స్ జోలికి పోవద్దు. టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఎనేబుల్ చేయండి.మీ సాఫ్ట్వేర్, బ్రౌజర్లను అప్డేట్ చేసుకోండి.




## భారీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



**జనంసాక్షి:**టీసీఎస్త్రైమాసిక (క్యూ1) రాబడులు ఆశించిన దానికం టే బలహీనంగా ఉండటంతో భారత ఈక్విటీ బెంచ్మార్క్ సూచీలు శుక్రవారం ఐటీ షేర్లలో అమ్మకాలతో నష్టాల్లో ముగిశాయి.దీనికి తోడు కెనడాపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా వాణిజ్య సుంకాలు విధించిన తర్వాత పెరుగుతున్న ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు కూడా సెంటిమెంట్ ను దెబ్బతీశాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 689.81 పాయింట్లులేదా 0.83 శాతం క్షీణించి 82,500.47 స్థాయిలలో ముగియగా, నిఫ్టీ 50 కూడా205.4 పాయింట్లు లేదా 0.81 శాతం క్షీణించి 25,149.85 స్థాయిలలో స్థిరపడింది.విస్తృత మార్కెట్ల లో నిఫ్టీ మిడ్ క్యాప్ 0.88 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 1.02 శాతం చొప్పున నష్టపోయాయి.రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఆటో దాదాపు 1.8 శాతం చొప్పున నష్టపోయాయి. టీసీఎస్ క్యూ1 రాబడులు ఊహించిన దానికంటే తక్కువగా ఉండటంతో ఐటీ షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. నిఫ్టీ రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా, ఎనర్జీ, బ్యాంక్, మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, ఫార్మా లాభాల్లో ముగిశాయి.సెన్సెక్స్ లోని 30 షేర్లలో 23 షేర్లు రెడ్లోనే ముగిశాయి. టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, భారతీ ఎయిర్టెల్, హెచ్సీఎల్ టెక్, టైటాన్ షేర్లు 3.5 శాతం వరకు నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, ఎటర్నల్ టాప్ గెయినర్గా నిలిచాయి.మార్కెట్ ఒడిదుడుకులను అంచనా వేసే ఇండియా వీఐఎక్స్ 1.24 శాతం లాభపడి 11.81 పాయింట్ల వద్ద స్థిరపడింది.

## తెలంగాణ కోసం ప్రత్యేక ఉక్కు ఉత్పత్తులు

**జనంసాక్షి:**తెలంగాణ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణ, మౌలిక సదుపాయాల రంగాల కోసం ప్రత్యేక ఉక్కు ఉత్పత్తులను ప్రవేశపెట్టినట్లు ఆర్సెలర్మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్ ఇండియా) వెల్లడించింది. ఆప్టిగల్ ప్రైమ్, ఆప్టిగల్ పినకిల్ వీటిలో ఉన్నట్లు వివరించింది.తుప్పు నుంచి మూడు రెట్లు అధిక రక్షణ కల్పించేలా ఇవి ఆరు వేరియంట్స్‌లో ఉంటాయి. దేశీయంగా, ముఖ్యంగా దక్షిణాదిన కలర్ కోటెడ్ ఉక్కు ఉత్పత్తుల విభాగంలో గణనీయంగా మార్కెట్ వాటాను లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ డైరెక్టర్ రంజన్ ధర్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ మార్కెట్ 3.4 మిలియన్ టన్నులుగా ఉండగా, దక్షిణాది మార్కెట్ వాటా సుమారు 0.6 మిలియన్ టన్నులుగా ఉంటుందని పేర్కొన్నారు.హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డీప్‌టెక్ ఆవిష్కరణలతో పంటల సంరక్షణ ఉత్పత్తులపై కృషి చేస్తున్నందుకు గాను ప్రతిష్ఠాత్మకమైన ఇన్నోవేషన్ లీడర్‌షిప్ అవార్డ్ పురస్కారం లభించినట్లు ఏటీజీసీ బయోటెక్ సంస్థ వెల్లడించింది. అగ్రికల్చర్ టుడే నిర్వహించిన 16వ అగ్రికల్చర్ లీడర్‌షిప్ సదస్సులో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, వాణిజ్య మంత్రి పీయుష్ గోయల్ దీన్ని ప్రదానం చేసినట్లు వివరించింది.తమ సంస్థకు 26 పేటెంట్లు, 50కి పైగా ఉత్పత్తులు ఉన్నట్లు కంపెనీ చైర్మన్ మార్కండేయ గోరంట్ల, ఈడీ వీబీ రెడ్డి తెలిపారు. బియ్యం, పత్తి తదితర పంటల్లో ఫెరోమోన్ టెక్నాలజీని విస్తరించడంలో తమ కంపెనీని కేస్ స్టడీగా పరిగణించవచ్చని 2024లో ప్రపంచ ఆర్థిక ఫోరం సైతం



## టికెట్ల రద్దూ.. పెద్ద పద్దే!

### భారీగా ట్రైన్ టికెట్ల రద్దు.. ఆదాయం

దూర ప్రయాణాలు అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది ట్రైన్. శుభకార్యాలు, పండగలు, పనుల నిమిత్తం ఎక్కువ దూరం వెళ్లాల్సి వచ్చినప్పుడు సాధారణంగా రైలు ప్రయాణానికే ప్రాధాన్యత ఇస్తుంటాం.అయితే ట్రైన్ జర్నీ చేయాలంటే ముందుగా టికెట్ రిజర్వు చేసుకోవాలి. పండగలు, సెలవులు, పెళ్లిళ్ల సీజన్లో రైలు టికెట్లకు ఫుల్ గిరాకీ ఉంటుంది. దీంతో వెయిటింగ్ లిస్టులు చాంతాడంత పేరుకుపోయి ఉంటాయి. ముందుగా బుక్ చేసుకున్నవారు టికెట్ క్యాన్సిల్ చేసుకుంటేనే వెయిటింగ్ లిస్ట్‌లోని వారికి ప్రాధాన్యతా క్రమంలో టికెట్ దొరుకుతుంది. ప్రయాణికులు టికెట్ క్యాన్సిల్ చేసుకున్నా, వెయిటింగ్ లిస్ట్‌లోని టికెట్ కన్ఫామ్ కాకపోయినా డబ్బులు తిరిగి చెల్లిస్తుంది రైల్వే శాఖ. నిబంధనల మేరకు కొంత మినహాయించుకుని మిగతా మొత్తాన్ని మాత్రమే ప్రయాణికులకు రిఫండ్ చేస్తుంది. టికెట్ క్యాన్సిలేషన్స్ ద్వారా రైల్వేకు భారీగానే ఆదాయం వస్తోందని తాజాగా వెల్లడైంది. సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న దక్షిణమధ్య రైల్వే.. టికెట్ క్యాన్సిలేషన్స్ ద్వారా గత నాలుగున్నరేళ్లలో దాదాపు రూ. 700 కోట్లు ఆర్జించినట్టు తెలిసింది. రైల్వే వార్షిక ఆదాయంలో ఇది 3.5 శాతం. టైమ్స్ ఆఫ్ ఇండియా ఆర్టీఐ దరఖాస్తు ద్వారా ఈ వివరాలు రాబట్టింది. ప్రయాణికుల ద్వారా 2024–25లో దక్షిణమధ్య రైల్వేకు వచ్చిన ఆదాయం రూ. 5,710 కోట్లు. 2024లో 1.4 కోట్ల టికెట్లు క్యాన్సిల్ కాగా, ఇందులో 65 లక్షలు వెయిటింగ్‌లిస్ట్‌లోనివే. టికెట్లు క్యాన్సిల్ చేసుకునే వెయిటింగ్‌లిస్ట్ ప్రయాణికుల సంఖ్య గత 4 ఏళ్లలో నాలుగింతలు పెరగడం గమనార్హం. 2021లో 15.96 లక్షల టికెట్లు క్యాన్సిల్ కాగా, 2024లో ఈ సంఖ్య 65.62 లక్షలకు పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి మే నెల వరకు 31.52 లక్షల టికెట్లు క్యాన్సిల్ అయ్యాయి. రైల్వే నిబంధనల ప్రకారం.. కన్ఫామైన టిక్కెట్‌ను.. ప్రయాణానికి 12 నుంచి 48 గంటల ముందు రద్దు చేసుకుంటే టికెట్ ధరలో 25 శాతం మినహాయించుకుని మిగతా మొత్తం జమ అవుతుంది. ప్రయాణానికి 4 నుంచి 12 గంటల ముందు టికెట్ క్యాన్సిల్ చేస్తే సగం మొత్తం మాత్రమే రిఫండ్ వస్తుంది. వెయిటింగ్‌లిస్ట్‌లోని టికెట్ కన్ఫామ్ కాకుంటే క్లరికల్ చార్జి కింద రూ. 60 తీసుకుని మిగతా మొత్తం తిరిగిచ్చేస్తారు.

## యూపీఐతో చెల్లింపుల్లో మనమే సూపర్‌ఫాస్ట్

**జనంసాక్షి:**యూపీఐ దన్నుతో, మిగతా ప్రపంచ దేశాలన్నిం టిలోకెల్లా భారత్‌లో చెల్లింపుల విధానం అత్యంత వేగవంతంగా ఉంటోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తెలిపింది. 2016లో ప్రవేశపెట్టిన యూపీఐ విధానం చాలా వేగంగా వినియోగంలోకి వచ్చిందని ఫిన్‌టెక్ నోట్‌లో పేర్కొంది. అదే సమయంలో నగదుకు ప్రత్యామ్నాయాలైన డెబిట్, క్రెడిట్ కార్డుల్లాంటి ఇతరత్రా సాధనాల వినియోగం గణనీయంగా తగ్గిందని వివరించింది.ґ ప్రస్తుతం యూపీఐ ప్రతి నెలా 1,800 కోట్ల లావాదేవీలు ప్రాసెస్ చేస్తోందని ఐఎంఎఫ్ పేర్కొంది. వివిధ పేమెంట్ ప్రొవైడర్స్ సేవలు ఉపయోగించుకునే యూజర్ల మధ్య నిరాటంకంగా చెల్లింపు లావాదేవీలను ప్రాసెస్ చేసేందుకు క్లోజ్డ్ లూప్ సిస్టమ్‌లతో పోలిస్తే యూపీఐలాంటి ఇంటర్‌ఆప ్రబుల్ పేమెంట్ సిస్టమ్‌లు సమర్ధవంతంగా ఉంటాయని తెలిపింది. అయితే, ఇది మరింత వినియోగంలోకి వచ్చే కొద్దీ ప్రైవేట్ రంగ సంస్థల గుత్తాధిపత్యానికి కూడా దారి తీయొచ్చని, అలాంటిది జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.



## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.10 | ₹ 5.12 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 90,750 (22 క్యారెట్లు) | ₹ 99,000 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,21,000

## పప్పు పంచాయితీ.. ఎమ్మెల్యేపై కేసు నమోదు



**జనంసాక్షి:**శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై కేసు నమోదైంది. పాడైపోయిన పప్పు పెడుతున్నారంటూ ఎమ్మెల్యే క్యాంటీన్ సిబ్బందిపై దాడి చేసిన సంగతి తెలిసిందే.అదే సమయంలో ఓ జాతీయ మీడియా చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇంకోవైపు తీవ్ర దుమారం రేపుతున్నాయి.బుల్దానా నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్.. ముంబైలోని తన అధికారిక నివాసంలో పనిచేస్తున్న క్యాంటీన్ కాంట్రాక్టర్‌ను తీవ్రంగా కొట్టారు. పాచిపోయిన ఆహారం ఇచ్చారంటూ పప్పు ఉన్న కటోరాను కాంట్రాక్టర్ ముక్కు వద్ద పెట్టిన గైక్వాడ్.. ఆ వెంటనే అతనిపై ముష్టిఘాతాలు కురిపించారు. సదరు కాంట్రాక్టర్ కింద పడిపోయి.. లేవలేని స్థితిలో ఉన్నా.. తన దాడిని ఆపలేదు. ఈ దాడికి సంబంధించిన వీడియో బుధవారం నెట్టింట వైరల్ అయ్యింది.అధికార పార్టీ ఎమ్మెల్యే తీరును ప్రతిపక్షాలతో పాటు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, శివసేన బాస్.. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తీవ్రంగా ఖండించారు. అయినా కూడా గైక్వాడ్ తన నోటి దురుసును ఆపలేదు. తన చర్యను సమర్థించుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో రెండు రోజుల తర్వాత.. శుక్రవారం ఆయనపై కేసు నమోదైనట్లు సమాచారం. అయితే ఆయనపై ఎలాంటి అభియోగాలు నమోదు చేశారో స్పష్టత రావాల్సి ఉంది. గురువారం రాత్రి ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో దక్షిణ భారతీయులపై శివసేన(శిండే వర్గం) ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దక్షిణ భారతీయులు డ్యాన్స్ బార్లు, లేడీస్ బార్లను నడుపుతూ.. మహారాష్ట్ర సంస్కృతిని నాశనం చేస్తున్నారు. శెట్టి అనే దక్షిణాది వ్యక్తికి కాంట్రాక్ట్ ఎలా ఇచ్చారు? మహారాష్ట్ర స్థానికుడికి ఇవ్వాలి కదా? ఏం తినాలో మాకు తెలుసు. దక్షిణాదివారు డ్యాన్స్ బార్లు, లేడీస్ బార్లను నడుపుతూ.. పిల్లల్ని చెడగొడుతుంటారు. అలాంటి వారు మంచి ఆహారం ఎలా అందిస్తారు? అని అన్నారాయన. ఈ వ్యాఖ్యలపై ఇప్పుడు తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## అమెరికాలో కుబేరులు మనవాళ్లే..

విదేశాల్లోపుట్టిఅమెరికాలోఅపర కుబేరులుగాఎదిగినవాళ్లలోభారతీయులేఅగ్రస్థానంలో ఉన్నారు. ఫోర్బ్స్2025 ర్యాంకింగ్స్లో12 మంది భారత సంతతి బిలియనీర్లు చోటు దక్కించుకోవడంతో అత్యధిక మంది విదేశీ అమెరికన్ కుబేరులకు జన్మస్థానంగా భారత్ నిలిచింది. 2022లో కేవలం ఏడుగురుభారత సంతతి బిలియనీర్లుఉండగాఇప్పుడుగణనీయంగాపెరిగారు.అమెరికాలోవిదేశీసంతతిసంపన్నులతాజాజాబితాలోభారత్.. ఇజ్రాయెల్, తైవాన్లనుఅధిగ మించింది. ఈరెండుదేశాలకుచెందినవారుచెరో 11 మందిఈజాబితాలోఉన్నారు. స్వయంకృషితోఎదిగినఈభారతసంతతికుబేరులు.. విదేశాలలో జన్మించిన యూఎస్ బిలియనీర్ల మొత్తం1.3 ట్రిలియన్ డాలర్ల సంపదలోగణనీయవాటానుఅందిస్తున్నారు. ఆల్ఫాబెట్ అధినేత సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల వంటి కొత్తవారు ఇటీవల ఈ జాబితాలో చేరినప్పటికీ అంతగా గుర్తింపు లేని దిగ్గజాలతో పోలిస్తే వారు ఆశ్చర్యకరంగా తక్కువ ర్యాంకులో ఉన్నారు.సైబర్ సెక్యూరిటీ దిగ్గజం జెడ్ స్కేలర్ వ్యవస్థాపకుడు జే చౌదరి 17.9 బిలియన్ డాలర్ల సంపదతో భారత సంతతి అమెరికన్ బిలియనీర్లలో అగ్రస్థానంలో ఉన్నారు. విద్యుత్తు, నీరు లేని మారుమూల హిమాలయ గ్రామం పనోహ్ లో జన్మించిన చౌదరి గ్రాడ్యుయేట్ చదువుల కోసం 1980లో తొలిసారి అమెరికా వెళ్లారు.

భారతసంతతిఅపరకుబేరులువీళ్లే..

జే చౌదరి (17.9 బిలియన్ డాలర్లు) – సైబర్ సెక్యూరిటీ (జెడ్ స్కేలర్).వినోద్ ఖోస్లా (9.2 బిలియన్ డాలర్లు) – సన్ మైక్రో సిస్టమ్స్, వెంచర్ క్యాపిటల్ రాకేష్ గంగ్వాల్ (6.6 బిలియన్ డాలర్లు) – ఎయిర్లైన్స్ (ఇండిగో సహ వ్యవస్థాపకుడు).రొమేష్ టి.వాధ్వానీ (5.0 బిలియన్ డాలర్లు) – సాఫ్ట్వేర్ – సింఫనీ టెక్నాలజీ గ్రూప్ రాజీవ్ జైన్ (4.8 బిలియన్ డాలర్లు) – ఫైనాన్స్ (జీక్యూజీ పార్ట్నర్స్ చైర్మన్) కవితార్క్ రామ్ శ్రీరామ్ (3.0 బిలియన్ డాలర్లు) – గూగుల్, వెంచర్ క్యాపిటల్ రాజ్ సర్దానా (2.0 బిలియన్ డాలర్లు) – టెక్నాలజీ సేవలు (ఐటీ సంస్థ టీసీజీఐ) డేవిడ్ పాల్ (1.5 బిలియన్ డాలర్లు) – వైద్య పరికరాలు (వెల్కెస్ట్ / న్యూరోసిగ్మా) నికేష్ అరోరా (1.4 బిలియన్ డాలర్లు) – సైబర్ సెక్యూరిటీ (పాలో ఆల్టో నెట్వర్క్స్ సీఈఓ) ఫోర్బ్స్ తాజా డేటా ఆధారంగా అమెరికాలోని అత్యంత ధనవంతులైన భారత సంతతి బిలియనీర్లు వీరే. టెక్ దిగ్గజాలు సుందర్ పిచాయ్ (1.1 బిలియన్ డాలర్లు), సత్య నాదెళ్ల (1.1 బిలియన్ డాలర్లు) 10, 11వ స్థానాల్లో నిలిచారు.


## భారత్‌లో టెస్లా

### షోరూం ప్రారంభం ఈ వారంలోనే..




**జనంసాక్షి:**ఎలాన్మస్క్కుచెందినఎలక్ట్రిక్వాహనతయారీసంస్థటెస్లాభారత్లోతనతొలి షోరూంనుఈవారంలోనే ?ప్రారంభించనుంది. టెస్లాభారత్లో తన మొదటి "ఎక్స్పీరియన్స్ సెంటర్" ను జూలై 15న ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్ లో ప్రారంభించనుందని , ఇది భారత మార్కెట్లోకి ప్రవేశించడంలో కీలక అడుగు అని రాయిటర్స్ నివేదించింది.ఇందుకోసం టెస్లా4,000 చదరపు అడుగుల రిటైల్ స్థలాన్ని మార్చిలో లీజుకు తీసుకుంది. ఈ ప్రాంతంయాపిల్స్టోర్ కు సమీపంలో ఉంది.భారత్లోవిస్తృత విస్తరణ వ్యూహంలో భాగంగా టెస్లాఈ నిర్ణయం తీసుకుంది. జూన్ లో ముంబైలోని కుర్లా వెస్ట్ లో ఒక వాణిజ్య స్థలాన్ని కంపెనీ లీజుకు తీసుకుంది. ఇది వాహన సర్వీస్కేంద్రంగా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. పుణెలో ఇంజనీరింగ్ హబ్, బెంగళూరులో రిజిస్టర్డ్ కార్యాలయం, బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) సమీపంలో తాత్కాలిక కార్యాలయంతో సహా భారతదేశంలో టెస్లా మొత్తం వాణిజ్య ఆస్తులు నాలుగుకు చేరుకున్నాయి.కాగాకంపెనీ ఇండియా హెడ్ ప్రశాంత్ మీనన్ తొమ్మిదేళ్ల తర్వాత గత నెలలో రాజీనామా చేశారు. బ్లూమ్బెర్గ్ న్యూస్ ప్రకారం.. ప్రస్తుతానికి భారత కార్యకలాపాలను చైనాకుబృందం నిర్వహిస్తోంది.అయితేటెస్లా ప్రస్తుతం భారత్లో తయారీని స్థాపించడానికి ఆసక్తి చూపడం లేదని, కేవలం షోరూమ్లు తెరిచి దిగుమతి చేసుకున్న కార్లను విక్రయించాలనుకుంటోందనికేంద్రమంత్రికుమారస్వామిగతనెలలోచెప్పారు.షోరూంప్రారంభానికి ముందు కంపెనీ దాదాపు 1 మిలియన్ డాలర్ల (రూ.8.58 కోట్లు) ఎలక్ట్రిక్ వాహనాలు, సంబంధిత వస్తువులను దిగుమతి చేసుకుంది.జనవరి – జూన్ మధ్య వాణిజ్య షిప్పింగ్ రికార్డుల డేటా ప్రకారం.. టెస్లా భారత్కువాహనాలు, సూపర్ ఛార్జర్లు, ఇతరఉపకరణాలను దిగుమతి చేసుకుంది. ఇందులోప్రధానంగా చైనా, అమెరికాలనుండిదిగుమతి చేసుకున్న ఆరు కార్లలో మోడల్ వై కార్లుఉన్నాయి. విదేశీ ఎలక్ట్రిక్ వాహనాలపై భారత్ సుమారు 70% దిగుమతి సుంకంవిధిస్తున్నప్పటికీ టెస్లా ఈ వాహనాలను తీసుకువస్తోంది.

## 'మహా' మంత్రి వీడియో వైరల్..



**జనంసాక్షి:**మహారాష్ట్రకు చెందిన ఓ మంత్రి వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ మారింది. మంత్రి సంజయ్ శిర్‌సాత్ ఇప్పుడు ఆ వీడియోతో ఒక్కసారిగా వైరల్‌గా మారారు.ఇంతకీ ఆ వీడియో ఏంటంటే.. మంత్రి సంజయ్ శిర్‌సాత్ మంచంపై కూర్చొని సిగరెట్ కాల్చుకుంటూ ఫోన్‌లో మాట్లాడున్న సమయంలో పక్కనే ఒక బ్యాగ్ ఉంది. అయితే ఆ బ్యాగ్‌లో భారీ నగదు ఉన్నట్లు తీవ్ర ఆరోపణలు చెలరేగాయి. ఈ క్రమంలోనే ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఆయనకు నోటీసులు కూడా జారీ చేసింది.ప్రధానంగా ఆయన గత ఐదేళ్లలో ఆర్థికంగా ఎదిగిన తీరుపై అనేక అనుమానాలు, ఆరోపణలు వస్తున్నాయి. సదరు మంత్రి పైసా తీసుకోకుండా ఏ పని చేయ్యడనే ఆరోపణలు కూడా చుట్టుముట్టిన తరుణంలో ఐటీ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. తనకు ఐటీ డిపార్ట్‌మెంట్ నుంచి నోటీసులు అందిన విషయాన్ని మంత్రి సంజయ్ శిర్‌సాత్ కూడా అంగీకరించారు.దీనిపై స్పందిస్తానని, తనపై అనవసర ఆరోపణలు చేయొద్దని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. తన పక్కన సూట్‌కేసులో భారీగా డబ్బులున్నాయనే విషయంపై కూడా ఆయన స్పందించారు. ఇందులో ఎటువంటి తప్పు జరగలేదని చెబుతూనే, ఈ అంశంపై రెండు మూడు రోజుల్లో వివరణ ఇస్తానని చెప్పుకొచ్చారు. ప్రధానంగా ఆయన ఆస్తులు 2019 నుంచి 2024 మధ్య కాలంలో భారీగా పెరగడం కూడా అనుమానాలకు దారి తీసింది. ఈ క్రమంలోనే మంత్రిపై పలువురు వ్యక్తులు ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు ఫిర్యాదు చేశారని, ఆ క్రమంలోనే తాను నోటీసు కూడా అందుకున్నట్లు పేర్కొన్నారు. దీనిపై స్పందించడానికి తనకు తగినంత సమయం కావాలని మంత్రి వేడుకుంటున్నారు.మంత్రి సంజయ్ శిర్‌సాత్.. మహారాష్ట్రలోని ఔరంగాబాద్(వెస్ట్) నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండ్ శివసేన పార్టీకి చెందిన శిర్‌సాత్ ఆస్తులు గత ఐదేళ్లలో గణనీయంగా ఎలా పెరిగాయనే దానిపై వివరణ ఇవ్వాలని ఐటీ డిపార్ట్‌మెంట్ నోటీసులు ఇచ్చింది.

## రఫేల్ యుద్ధ విమానాలతో ఫొటోలు.. చైనా పౌరుల అరెస్టు

**జనంసాక్షి:**గ్రీస్ దేశంలోని తనగ్రాలో రఫేల్ యుద్ధ విమానాలను ఫొటోలు తీసినందుకు నలుగురు చైనా జాతీయులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒక మహిళ ఉన్నట్లు తెలిసింది.తనగ్రాలో గ్రీస్ వైమానిక, సైనిక స్థావరాలు ఉన్నాయి.హెలినిక్ ఏరోస్పేస్ ఇండస్ట్రీ(హెచ్ఏఐ) ఇక్కడే ఉంది. తాజాగా చైనా పౌరులు ఈ ప్రాంతంలో రఫేల్ యుద్ధ విమానాలతోపాటు ఇతర రక్షణ సదుపాయాలను కెమెరాల్లో బంధిస్తున్నట్లు హెలినిక్ ఎయిర్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. దూరంగా వెళ్లిపోవాలని ఆ నలుగురిని హెచ్చరించారు. దాంతో వారు కొంతదూరం వెళ్లి మళ్లీ ఫొటోలు తీస్తుండడంతో అనుమానం వచ్చి వెంటనే అదుపులోకి తీసుకొని, స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీసులకు అప్పగించారు. రక్షణపరంగా తనగ్రా చాలా సున్నితమైన ప్రాంతం కావడంతో ఈ ఫొటోల వ్యవహారాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు. స్థానికంగా హైఅలర్ట్ ప్రకటించారు.

## మళ్లీ రెచ్చిపోయిన హౌతీలు

**దుబాయ్(జనంసాక్షి):** యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు మరోసారి రెచ్చిపోయారు. ఎర్రసముద్రంలో ప్రయాణిస్తున్న గ్రీక్ దేశానికి చెందిన అంతర్జాతీయ సరకు రవాణా నౌక 'ఎటర్నిటీ సి'పై హౌతీలు గ్రనేడ్లు, ఆత్మాహుతి డ్రోన్లతో దాడిచేశారు. దీంతో నౌకకు కిందవైపు భారీ రంధ్రం పడి సముద్రంలో మునిగిపోయింది. విషయం తెల్సుకున్న యురోపియన్ యూనియన్ నేవీ బలగాలు హుటాహుటిన అక్కడికి చేరుకుని 10 మంది నౌక సిబ్బందిని రక్షించాయి. అయితే ఆలోపే కొంతమంది సిబ్బందిని హౌతీలు కిడ్నాప్‌చేసి గుర్తుతెలియని చోటుకు తీసుకెళ్లారు.లైబీరియా జెండాతో ఉన్న ఈ నౌక మునిగిన ఘటనలో ముగ్గురు సజీవసమాధి అయ్యారు. ఎర్రసముద్రంలో ఈ వారం వ్యవధిలో హౌతీలు ఇలా వాణిజ్యనౌకపై దాడిచేయడం ఇది రెండోసారి. హమాస్‌ను అంతమొందించేందుకు సాహసించిన ఇజ్రాయెల్‌పై కక్షతో హౌతీలు ఇలా పశ్చిమదేశాలకు చెందిన నౌకలపై తరచూ దాడులకు పాల్పడుతున్నారు.

# మీ స్థలాలకు మాది గ్యారెంటీ

**బసవతారక నగర్ వాసులకు వామపక్షాల భరోసా**



**శేరిలింగంపల్లి, జూలై 11 (జనంసాక్షి) :** బసవతారక నగర్ వాసులు ఎట్టి పరిస్థితుల్లో అధైర్య పడవద్దని, వారి స్థలాలకు తాము పూర్తి బాధ్యతతో కూడిన భరోసాను అందిస్తున్నామని వామపక్షాలు శుక్రవారం స్పష్టం చేశాయి. శేరిలింగంపల్లి మండలం గౌలిదొడ్డి గ్రామ పరిధి బసవతారక నగర్ ప్రాంతాన్ని రంగారెడ్డి జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకులు బసవతారక నగర్ బాధితులను ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బసవతారక నగర్ వాసులకు పూర్తి న్యాయం జరిగే వరకు తాము ఎట్టి పరిస్థితుల్లో వెనుకడుగు వేయబోమని, వారి ఇళ్ల స్థలాలను వారికి కేటాయించేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తామని ధీమాను వ్యక్తం చేశారు. బసవతారక నగర్ లో గత 40 సంవత్సరాలుగా నిరుపేద ప్రజలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, కనీస మౌలిక వసతులు లేని కాలం నుండి ప్రతికూల పరిస్థితుల్లో నేడు బసవతారక నగర్గా రూపాంతరం చెంది జీవనం కొనసాగిస్తుంటే ఓర్వలేని కొన్ని దుష్టశక్తులు సదరు విలువైన స్థలాలపై కన్నేసి అమాయకులైన నిరుపేదలను అక్కడి నుండి ఖాళీ చేయించి వాటిని కబ్జా చేసేందుకు కుటిలయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని, ప్రజా పాలన కొనసాగిస్తున్నామని అనేక ప్రదేశాలలో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిందని, ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే బసవతారక నగర్లో ఆవాసం ఏర్పాటు చేసుకున్న నిజమైన నిరుపేదలకు అండగా నిలబడి వారి స్థలాలను వారికి కేటాయించడంతోపాటు సకల మౌలిక సదుపాయాలను అందించాల్సిన బాధ్యతను వారు గుర్తు చేశారు. కొంతమంది దళారులు వచ్చి బసవతారక నగర్ వాసులను బెదిరించినంత మాత్రాన ఒరిగేదేమీ లేదని, వారి వెనకాల వామపక్ష పార్టీలు సంపూర్ణ అండను అందిస్తున్నాయని, వారు ఏం చేయదలచుకున్నారో చేసుకోవచ్చని, తాము కూడా ప్రజాక్షేత్రంలో అన్ని రకాలుగా వారితో తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. తప్పకుండా బసవతారక నగర్ వాసులకు న్యాయం జరిగి తీరుతుందని, అది జరిగేవరకు తాము విశ్రమించబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు రజాక్ పాషా, ఎల్లేష్, శేరిలింగంపల్లి కార్యదర్శి చల్లా శోభన్, మండల నాయకులు కొంగరి కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి రామకృష్ణ, అధ్యక్షులు చందు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే నాయకత్వ లక్షణాలు

- అల్ఫోర్స్ టైనీ టాట్స్ లో ఘనంగా కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ ప్రమాణ స్వీకారోత్సవం
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జూలై 11 (జనంసాక్షి) :** విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే నాయకత్వ లక్షణాల పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని వారికి నాయకత్వ లక్షణాలను అలవర్చుకునేందుకు అవకాశాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో నిర్వహింపబడిన వివిధ విభాగాల క్యాప్టెన్స్, వైస్ క్యాప్టెన్స్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు నాయకత్వపు లక్షణాల విశిష్టతను తెలిపాలని, వాటిని అమలుపరచడానికి కావలసినటువంటి పద్ధతులను సైతం వారికి చక్కగా వర్ణించినట్లయితే నాయకత్వం లక్షణాలు పెంపొందించుకుంటారని చెప్పారు. పాఠశాలలో విద్యార్థులకు నూతనోత్సాహం కలిగించడానికి, వారికి ప్రజా స్వామ్యం పట్ల అవగాహన కల్పించడానికి సమాజంలో ఎదురవుతున్న టువంటి సమస్యలను పరిష్కరించే విధానాలను సైతం ప్రత్యక్షంగా విద్యార్థుల కు పాఠశాల స్థాయిలో తెలియపరచడానికి ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం ప్రజాస్వామ్యబద్దంగా ఎన్నికలను నిర్వహించడం జరిగిందని ఎన్నికలలో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం పాఠశాలలో వేడుకగా ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వారు చెప్పారు. ధ్రువ విభాగంలో కెప్టెన్, వైస్ కెప్టెన్ వి. అభిరుత్వక్, ఎం. సాయి రిత్వంత్, లక్ష్యా విభాగంలో కెప్టెన్, వైస్ కెప్టెన్ టి.సాకేత్, పి.శివభార్గవరెడ్డి విభాగంలో కెప్టెన్, వైస్ కెప్టెన్ బి.శివ సాయి ఆదిత్య, ఎ. కతీక్, తేజస్ విభాగంలో కెప్టెన్, వైస్ కెప్టెన్ ఆర్. రాహుల్, సుమయ్య సాదిక్, నూతన ఎన్నికైన కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ చే ప్రమాణం చేయించారు. వేడుకగా నిర్వహించిన టువంటి ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గ్రానైట్ పరిశ్రమ పునరుద్ధరణకు

# ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

**ఇబ్బందులు పరిష్కరించి పరిశ్రమకు ఊతమివ్వాలని కోరిన ఓనర్లు**




**కరీంనగర్ జిల్లా బ్యూరో, జూలై 11 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ఎగుమతు ల్లేకుండా డీలా పడ్డ గ్రానైట్ పరిశ్రమ పునరుద్ధరణ కు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పరిశ్రమల ఓనర్లు కోరారు. వారు మాట్లాడుతూ... తెలంగాణ భారతదేశంలోని ఐదు ఖనిజ సంపన్న రాష్ట్రాలలో ఒకటిగా గుర్తింపు పొంది..సమృద్ధిగా సహజ వనరు లు కలిగి ఉందని, మైనింగ్, క్వారీయింగ్ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడు తోతందన్నారు. అయితే, ఇటీవలి సంవత్సరాలలో, మైనింగ్ రంగం నుండి, ముఖ్యంగా కరీంనగర్ ప్రాంతంలో గ్రానైట్ మైనింగ్, క్వారీయింగ్, కటింగ్, పాలిషింగ్, అనుబంధ పరిశ్రమల నుండి ఆదాయంలో గణనీయమైన తగ్గుదల ఏర్పడిరదన్నారు. ఈ క్షీణత రవాణా, విడిభాగాలు, ఉపకరణాలు వంటి సంబంధిత రంగాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేసిందన్నారు. గతంలో కరీంనగర్ ప్రాంతంలో 3000 కంటే ఎక్కువ గ్రాన్కెట్ క్వారీ లీజులు ఉండగా నేడు దాదాపు 600 క్వారీలు మాత్రమే కనీస స్థాయిలో పనిచేస్తున్నాయని, గత దశాబ్దంలో 60% తగ్గిందన్నారు. ఈ దీనికి సంబం ధించిన 2025 యొక్క జీవో నం. 14, 16 ఉపసంహరించు కోవాలని, 2022 యొక్క జీవొ నం. 21 కింద విధించబడిన పర్మిట్ ఫీజులను పూర్తిగా తొలగించడం, డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ఛార్జీలను 10%కి తగ్గించడం, రాయల్టీ రేట్లలో 40% తగ్గింపు వల్ల పరిశ్రమ మళ్లీ గాడిన పడుతుందన్నా రు. కాబట్టి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, ప్రస్తుత విధానాలను సవరించి, గ్రానైట్ పరిశ్రమను పునరుద్ధరించడానికి, వేలాది మంది జీవనోపాధిని కాపాడటానికి ఖనిజ వనరుల అభివృద్ధిలో తెలంగాణ నాయకత్వాన్ని పునరుద్ధరించడానికి సహాయ చర్యలను అమలు చేయాలని కోరారు.

### మృతుల కుటుంబాలకు

# ఎక్స్ గ్రేషియా రూ.కోటి ఇవ్వాలి

- డ్రగ్స్ లాగే కల్తీ కల్లు పై ఉక్కుపాదం మోపాలి
- పట్నం రాష్ట్ర నాయకులు డిజి.నరసింహారావు




**హైదరాబాద్:** కల్తీ కల్లు ఘటనపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నాయకులు డిజి. నర్సింహరావు డిమాండ్ చేశారు. పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటి ఆధ్వర్యం లో నాంపల్లిలోని రాష్ట్రా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిజి.నర్సింహ రావు మాట్లాడుతూ కూకట్పల్లిలో కల్తీ కల్లు ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు 8 మంది చనిపోయినట్లు 42 మంది చికిత్స పొందుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అందులో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన చాలా తీవ్రమైనది. కల్లు కాంపౌండ్ల యాజమాన్యాలు కొందరు లాభాపేక్షతో రసాయనాలతో కృత్రిమంగా కల్లును తయారు చేసి ప్రజలను ఆర్థికంగానూ, అనారోగ్య పరంగాను తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నారు. ఈ ఘటన అందుకు ఒక ఉదాహరణ. పేద ప్రజల మరణాలకు కారణమైన యాజమా న్యాలపై హత్యా నేరం కింద కఠినంగా శిక్షించాలి. ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారులు కల్లు కాంపౌండ్లపై తనిఖీలు చేసినట్లయితే ఈ ఘటన జరిగి ఉండేది కాదు. అందుకని సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవా లని కోరుతున్నాము. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృ తం కాకుండా కల్లు కాంపౌండ్ల పై నిరంతరం తనిఖీలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుచున్నాము. మరణించిన కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని కోరుచున్నాము.

# పట్టపగలే ప్లాట్పై రౌడీల దాడి

- యజమానిని బెదిరిస్తున్న రాజు యాదవ్ ముఠా
- గోపాల్ నగర్లో న్యాయ హక్కుదారుని భూమిపై ఖబ్జా యత్నం





**కూకట్ పల్లి జూలై 11(జనంసాక్షి):** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపాల్ నగర్లో 20 సంవత్సరాలుగా స్వాధీనంలో ఉన్న తమ ప్లాట్పై రౌడీలు దౌర్జన్యంగా దాడి చేసి ఖబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని బాధితుడు పాలడుగు నాగేశ్వర రావు మీడియాకు తెలిపారు.

ప్లాట్ నంబర్ 802ను రిజిస్టర్డ్ డాక్యు మెంట్లతో కొనుగోలు చేసి, గదులు నిర్మించి, ప్రహరీ ఏర్పాటు చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. దీనిపై కరెంట్ కనెక్షన్, మున్సిపల్ టాక్స్, వాటర్ కనెక్షన్, ఎల్ఆర్ఎస్ వంటి అన్ని చట్టబద్ధ ఆధారాలు కూడా ఉన్నాయని చెప్పారు. గతంలోనూ ఫిబ్రవరిలో ఇదే రీతిగా ఖబ్జా యత్నం జరగడంతో పోలీసులు వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నారని, అయితే శుక్రవారం మరోసారి రాజు యాదవ్ అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి వచ్చి ప్లాట్లో ఉన్న వాచ్మెన్ కుటుంబాన్ని చంపేస్తామంటూ బెదిరించి, వారి సామాన్లను రోడ్డుపైకి విసిరేశారని తెలిపారు. ఈ విషయం గురించి మియాపూర్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ సరైన స్పందన లేకపోవడంతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ మహంతికి ఫిర్యాదు చేసినట్లు నాగేశ్వర రావు తెలిపారు. రాజకీయ అండతో రాజు యాదవ్ ఖబ్జా యత్నాలు కొనసాగిస్తున్నాడని, పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరించ డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితుడు పాలడుగు నాగేశ్వర రావు డిమాండ్ చేశారు.

# జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించిన కేటిఆర్



**మొయినాబాద్ జూలై 11 జనం సాక్షి:** ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ నాయకుల తో కలిసి పరామర్శించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హిమాయత్ నగర్ సమీపం లో గల పల్లా రాజేశ్వర్ రెడ్డి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గతకొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు కాలుకు గాయం కావడంతో ఆయన చికిత్స పొంది తన ఫామ్హౌస్ లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జన్మదినాన్ని పురస్కరించుకోని కేటిఆర్ రాష్ట్ర బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, తెలంగాణ తిరుపతిగా పేరొందిన చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ కలిసి ఎమ్మెల్యేను పరామర్శించి పూలబోకే అందజేశారు. ఈ సందర్భంగా కేటిఆర్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీహరియాదవ్, నాయకులు దారెడ్డి వెంకట్ రెడ్డి, జేవంతు, నర్సింహ్మాగౌడ్, పవన్, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడు ఆందోళన చేశాం.. ఇప్పుడు అభివృద్ధి చేస్తున్నాం

- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హులైన లబ్ధిదారులకు న్యాయం.
- కవ్వంపల్లి, మేడిపల్లి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు
- ఎమ్మెల్యే గంగుల.. బిఆర్ఎస్ మాజీ శాసనసభ్యుల మాటలను ఖండించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి



కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 11 (జనంసాక్షి) :

ఆనాడు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీగా ఆందోళన చేశాం, ఈనాడు అధికార కాంగ్రెస్ ప్రభుత్వంగా అభివృద్ధి చేస్తున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ శాసన సభ్యులు కరీంనగర్ జిల్లా అభివృద్ధిపై ఓర్వలేక అనవసర ఆరోపణలు చేస్తున్నారని వాళ్ల పాలనలో అద్భుతాలు సృష్టిస్తే ఇప్పుడు అవన్నీ ఆగిపోయినట్టు మాట్లాడడం విడ్డూరంగా ఉందని పదేళ్లలో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసి మేడిగడ్డ ప్రాజెక్టు కట్టిన తొమ్మిది నెలల్లోనే కూలిపోయినట్టు వీళ్లు చేసిన అభివృద్ధి పనులు అదే విధంగా ఉన్నాయని నరేందర్ రెడ్డి విమర్శించారు. కరీంనగర్ లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అధికారులు పూర్తి చేశారని అందులో అర్హులైన బిఆర్ఎస్, బిజెపి కార్యకర్తలతో పాటు అన్ని పార్టీల వాళ్లు ఉన్నారని టెక్నికల్ గా ఇందిరమ్మ కమిటీ నియామకం కొంత ఆలస్యం అయిందని త్వరలో అందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని నరేందర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నట్టు గతంలో చింతకుంట లోని 640 డబుల్ బెడ్రూం ఇండ్ల విషయంలో ఆందోళన చేసింది వాస్తవమేనని పది సంవత్సరాలలో వాళ్ళు కట్టింది అవి మాత్రమే అని వాటిని కూడా పూర్తి చేసి ఇవ్వలేకపోయారని కాంగ్రెస్ ప్రభుత్వంలో సంవత్సరానికి 3500 చొప్పున అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేస్తున్నామని ఆ 640 డబుల్ బెడ్రూం ఇండ్లను కూడా త్వరలో పూర్తి చేసి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు అందజేస్తామని నరేందర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ముందు ప్రజలను మభ్య పెట్టేందుకు అక్కడక్కడ గుంతలు ఉన్న రోడ్లను తవ్వి పనులు ప్రారంభించినట్టు చూపించి ఓట్లు దండుకున్నారని అవన్నీ ఒకేసారి పూర్తి చేయాలని ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారని నరేందర్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి విషయంలో రాజీపడకుండా ముందుకు వెళుతుందని తప్పకుండా అవి కూడా పూర్తి చేయడానికి కృషి చేస్తుందని అన్నారు. పాత మున్సిపల్ గెస్ట్ హౌజ్ ఏరియాలో నిర్మించిన బిల్డింగ్ పూర్తి చేయకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పూర్తి చేయాలని ఆనాడు ఆందోళన చేస్తే ఆనాటి పాలకులు పట్టించుకోలేదని దాన్ని అందుబాటులోకి తేవడం కోసం 78 లక్షలతో త్వరలో పనులు ప్రారంభించబోతున్నామని నరేందర్ రెడ్డి తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన జేబులో నుండి ఇవ్వనప్పుడు సైకిళ్ల పంపిణీ మోదీ బర్త్ డే గిఫ్ట్ ఎలా అవుతుందన్నారు. ఒకేసారి రెండు వేల సైకిళ్లు ఇవ్వడం వల్ల పిల్లలు ఆ సైకిళ్లు తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడ్డారని సిక్ వాడి దగ్గర ఒక అబ్బాయి అదుపు తప్పి పడిపోవడం వల్ల ఆసుపత్రిలో చేర్పించి తల్లిదండ్రులు చికిత్స అందించారని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ విలేఖరుల సమావేశంలో ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, దన్న సింగ్, దండి రవీందర్, ఆస్తాపురం రమేష్, కుర్ర పోచయ్య, అనిల్ కుమార్, సుదర్శన్, జొన్నల రమేష్, మాసూమ్ ఖాన్, అంజయ్య, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# బోనమెత్తిన చిన్నారులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 11 (జనంసాక్షి) :** వేములవాడలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా,అత్యంత వైభవంగా నిర్వహించా రు. విద్యార్థినీ, విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయాల కనుగుణంగా పోతరాజుల వేషాలు అమ్మవారి అవతారం లు పలువురి ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల పాఠశాలల డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణ మాట్లాడుతూ అమ్మవారి కృప, కటాక్షములు అందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాలల జోనల్ మేనేజర్ సంపత్ కుమార్, పాఠశాలల ప్రిన్సిపల్, విద్యార్థిని, విద్యా ర్థులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి

- కరీంనగర్ టిడిపి అడ్ హాక్ కమిటీ కన్వీనర్, పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జి



కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 11 (జనంసాక్షి) :

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాయని, ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ సంస్థాగతంగా పటిష్టం చేయడంపై దృష్టి సారించిందన్నారు. స్థానిక సంస్థల్లో గాలి తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉందని, స్థానిక ఎన్నికల్లో పార్టీ ప్రభావం ఎంత ముఖ్యమో పోటీ చేసే అభ్యర్థికి ఉన్న ఇమేజ్ కూడా అంతే ముఖ్యమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గ్రామ, మండల, మున్సిపాలిటీల పరిధిలో వ్యక్తిగత ఓటు బ్యాంకు ఉన్న వారంతా పోటీలో ఉండాలని పిలుపునిచ్చారు. మిగిలిన కార్యకర్తలు పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచే కసితో పని చేసి ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. అందుకు ఎన్నికల ప్రణాళిక రూపొందించుకొని రంగంలోకి సన్నద్ధం కావాలన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకుండా ఏ విధంగా గ్రామాల అభివృద్ధిని నిర్వీర్యం చేసిందో గ్రామాలకు ఏ విధంగా ద్రోహం చేసిందో ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలతో చీ కొట్టించాలన్నారు. తెలుగుదేశం పార్టీ అన్ని నియోజకవర్గంలో బలమైన క్యాడర్ కలిగి ఉందని, పార్టీ శ్రేణులు తలుచుకుంటే తెలుగుదేశం పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచే అవకాశం ఉంటుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం కొన్ని పార్టీలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ రోడ్డెక్కి డ్రామాలు చేస్తున్నాయని. నీళ్లు చంద్రబాబుకు, నిధులు ఢిల్లీకి అని కొందరు టిఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి పిచ్చెక్కి మాట్లాడుతున్నారు. తెలంగాణ వచ్చింది, కెసిఆర్ కుటుంబ పాలన జరిగింది, లక్షల కోట్లు తెలంగాణ ప్రజల ఆస్తులను దోపిడీ చేశారు, లక్షల కోట్లు సంపాదించుకున్నారు. కానీ తెలంగాణ ప్రజలకు ఒరుగుపెట్టింది ఏమీ లేదు. మళ్లీ తెలంగాణ సెంటిమెంట్తో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తే పార్లమెంటు ఎన్నికలలో జరిగిన గుణపాఠం స్థానిక సంస్థల ఎన్నికలలో జరుగుతుందన్నారు.

తెలంగాణ ప్రజలు టిఆర్ఎస్ పార్టీని చీకొట్టి తూ అన్న సిగ్గు లేకుండా ప్రవర్తించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ సెంటిమెంట్తో అధికారంలోకి వచ్చి పదేళ్లు పాలన చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో తెలంగాణ ప్రజలకు, అమరవీరులకు చేసింది ఏందో సూటిగా కెసిఆర్ సమాధానం చెప్పాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. చంద్రబాబు అంటే నిప్పు కణం తాకితే మసైపోతారు జాగ్రత్త చంద్రబాబు గురించి మాట్లాడితేనే తెలంగాణలో కెసిఆర్ అధికారం కోల్పోవడం జరిగిందని గుర్తు చేసుకుంటే మంచిది అన్నారు.

టిఆర్ఎస్ వర్గాలు పత్రిక కార్యాలయాలపై దాడులకు దిగడం దుర్మార్గమైన చర్యగా తెలుగుదేశం పార్టీ ఇలాంటి చర్యలను ఖండిస్తుందన్నారు. టిఆర్ఎస్ నాయకులు మళ్లీ అధికారంలోకి రావడానికి ఇలాంటి బరితెగించిన పనులు చేయడం సిగ్గుచేటని అన్నారు. కెసిఆర్ కుటుంబ పాలనను గ్రహించిన ప్రజలు గద్దె దింపిన ఇంకా సిగ్గు రాలేదన్నారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు

**ముస్తాబాద్లో లాటరీ పద్ధతిలో 94 ఇళ్ల మంజూరు : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**ముస్తాబాద్ జులై 11(జనం సాక్షి):** కరీంనగర్ జిల్లాలోని ముస్తాబాద్, గూడెం, కొండాపూర్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు కార్యక్రమం పారదర్శకంగా జరిగిందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. శుక్రవారం ముస్తాబాద్ మండల కేంద్రంలోని మాతృశ్రీ గార్డెన్స్లో జరిగిన లాటరీ పద్ధతిలో 94 ఇందిరమ్మ ఇళ్లను నిరుపేద లబ్ధిదారులకు కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇండ్లు లేని నిరుపేదలకు ఈ రోజు ప్రొసీడింగ్స్ అందజేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. కొండాపూర్లో ఇందిరమ్మ ఇళ్ల వద్ద రోడ్డు, ప్లంబింగ్ పనుల కోసం కలెక్టరేట్ నిధుల నుంచి 30 లక్షల రూపాయలు మంజూరు చేసి, నెల రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు ఇసుక, మొరం సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు వేగంగా పూర్తి చేయాలని, పురోగతి వివరాలను అధికారులు ఆన్లైన్లో అప్డేట్ చేస్తూ, ప్రభుత్వ సహాయం అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల శాఖ మంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో సాండ్ ట్యాక్సీ విధానం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని, 200 మంది యువకులకు వాహనాలు అందించి ఇసుక, మట్టి తరలింపునకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అనంతరం, గూడెం గ్రామంలో నూతనంగా కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కేకే మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ తాలారీ రాణి, హౌసింగ్ శంకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, మండల ప్రత్యేక అధికారి ఎంఎ భారతి, తాసిల్దార్ ఆర్ సురేష్, ఎంపీడీవో బి బీరయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి, లింగంపల్లి ఎల్ల గౌడ్, కొండాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు గంతం రాజు, కరెడ్ల కొండల్ రెడ్డి, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 5 బంతుల్లో... 5 వికెట్లు

## క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన కర్టిస్ కాంఫర్




క్రికెట్‌లో ఒక్క ఓవర్‌లో వికెట్ తీసేందుకు బౌలర్లు ఎంతో కష్టపడతారు. కొన్నిసార్లు ఒకే ఓవర్‌లో రెండు, మూడు వికెట్లు పడగొట్టడం జరుగుతుంది. హ్యాట్రిక్‌లు సాధించిన సందర్భాలు కూడా మనం చూశాం. అయితే, వరుసగా ఐదు బంతుల్లో ఐదు వికెట్లు తీసిన అరుదైన ఘనత క్రికెట్ చరిత్రలో నమోదైంది. ఐర్లాండ్ ఆల్‌రౌండర్ కర్టిస్ కాంఫర్ ఈ అసాధారణ రికార్డును సొంతం చేసుకున్నాడు. ఇంటర్-ప్రావిన్షియల్ టీ20 ట్రోఫీలో జులై 10న డబ్లిన్‌లోని పెంబ్రోక్ క్రికెట్ క్లబ్‌లో నార్త్ వెస్ట్ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మున్‌స్టర్ రెడ్స్ తరఫున ఈ ఘనత సాధించాడు.

189 పరుగుల లక్ష్య ఛేదనలో నార్త్ వెస్ట్ వారియర్స్ 11.4 ఓవర్లలో 87/5 వద్ద ఉంది. ఈ ఓవర్ చివరి రెండు బంతుల్లో కాంఫర్ రెండు వికెట్లు పడగొట్టాడు. తర్వాత 12వ ఓవర్‌లో ఒక పరుగు వచ్చింది, దీంతో వారియర్స్ 13 ఓవర్లకు 88/7 వద్ద నిలిచింది. 14వ ఓవర్‌లో కాంఫర్ మళ్లీ బంతిని అందుకున్నాడు. ఈ ఓవర్‌లో తొలి మూడు బంతుల్లో మూడు వికెట్లు కూల్చి, వారియర్స్‌ను 88 పరుగులకే ఆలౌట్ చేశాడు. ఈ విధంగా, ఒక్క పరుగు తేడాతో వారియర్స్ చివరి ఐదు వికెట్లు కోల్పోయింది. కాంఫర్ దెబ్బకు నలుగురు బ్యాటర్లు డకౌట్ అయ్యారు. ఫలితంగా, కాంఫర్ హ్యాట్రిక్‌తో పాటు వరుసగా ఐదు బంతుల్లో ఐదు వికెట్లు తీసిన తొలి పురుష క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో మున్‌స్టర్ రెడ్స్ 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కాంఫర్ 2.3 ఓవర్లలో 16 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు.

అయితే, ఈ రికార్డును గతంలో మహిళల క్రికెట్‌లో జింబాబ్వే ఆల్‌రౌండర్ కెలిస్ ఎన్‌డీలోవు సాధించింది. 2024లో జింబాబ్వే డొమెస్టిక్ టీ20 టోర్నమెంట్‌లో ఈగల్స్ జట్టుపై ఆమె వరుసగా ఐదు బంతుల్లో ఐదు వికెట్లు తీసింది. ఇంతకుముందు, కాంఫర్ 2021 టీ20 ప్రపంచ కప్‌లో నెదర్లాండ్స్‌పై నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు పడగొట్టిన ఘనత కూడా సాధించాడు.




# బూమ్రా జోరు

- ఇంగ్లాండ్‌ను కుదించిన బుమ్రా
- ఐదు వికెట్లతో లార్డ్స్ టెస్టులో చరిత్ర

లార్డ్స్ టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 387 పరుగులకు ఆలౌట్ అయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ రెండో రోజు ఆటలో జో రూట్ (104) సెంచరీ, బ్రైడన్ కార్స్ (56), జెమీ స్మిత్ (51) హాఫ్ సెంచరీలతో రాణించారు. అయితే, టీమ్ ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (5/74) ఐదు వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్ తలో రెండు వికెట్లు, రవీంద్ర జడేజా ఒక వికెట్ తీశారు. ఓవర్‌నైట్ స్కోర్ 251/4తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లాండ్, మరో 136 పరుగులు జోడించి చివరి ఆరు వికెట్లు కోల్పోయింది. బుమ్రా బెన్ స్టోక్స్ (44), రూట్, క్రిస్ వోక్స్, హ్యారీ బ్రూక్ (11), జోఫ్రా ఆర్చర్‌లను ఔట్ చేసి జట్టును ఆధిపత్యంలో నిలిపాడు. లంచ్ తర్వాత సిరాజ్ స్మిత్, కార్స్‌లను ఔట్ చేసి ఇన్నింగ్స్ ముగించాడు. పేస్‌కు అనుకూలమైన పిచ్‌పై 9 వికెట్లు ఫాస్ట్ బౌలర్లు తీయగా, ఒక వికెట్ జడేజాకు దక్కింది. జెమీ స్మిత్ ఒక్క పరుగు వద్ద ఇచ్చిన క్యాచ్‌ను కేఎల్ రాహుల్ వదిలేయడం జట్టుకు నష్టం చేసింది. స్మిత్, కార్స్ 84 పరుగుల భాగస్వామ్యంతో ఇంగ్లాండ్‌ను 353/7 వద్ద లంచ్‌కు తీసుకెళ్లారు.

**ఐసీసీలో అత్యధిక ఫైవ్-వికెట్ హాల్**

జస్‌ప్రీత్ బుమ్రా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో 12వ సారి ఐదు వికెట్ల ఘనత సాధించి, అత్యధిక ఫైవ్-వికెట్ హాల్ రికార్డు నెలకొల్పాడు, రవిచంద్రన్ అశ్విన్ (11) రికార్డును అధిగమించాడు. అంతేకాక, జో రూట్‌ను టెస్టులలో 11 సార్లు, అంతర్జాతీయ క్రికెట్‌లో 15 సార్లు ఔట్ చేసి, ప్యాట్ కమిన్స్ (14) రికార్డును బద్దలు కొట్టాడు.

**ఫీల్డింగ్ వైఫల్యంతో టీమ్ ఇండియా నష్టం**

ఇంగ్లాండ్ పర్యటనలో టీమ్ ఇండియా ఫీల్డింగ్ వైఫల్యాలు కొనసాగుతున్నాయి. లార్డ్స్ టెస్టు రెండో రోజు తొలి సెషన్‌లో నాలుగు క్యాచ్‌లు వదిలేశారు. ముఖ్యంగా, సిరాజ్ బౌలింగ్‌లో జెమీ స్మిత్ (1) ఇచ్చిన సులభమైన క్యాచ్‌ను కేఎల్ రాహుల్ స్లిప్‌లో వదిలేశాడు. ఈ అవకాశంతో స్మిత్ హాఫ్ సెంచరీ సాధించి, ఇంగ్లాండ్ స్కోర్‌ను పెంచాడు. తొలి రోజు బెన్ డకెట్, ఒలీ పోప్ క్యాచ్‌లను పంత్, గిల్, రాహుల్ వదిలేశారు, ఇది జట్టుకు తీవ్ర నష్టం కలిగించింది.

**శుభ్‌మన్ గిల్ వన్డే కెప్టెన్‌గా?**

జాతీయ మీడియాలో శుభ్‌మన్ గిల్ భారత వన్డే జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌లో గిల్ కెప్టెన్‌గా, టీ20లో వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. రోహిత్ శర్మతో బీసీసీఐ చర్చలు జరిపినట్లు సమాచారం. రోహిత్ టెస్టుల నుంచి తప్పుకోవడం, వన్డేల్లో కొనసాగాలని నిర్ణయించడంతో, 2027 ప్రపంచ కప్ దృష్టిలో గిల్ సారథ్యం గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారి, కొందరు మద్దతు తెలిపితే, మరికొందరు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రోహిత్, కోహ్లీ నవంబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనలో వన్డేల్లో తిరిగి ఆడనున్నారు, అయితే ఫిట్‌నెస్, ఫామ్ వారికి సవాలుగా మారనుంది.

# దేశ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలి

- ఆటగాళ్లకు కుటుంబం ముఖ్యమే
- మనం సెలవుల కోసం విదేశాలకు రాలేదు
- గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు




గత ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా ఘోర పరాభవాన్ని చవిచూడడంతో బీసీసీఐ కొన్ని కఠిన నిబంధనలను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అందులో జట్టు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఎక్కువ సమయం కుటుంబానికి కాకుండా ఆటకే కేటాయించాలని బీసీసీఐ స్పష్టం చేసింది. ప్రస్తుతం టీమిండియా ఇంగ్లండ్ జట్టుతో టెస్ట్ సిరీస్ ఆడుతోంది. ఈ టెస్ట్ సిరీస్ కు ముందు గంభీర్ తన తల్లికి అనారోగ్యం దృష్ట్యా స్వదేశానికి వచ్చి వెంటనే ఇంగ్లాండ్ చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీమిండియా ప్రధాన కోచ్ బీసీసీఐ నిబంధనలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఛతేశ్వర్ పుజారాతో జరిగిన ఇంటర్వ్యూలో కీలక అభిప్రాయాలను పంచుకున్నాడు. ఆటగాళ్లకు కుటుంబం ముఖ్యమే అయినా.. దేశ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలని గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. మనం సెలవుల కోసం విదేశాలకు రాలేదని.. దేశం కోసం ఆడేందుకు వచ్చామని అన్నారు. ఏదైనా పర్యటనకు వెళ్లినప్పుడు డ్రెస్సింగ్ రూమ్‌లో చాలా తక్కువ మందితో ఆడాల్సి ఉంటుందని.. వారితో పని చేసి దేశం గర్వపడేలా చేయాల్సిన బాధ్యత మనపై ఉంటుందన్నారు. కుటుంబానికి సమయం కేటాయించాలి.. కానీ దేశం కోసం ఆడేందుకు వచ్చినప్పుడు దృష్టి అంతా ఇక్కడే ఉండాలన్నారు. తన వరకు ఈ లక్ష్యమే ఎక్కువ అని గంభీర్ చెప్పుకొచ్చాడు. మనకు ప్రతిరోజు పోరాటమేనని.. దేశం కోసం ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ఇది తప్పదన్నాడు. మన విజయాలలో కుటుంబాల పాత్ర కూడా ఎక్కువగా ఉంటుందన్నాడు. ఆటగాళ్ల దృష్టంతా పూర్తిగా ఆటపైనే ఉండాలని ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డారు. గతంలో ఈ బీసీసీఐ నిబంధనపై స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ విభిన్నంగా స్పందించాడు. కాస్త అసహనం కూడా వ్యక్తం చేశాడు. దీని వల్లే కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయి ఉంటాడని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. సురేష్ రైనా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, విదేశీ పర్యటనలకు కుటుంబ సభ్యులను అనుమతించ కూడదని భారత జట్టు యాజమాన్యం విధించిన నిషేధమే కోహ్లీ, రోహిత్ టెస్టు క్రికెట్ నుండి రిటైర్ అవ్వడానికి కారణమని పేర్కొన్నాడు. ఇది మళ్లీ వివాదానికి దారితీసింది. ప్రస్తుతం బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు ఉండి ఉంటే మరిన్ని రికార్డులు సృష్టించేవారని చాలా మంది విమర్శిస్తున్నారు.




# వైభవ్ టీమిండియాలో అరంగేట్రం చేయడం కష్టమే..

భారత క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. ఇంగ్లాండ్‌తో జరిగిన యూత్ వన్డే క్రికెట్‌లో పేలుడు బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించాడు. ఆతిథ్య ఇంగ్లాండ్ అండర్-19తో జరిగిన ఈ సిరీస్‌లో వైభవ్ 5 మ్యాచ్‌ల్లో 355 పరుగులు చేశాడు. ఇందులో 29 సిక్సర్లు, 30 ఫోర్లు ఉన్నాయి. ఇంతటి పేలుడు బ్యాటింగ్ చేసినప్పటికీ, వైభవ్ సూర్యవంశీకి ప్రస్తుతం టీమిండియాలో చోటు దక్కడం కష్టమే.వైభవ్ సూర్యవంశీ.. భారత సీనియర్ జట్టుకు ఎంపిక కావడానికి మరో ఏడాది వేచి చూడాల్సి ఉంటుంది. దీనికి ప్రధాన కారణం ఐసీసీ కొత్త నియమం. వైభవ్ సూర్యవంశీకి ఇప్పుడు 14 సంవత్సరాలు. ఐసీసీ నిబంధనల ప్రకారం, జాతీయ జట్టుకు ఆడే ఆటగాడికి కనీసం 15 సంవత్సరాలు నిండాలి. 2020లో, ఐసీసీ అంతర్జాతీయ క్రికెట్ కోసం కనీస వయస్సు నియమాన్ని రూపొందించింది. దీని ప్రకారమే జాతీయ ఆటగాళ్ళను ఎంపిక చేస్తారు. వైభవ్ సూర్యవంశీ ప్రస్తుత వయస్సు 14 సంవత్సరాలు. అంటే వచ్చే ఏడాది మార్చి 27 నాటికి అతనికి 15 సంవత్సరాలు నిండుతాయి. అప్పుడే అతను జాతీయ జట్టుకు అర్హత సాధిస్తాడు.గతంలో అంతర్జాతీయ క్రికెట్ ఆడటానికి కనీస వయోపరిమితి ఉండేది కాదు. దీని కారణంగా, పాకిస్తాన్‌కు చెందిన హసన్ రాజా కేవలం 14 సంవత్సరాల 227 రోజుల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ప్రస్తుత పరిస్థితిలో, వైభవ్ సూర్యవంశీ ఈ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడం కష్టం.కానీ ప్రస్తుతం భారత టీ20 జట్టులో చోటు కోసం భారీ సంఖ్యలో ఆటగాళ్లు ఎదురుచూస్తున్నారు. అందువల్ల, బీసీసీఐ అలాంటి అభ్యర్థన చేసే అవకాశం లేదు. దీని కారణంగా, వైభవ్ సూర్యవంశీ భారతదేశం తరపున అంతర్జాతీయంగా అరంగేట్రం చేయడానికి కనీసం ఒక సంవత్సరం వేచి ఉండాల్సి ఉంటుంది.


## ఆసియా కప్ 2025 రద్దు అవకాశం

### బీసీసీఐ, శ్రీలంక క్రికెట్ కీలక నిర్ణయం

సెప్టెంబర్ 5 నుంచి జరగాల్సిన ఆసియా కప్ 2025 టోర్నమెంట్ రద్దు అయ్యే అవకాశం కనిపిస్తోంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మరియు శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) జులై 24న ఢాకాలో జరగనున్న ఆసియన్ క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సమావేశానికి హాజరు కాకూడదని నిర్ణయించాయి. ఈ నిర్ణయం టోర్నమెంట్ ప్రారంభానికి రెండు నెలల కంటే తక్కువ సమయం ఉన్న సమయంలో వచ్చింది, దీంతో ఆసియా కప్ భవిష్యత్తు అనిశ్చితంలో పడింది. ఈ టోర్నమెంట్ టీ20 ఫార్మాట్‌లో జరగాల్సి ఉంది, కానీ బీసీసీఐ మరియు ఎస్ఎల్‌సీ ఢాకా సమావేశానికి దూరంగా ఉండటం దాని నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తింది. బీసీసీఐ బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత కారణంగా ఢాకాలో జరిగే ఏసీసీ సమావేశానికి హాజరు కాకూడదని నిర్ణయించింది. ఇటీవల బీసీసీఐ ఆగస్టులో బంగ్లాదేశ్‌లో షెడ్యూల్ అయిన ఆరు వైట్-బాల్ మ్యాచ్‌ల (మూడు వన్డేలు, మూడు టీ20లు) పర్యటనను 2026 సెప్టెంబర్‌కు వాయిదా వేసింది.

## బీసీల 42శాతం రిజర్వేషన్ల అమలు చారిత్రాత్మకం

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్,జులై11(జనం సాక్షి) :** బీసీల 42 శాతం రిజర్వేషన్ అమలు చారిత్రాత్మక నిర్ణయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. మైలార్ దేవ్ పల్లి లోని ఆయన నివాసంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల అంశంపై బీసీల హక్కులు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీసీల పాత్ర అయితే కీలకమని వారి అభ్యున్నతికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు అమలు తీరును సమీక్షించి అవసరమైతే వాటిని మరింత పటిష్టం చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రి గారి గురించి మాట్లాడుతూ ఒక ఓసి బిడ్డ ముఖ్యమంత్రిగా ఉంటూ బీసీల పై ఎనలేని ప్రేమ చూపించారని ఆయన ముఖ్యమంత్రి ని కొనియాడారు అలాగే పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ కూడా ఒక బీసీ పీసీసీ అధ్యక్షుడిగా గా ఉండడం బీసీ లందరికీ గర్వకారణమన్నారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మైలార్ దేవ్ పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ, మాజీ అధ్యక్షుడు ప్రేమ్ గౌడ్, ఎస్. వెంకటేష్, యాదగిరి పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులు పంపిణీ

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయం
- ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి



పెద్దపల్లి,జూలై 11(జనంసాక్షి) : పెద్దపల్లి పట్టణానికి, మరియు మండలానికి సంబంధించిన వివిధ గ్రామాలకు చెందిన 51 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు (రూ 51,05,916/-) 51 లక్షల ఐదు వేల 916 రూపాయల విలువ గల చెక్కులను అలాగే పెద్దపల్లి నియోజకవర్గానికి సంబంధించిన 417 మంది లబ్దిదారులకు రూ 1, 83,52,500/- (1 కోటి 83 లక్షల 52 వేల 5 వందల రూపాయలు) విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణి చేసిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.పేద ప్రజల వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ అనేది తోడ్పాటును అందిస్తుందని పేదల కోసం కడుపునిండా భోజనం చెయ్యాలనే స్వర్గీయ ఎన్టీఆర్ 2 రూ. ప్రవేశపెడితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధనికులతో సమానంగా పేదలు సన్న బియ్యంతో భోజనం చెయ్యాలనే లక్ష్యంతో సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. అలాగే తాను గెలిచిన సంవత్సరం కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో పెద్దపల్లి నియోజకవర్గానికి దాదాపు 1000 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు మంజూరు చేయడం మన అదృష్టమని, ప్రజల దీవెనలతో గెలిచిన తాను ప్రతిక్షణం ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తున్నానని నియోజకవర్గంలో ఎక్కడ అవినీతి లేకుండా పాలన సాగిస్తున్నారని అన్నారు.అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు. పెద్దపల్లి జిల్లాకు రూ.38 కోట్లు సన్న వడ్లకు బోనస్ ఇస్తే, కేవలం పెద్దపల్లి నియోజకవర్గ రైతులకు రూ. 31 కోట్లు బోనస్ చెల్లించామని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు.పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో నూతనంగా ఏర్పాటు చేసిన నవజాత శిశు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 100 మంది చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరిగిందని కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వం ఆసుపత్రి లో అందించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి తహసీల్దార్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు మరియు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు మాజీ ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.



## ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు ఉండాలి

### తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

**నిజామాబాద్ జిల్లా బ్యూరో జులై 11 (జనం సాక్షి) :** బాన్సువాడ పట్టణంలో రూ.37.50 కోట్లతో నూతనంగా నిర్మించే 100 పడకల ఏరియా ఆసుపత్రి విషయంలో నాణ్యతా ప్రమాణలను పాటించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా నూతన భవన నిర్మాణ పనులను శుక్రవారం అయన పరిశీలించారు. అనంతరం పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి ముందర గల జాతీయ రహదారి పనులలో భాగంగా నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ మరియు ఫుట్ పాత్ పనులను అయన పరిశీలించారు. తదనంతరం అయన మాట్లాడుతూ తాను ప్రభుత్వ పరంగా ఏ అభివృద్ధి పని చేపట్టినా నాణ్యత విషయంలో రాజీపడనని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

### పోలేపల్లి రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ అభివృద్ధి పనుల్లో

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

### బొంరాస్ పేట,హకింపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలు తనిఖీ



**బొంరాస్ పేట,దుద్యాల జూలై 11(జనం సాక్షి):** మండల పరిధిలోని హకీంపేటలో నూతనంగా ప్రారంభించిన ఇంటర్మీడియట్ కళాశాల తరగతి గదులను,కళాశాల నిర్మాణ పనులను,పోలేపల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జూనియర్ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... దుద్యాల ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం జూనియర్ కళాశాలను స్థాపించడం జరిగిందన్నారు.సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించి ఉన్నత చదువులు చదివే దిశగా తమ అడుగులు వేయాలని కలెక్టర్ సూచించారు.తమ భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దే దిశగా తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు.ఎంసెట్,ఐఐటి,నీట్ పరీక్షలకు గాను శిక్షణ తరగతులను నిర్వహిస్తామని ఆయన తెలిపారు.హకీంపేటలో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాల భవనాన్ని, పోలేపల్లిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం అభివృద్ధిలో భాగంగా చేపడు తున్న పనులను పరిశీలించి నాణ్యతను పాటిస్తూ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కలెక్టర్ కు ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానం చేశారు.కలెక్టర్ పర్యటనలో ఆలయ కమిటీ చైర్మన్ జయరాం, ఈవో రాజేందర్ రెడ్డి పిఆర్ ఏఈ సురేందర్ రెడ్డి,అధికారులు పాల్గొన్నారు.

బొంరాస్ పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ విద్యార్థులతో మాట్లాడారు.ఆయన వెంట ఎంపీడీవో వెంకన్ గౌడ్,ఎంపీవో రవి నాయక్ గ్రామ పెద్దలు రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

# మాడ్గులలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం

## మెరుగైన వైద్య సేవలకు బాటలు

- కోనాపూర్-మాడ్గుల డబల్ లైన్ రోడ్డు: అభివృద్ధికి కొత్త దారి
- 70 కోట్లతో మాడ్గుల-దేవరకొండ బీటీ రోడ్డు: శంకుస్థాపనతో శుభారంభం
- మంత్రుల హాజరీతో అభివృద్ధి కార్యక్రమాలకు ఊపందం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి: అభివృద్ధిలో కీలక పాత్ర



తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాలలో దేశంలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల కేంద్రంలో 12.70 కోట్ల రూపాయలతో నిర్మించే 30 పడకల ఆసుపత్రి, కోనాపూర్ నుండి మాడ్గుల, మాడ్గుల నుండి దేవరకొండ వరకు 70 కోట్ల రూపాయల వ్యయంతో బీటీ డబల్ లైన్ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్, జ్యోతిరావు పూలే, చాకలి ఐలమ్మ, మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానికులు మంత్రులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో భాగంగా కోనాపూర్ నుండి మాడ్గుల, మాడ్గుల నుండి దేవరకొండ వరకు డబల్ లైన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఉచిత కరెంటు, రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ, రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని వివరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ఇందిరమ్మ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతోందని, సన్న బియ్యానికి 500 రూపాయల బోనస్, ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు జీరో బిల్ కరెంటు, బీసీ కులగణనతో 42 శాతం రిజర్వేషన్ చేపడుతున్నామని పేర్కొన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, మాడ్గులలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని, సంక్షేమ పథకాలతో పేదలకు బాసటగా నిలుస్తూ, మహిళా సాధికారతను సంపూర్ణంగా తీసుకొస్తామని, తెలంగాణను సంక్షేమ ఆదర్శంగా నిలపడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

అనంతరం, మంత్రులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మాడ్గుల మండలంలో 220 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వర రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్ రెడ్డి, పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ యాట గీతా నరసింహా, సూదిని రామ్ రెడ్డి, బట్టు హరికిషన్ రెడ్డి, నాయకులు డోకూరు ప్రభాకర్ రెడ్డి, శతాబ్ది ఫౌండేషన్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌బీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
12 జూలై 2025

# హెచ్‌సిఏలో దొంగలు పడ్డారు

**సంబంధం లేనివారంతా పడి దోచుకున్నారు**

**తెలంగాణ క్రికెట్ అసోషియేషన్ కార్యదర్శి గురువారెడ్డి**



**హైదరాబాద్, జులై 11 (జనంసాక్షి) :** క్రికెట్ అంటే ఏమిటో తెలియని వారితో హెచ్‌సీఏ భ్రష్టపు పట్టిపోయిందని, అవినీతిలో కూరుకుపోయిందని తెలంగాణ క్రికెట్ అసోషియేషన్ కార్యదర్శి గురువారెడ్డి అన్నారు. జగన్మోహన్ రావు అనహర్హుడని వ్యాఖ్యలు చేశారు. క్లబ్‌లో ఉన్నవారు ఎందుకు సహకరించారని నిలదీశారు. బీసీసీఐ ఇచ్చే గ్రాంట్‌ను గ్రౌండ్‌ల అభివృద్ధికి, క్రీడాకారులకు ఉపయోగించాలి కానీ దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. గతంలో ఉన్నట్టు ప్రస్తుతం లేదని.. అలా ఉంటే ప్రతీ సంవత్సరం తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక క్రికెటర్ బయటకి వచ్చేవాడని గురువారెడ్డి అన్నారు. శుక్రవారంఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్మోహన్ నీకు క్రికెట్ అంటే తెలుసా? ఎందుకు ఎలా ఎన్నికయ్యావు' అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామీణ స్థాయిలో ఉన్న క్రికెటర్లకు గత పది సంవత్సరాలుగా గుర్తింపు ఇవ్వలేదన్నారు. తెలంగాణలో క్రికెట్‌కు గుర్తింపు వచ్చే వరకు పోరాడుతామని గురువారెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సిటీకే పరిమితం అయిందన్నారు. హెచ్‌సీఏలో ఎవరు ప్రెసిడెంట్ ఉన్నా అవినీతి జరుగుతోందని విమర్శించారు. ఐపీఎల్ నిర్వహణ కోసం బీసీసీఐ ప్రతీ సంవత్సరం హెచ్‌సీఏకు రూ.100 కోట్ల వరకు ఇస్తుందని ఆయన వెల్లడించారు. దాదాపు ఇప్పటి వరకు రూ.170 కోట్లు- గోల్ మాల్ జరిగిందని ఆరోపించారు. విజిలెన్స్ వారు విచారణ చేయడం.. తర్వాత సీఐడీ ఎంటర్ అవ్వడంతో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు- తెలిపారు. ఫేక్ క్లబ్ క్రియేట్ చేయడం, డాక్యుమెంట్లు- సృష్టించడం అంతా బయటపడిందని గురువారెడ్డి అన్నారు. ఎలక్షన్ కమిషన్ సంపత్ కుమార్ ఎలా ఇతనిని పోటీ చేయించారని ప్రశ్నించారు. జస్టిస్ నాగేశ్వర రావు చెప్పిన వివరాల ప్రకారం అంతకు ముందు నేర చరిత్ర ఉన్నవాళ్ళని కూడా విచారించాలని డిమాండ్ చేశారు. ఏ క్లబ్ కూడా సొంతంగా నడపట్లేదని స్పష్టం చేశారు. క్లబ్‌లలో ఉన్న 217 మంది సభ్యులు అందరూ దొంగలే. పబ్లిక్‌కు సంబంధించిన కోట్ల రూపాయలు ఎలా వాడుకున్నారు. దీని వెనక రాజకీయ నాయకులు ఎవరున్నా అన్నీ బయట పెడతాను. క్యాంటీన్‌ను కూడా ఎవరికి ఇచ్చారు? ఎంత నిధులు తిన్నారు అనే వివరాలు అన్నీ ఉన్నాయి. చాలా మంది దొంగలు ఇందులో ఉన్నారని మండిపడ్డారు.

# హామీని నిలబెట్టుకున్న నేత రేవంత్ రెడ్డి

**42శాతం బిసి రిజర్వేషన్లతో సామాజనిక న్యాయం**

**దేశంలో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది**

**రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ప్రశంసలు**



**ఖమ్మం, జులై 11 (జనంసాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా సిఎం రేవంత్ రెడ్డి తన మాటను నిలబెట్టుకున్న నాయకుడిగా నిలిచాడని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి అన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంపై ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని ప్రశంసలతో ముంచెత్తారు. ఇది రాజకీయ నిర్ణయం కాదని, సామాజికంగా గొప్ప మార్పునకు నాంది అని అభివర్ణించారు. అలాగే, ఇవ్వాళ నాకు చాలా గర్వంగా ఉంది. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రజలందరికీ గర్వపడే రోజులు ఇవని రేణుక పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో సామాజిక న్యాయం సాధ్యమవుతోందని తెలిపారు. ఎవరె-వరో మాటలు చెప్పారు కానీ.. చేసి చూపించింది మాత్రం సీఎం రేవంత్ రెడ్డి అంటూ ఆమె స్పష్టం చేశారు. గురువారం జరిగిన కేబినెట్ తీసుకున్న 42శాతం బీసీ రిజర్వేషన్ నిర్ణయం వల్ల వారికి రాజకీయాల్లోనే కాదు.. ఉద్యోగాల్లోనూ మెరుగైన అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఒక్క సంతకంతో మహిళల జీవితాలను మార్చారు. ఆయన తీసుకున్న నిర్ణయాలతో భర్తలు కూడా గౌరవం చూపించారు. ఇప్పుడు రాహుల్ గాంధీ హయంలో బీసీలకు చరిత్ర సృష్టించే నిర్ణయం తీసుకున్నారు. 42 శాతం రిజర్వేషన్ దేశానికే మార్గదర్శిగా నిలుస్తుందని ఆమె అన్నారు. ఈ నిర్ణయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. నాకు దేశవ్యాప్తంగా మెసేజ్‌లు వస్తున్నాయి. ప్రజలు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. న్యాయం చేయగలిగే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని రేణుకా చౌదరి అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీపై ఆమె విమర్శలు గుప్పించారు. వాళ్లు పూటకోసారి పార్టీ పేరు మారుస్తుంటారు. కేసీఆర్ ఆరోగ్యం బాగుండాలి.. ఎందుకంటే వాళ్లు అలాగే ఉన్నప్పుడు మేము అధికారంలో ఉంటాం. బీఆర్ఎస్‌లో గ్రూపులు ఉన్నాయి. ఎమ్మెల్సీ కవిత గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అని వ్యాఖ్యానించారు. ఇన్ని సంవత్సరాలు నాయకులు చెప్పినవి సొల్లు కబుర్లే.. కానీ ఇప్పుడు రాష్ట్రానికి అసలైన సీఎం లభించడమే గొప్ప విషయం. రేవంత్ రెడ్డి చేసిన నిర్ణయం దేశానికి మార్గం చూపుతుంది. చేతి గుర్తు అన్నది దేశాన్ని ముందుకు నడిపే సత్తా ఉన్న చిహ్నం అని అన్నారు.

## తెలంగాణలో మరో 18 దత్తత కేంద్రాలు, 2 బాలల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**ఫైల్ పై సంతకం చేసిన మంత్రి సీతక్క**

**హైదరాబాద్, జూలై 11 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మరో 18 ప్రత్యేక దత్తత కేంద్రాలు, 2 బాలల సంరక్షణ కేంద్రాలు (చిల్డ్రన్ హోమ్స్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పూర్తి కాగా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆ ఫైల్‌పై శుక్రవారం నాడు సంతకం చేశారు. సీఎం ఆమోదం లభించిన వెంట ఈ కేంద్రాల ఏర్పాటుకు అధికారిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. తెలంగాణలో శిశు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. అనాథలు లేదా తల్లిదండ్రులు వదిలి వేసిన పిల్లలను దత్తత కేంద్రాల్లో సంరక్షిస్తూ, వారికి అన్ని అవసరాలను అందించడంతో పాటు, నిబంధనల ప్రకారం దత్తత ఇచ్చే ప్రక్రియను చేపడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 15 జిల్లాల్లో 17 దత్తత కేంద్రాలు ఉన్నాయి. వీటికి అదనంగా 18 కొత్త కేంద్రాల ఏర్పాటుతో మొత్తం దత్తత కేంద్రాల సంఖ్య 35కి చేరనుంది. పిల్లల అక్రమ విక్రయాలు, అనధికార దత్తతలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. దీనికి కొనసాగింపుగా దత్తత కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్రణాళికల అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పాటయ్యే కేంద్రాల నిర్వహణ, పిల్లల బాగోగుల కోసం ఏటా రూ. 5.44 కోట్లు ఖర్చు అవుతాని తెలంగాణ ప్రభుత్వం అంచనాలు సిద్ధం చేసింది. అందులో 60 శాతం (రూ. 3.26 కోట్లు) కేంద్ర ప్రభుత్వం, మిగిలిన 40 శాతం (రూ. 2.17 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. ఈ కేంద్రాల్లో సేవలందించేందుకు 228 మంది సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ విధానంలో నియమించనున్నారు. ముఖ్యమంత్రి సంతకం అనంతరం ఈ ప్రాజెక్టు అమలు ప్రారంభమవుతుంది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని నిరాశ్రయ పిల్లల భద్రతకు, దత్తత ప్రక్రియ పారదర్శకతకు మరింత బలాన్ని చేకూర్చనుంది.

## హెచ్‌సీఏ అవకతవకలపై లోతైన విచారణ

**నిందితుల కస్టడీకి సిఐడి పిటిషన్**

**హైదరాబాద్, జూలై11 (జనంసాక్షి) :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలపై సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన ఐదుగురు నిందితులు 14 రోజుల రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో నిందితులను మరింతగా విచారించాల్సిన అవసరం ఉందంటూ, తెలంగాణ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)మల్కాజ్‌గిరి కోర్టులో కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేసింది. సీఐడీ తమ పిటిషన్‌లో నిందితులను 10 రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరింది. ఈ కస్టడీ పిటిషన్‌పై నేడు మల్కాజ్‌గిరి కోర్టు విచారణ జరిపనుంది. విచారణ అనంతరం కోర్టు తుది తీర్పు వెల్లడించనుంది. హెచ్‌సీఏ వ్యవహారాలపై విచారణ చేస్తున్న సీఐడీ, అసోసియేషన్ పేరుతో భారీగా అక్రమాలు చోటు-చేసుకున్నట్టు- గుర్తించింది. హెచ్‌సీఏకి వచ్చిన నిధుల దుర్వినియోగం, క్లబ్బులకు జరిగిన నిధుల కేటాయింపు, ఖర్చుల తీరును తేల్చే క్రమంలో అనేక అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జగన్మోహన్ రావు ఈ అవకతవకలకు కీలక సూత్రధారిగా వ్యవహరించినట్టు- అధికారులు భావిస్తున్నారు. బీసీసీఐ, ఐపీఎల్ ఫ్రాంచైజీల నుంచి గత రెండు సంవత్సరాలలో హెచ్‌సీఏకి దాదాపు రూ. 300 కోట్లు- వచ్చినట్టు సమాచారం. ఈ మొత్తంలో ఎన్నికలు, క్లబ్‌లకు నిధుల మంజూరు, ప్రాజెక్టుల కేటాయింపులపై అనేక ప్రశ్నలు నిలుస్తున్నాయి. ఈ అంశాలపై స్పష్టత కోసం సీఐడీ నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించాలని కోరుతోంది. ఈ కేసు నేపథ్యంలో హెచ్‌సీఏలో ఉన్న లోపాలను సమూలంగా పరిష్కరిం చాలని, ఆటతో నడిచే వ్యవస్థలు పారదర్శకంగా ఉండాలని క్రికెట్ అభిమానులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఐ ఈఆలో అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఐఈఆ కేసు వివరాలు ఇవ్వాలని సీఐడీకి ఈడీ లేఖ రాసింది. రిమాండ్ రిపోర్టులు, వాంగ్మూలాలు ఇవ్వాలని లేఖలో సీఐడీని ఈడీ కోరింది. సీఐడీ నుంచి వివరాలు రాగానే కేసు ఈడీ నమోదు చేయనుంది.

## సీఎం ప్రజావాణిలో 281 దరఖాస్తులు

**దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య**



**హైదరాబాద్ (జనం సాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 281 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 67, రెవెన్యూ శాఖకు సంబంధించి 58, విద్యుత్ శాఖకు 24, పౌర సరఫరా శాఖకు 09, ఇందిరమ్మ ఇండ్ల కోసం 44, దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 78 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల దరఖాస్తు తేదీల్లో మార్పులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 607 పోస్టులకు ఈ నెల 10 నుంచి 17వ తేదీల్లో దరఖాస్తులు తీసుకోవాల్సి ఉండగా, డాక్టర్ల విజ్ఞప్తి మేరకు ఈ తేదీల్లో మెడికల్ అండ్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మార్పులు చేసింది. ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకూ దరఖాస్తులు తీసుకోనున్నట్టు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 20 నుంచి బోర్డు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తు సమయంలో బోర్డు వెబ్‌సైట్‌లో అన్ని సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలని పేర్కొంది. మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, కుల ధృవీకరణ, తదితర సర్టిఫికెట్లు తెచ్చుకోవడానికి కొంత సమయం కావాలని డాక్టర్లు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నది.

## యానాంలో చిక్కిన పులస

**కేజీ 15వేలు పలికిన ధర**

**కాకినాడ, జులై11 (జనంసాక్షి) :** పుస్తెలు అమ్మైనా సరే.. పులస తినాలి' అనే నానుడి గోదావరి జిల్లాలో బాగా విపిస్తుంటు-ంది. 'పులస' చేప దొరకడం చాలా అరుదు కాబట్టే.. జీవితంలో ఒక్కసారైనా పులసను తినాలని భావిస్తుంటారు. నదీ ప్రవాహానికి అతి వేగంగా ఎదురీదడం ఈ చేప ప్రత్యేకత. అంతేకాదు ఈ చేప ఎంతో రుచికరంగా కూడా ఉంటుంది. అందుకే వేలంలో ఎంత ధర పెట్టడానికైనా జనాలు వెనుకాడరు. ఇప్పటికే ఎన్నో పులస చేపలు రికార్డు ధరలో అమ్ముడుపోయాయి. గోదావరి నదికి వరదలు వచ్చే సమయంలో పులస చేపల సీజన్ ఆరంభం అవుతుంది. ఈ ఏడాది కూడా గోదావరికి వరద నీటి తాకిడి పెరిగింది. దాంతో పులస చేపల సీజన్ మొదలైంది. ఎర్ర నీరు ఉధృతంగా రావడంతో పులసలు ఎదురీదుతూ వస్తున్నాయి. ఇప్పటికే గోదావరి తీరానికి సమీపంలో ఉండే యానాం ప్రాంతంలో తొలి పులస చేప చిక్కింది. మూడు రోజుల క్రితం యానాం ఫిష్ మార్కెట్‌లో పులస రూ.4000 ధర పలికింది.

# ప్రశాంత వాతావరణంలో బోనాలు

**ఉజ్జయిని బోనాలపై తలసాని సమీక్ష**

**13న సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు**



**హైదరాబాద్, జులై 11 (జనంసాక్షి) :** ఆదివారం జరిగే ఉజ్జయిని మహంకాళి బోనాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. భక్తులు కూడా సహకరించి బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. శుక్రవారం మహంకాళి ఆలయ పరిసరాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మీడియాతో మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలు మన అందరి పండుగ. గొప్పగా చేసుకుందాం. బోనాల సందర్భంగా ఎంతో చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి దర్శనం, బోనాలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటు-న్నాం. 13న తెల్లవారుమున 3 గంటల నుంచే బోనాలు సమర్పించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు- చేశాం. భక్తులు క్యూ లైన్‌లలో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నాం. శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు- చేయడమే కాకుండా, వివిధ ప్రాంతాల నుంచి అదనపు పోలీసు బలగాలను రప్పిస్తున్నాం. భక్తులకు తాగునీరు అందించేందుకు జీహెచ్ఎంసీ వాటర్ వర్క్స్ అధికారులు ఏర్పాట్లు- చేస్తున్నారని చెప్పారు. ఉజ్జయిని మహాకాళి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. బోనాల ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన తలసాని.. మాజీ ఎమ్మెల్యే ప్రసూనతో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కాసేపు సరదాగా మాట్లాడారు. సికింద్రాబాద్ మహంకాళి బోనాల జాతరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు పోలీసులు. జులై 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ మహంకాళి ఆలయ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనదారులందరూ పోలీసులకు సహకరించాలని కోరారు ట్రాఫిక్ పోలీసులు. ట్రాఫిక్ పోలీసులు సూచించిన మార్గంలోనే వాహనదారులు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు పోలీసులు. జులై 13న సీఎం రేవంత్ రెడ్డి మహంకాళి అమ్మవారికి బోనం సమర్పిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం పక్షాన జిల్లా కలెక్టర్,దేవాదాయ శాఖ,పోలీస్ , జీహెచ్ ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు- పూర్తి చేశారు. ప్రభుత్వం ఎన్ని ఏర్పాట్లు చేసిన ప్రజల సహకారం అవసరమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా భక్తులకు ఏర్పాట్లు- చేశామన్నారు. లష్కర్ బోనాలు చారిత్రాత్మక మైనవని చెప్పారు. ప్రజల మంచికొరకు అమ్మవారి ఆశీర్వాదం ఉండాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా బోనాల పండగ సందడి కొనసాగుతోంది..రాష్ట్ర వ్యాప్తంగా బోనాల పండుగ వైభవంగా జరుపుకుంటారు. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో బోనాల పండగ తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా జరుపుకుంటారు. నెలరోజుల పాటు- జరిగే ఈ ఉత్సవాలతో నగరంలో అధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంటు-ంది. గోల్కొండ, లాల్ దర్వాజ, ఉజ్జయిని అమ్మవారి బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఆదివారం జులై 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలతో పాటు వైన్స్ లు కూడా క్లోజ్ చేయాలని ఆదేశించారు.



**ఢిల్లీ వేదికపై తెలంగాణ రాష్ట్ర సంస్కృతీ సాంప్రదాయ ప్రదర్శన**

**లక్షెట్టిపేట జూలై 11 (జనం సాక్షి) :** ఢిల్లీ వేదికపై తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సాంప్రదాయ ప్రదర్శనలో లక్షటిపేట ఉపాధ్యాయుడు దిలీప్ కుమార్ పాల్గొన్నారు.. ఉపాధ్యాయులకు దేశవ్యాప్తంగా ఇచ్చే శిక్షణలో భాగంగా ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడు.. సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ ట్రైనింగ్ న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న రోల్ ఆఫ్ పప్పెట్రీ ఇన్ ఎడ్యుకేషన్ ఇన్ లైన్ విత్ ఎన్ ఈ పి - 2020 దేశంలోని వివిధ రాష్ట్రాల ఉపాధ్యాయుల శిక్షణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి రాష్ట్ర పండుగలు రాష్ట్ర చిహ్నాలు, పుణ్యక్షేత్రాలు, సాహిత్యం- కవులు, ప్రసిద్ధమైన వ్యక్తులు ఇలా తెలంగాణ రాష్ట్ర గొప్ప తనాన్ని చాటి చెప్పేలా ఉపాధ్యాయుల ప్రదర్శన ఆకట్టుకుంది.

# జనాభా నియంత్రణకు సమిష్టిగా కృషి చేయాలి

**కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎక్కువగా చేపట్టాలి**



**జనగామ ప్రతినిది, జూలై 11(జనంసాక్షి):** శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జూలై 11 వ తేదీ ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ర్యాలీని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్ రావు తో కలిసి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. బస్టాండ్ చౌరస్తా నుండి కలెక్టరేట్ వరకు వైద్య సిబ్బందితో జనాభా నియంత్రణపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 1987 లో ఐక్యరాజ్య సమితి జనాభా నియంత్రణకు చర్యలు తీసుకోగా 1989 జూలై 11వ తేదీ నుండి ప్రపంచ జనాభా దినోత్సవం గా పాటించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. జనాభా నియంత్రణ కొరకు 61% లక్ష్యంకు గత సంవత్సరం 54 శాతం సాధించడం జరిగిందన్నారు. ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టి కొత్తగా వివాహం జరిగిన మహిళలను గుర్తించి 23 సంవత్సరం లు ఉండి, ఆరోగ్యవంతురాలిగా ఉన్నప్పుడే గర్భం దాల్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులకు తెలియ చెప్పాలన్నారు. శిశువుకు శిశువుకు మధ్య 3 సంవత్సరముల వ్యవధి ఉండే విధంగా కుటుంబ నియంత్రణకు తీసుకునే చర్యలు వివరించి చెప్పాలన్నారు . గర్భిణీ దాల్చిన నాటినుండి ప్రసవం అయ్యేవరకు పది రోజులకు ఒక్కసారి తప్పనిసరిగా మహిళను సందర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి అందుకు తగినట్లుగా వైద్యం అందిస్తూ రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ...మహిళలు సంపూర్ణ ఆరోగ్య వంతురాలిగా ఉన్నప్పుడు గర్భం దాల్చినట్లయితే గర్భస్రావాల రేటు తగ్గుతుందని, వైద్య సిబ్బంది ఆ దిశగా కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు 32 శాతంగా ఉన్నామని తెలియజేశారు. అనంతరం ఒక పాపతో కుటుంబ నియంత్రణకు కృషిచేసిన కొండ పద్మను ఆదర్శ కుటుంబం గా గుర్తిస్తూ శాలువా కప్పి, మెమెంటో తో పాటు ప్రశంస పత్రాన్ని అందించారు. అదేవిధంగా అత్యధికంగా 700 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన డాక్టర్ శకుంతల, మోటివేషన్ పర్సన్ దీపారాణి, ఉత్తమ సేవలందించిన దేవరుప్పల మండల పి.హెచ్.సి. కి చెందిన ఆశా కార్యకర్త స్వప్న లను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో డాక్టర్ లు, ఏ.ఎన్. ఎమ్. లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదు

**హిందీ నేర్చుకోవడంతో లాభమే తప్ప నష్టం లేదు**

**హిందీ దివస్ కార్యక్రమంలో డిప్యూటి సిఎం పవన్**



**హైదరాబాద్, జులై 11 (జనంసాక్షి) :** విద్య, ఉపాధి, వ్యాపార అవకాశాల కోసం భాషతో సంబంధం లేకుండా ముందుకెళ్తున్న ప్రస్తుత రోజుల్లో హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అలా చేయడం రాబోయే తరాల అభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుందన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజ్య భాషా విభాగం గోల్డెన్ జూబ్లీ వేడుకలకు పవన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హిందీ భాషపై ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం.. బలవంతంగా.. రాష్ట్రాలపై హిందీని రుద్దే ప్రయత్నం చేస్తుందని ఆరోపణలు, విమర్శలు ఉన్నాయి.. అయితే, ఈ తరుణంలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. హైదరాబాద్‌లో నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో పాల్గొని హిందీ వివస్ శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. హిందీని ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం అని వ్యాఖ్యానించారు.. మన దేశం వివిధ సంస్కృతులు ఉంటాయి.. అందరినీ హిందీ ఒక కామన్ భాషగా కలుపుతుందన్నారు.. విదేశస్తులు మన భాష నేర్చుకుంటారు.. మనం హిందీ అంటే ఎందుకు భయపడాలని ప్రశ్నించారు. హిందీ జబర్దస్త్ వస్తువు ఏమీ కాదు.. జర్మనీ, ఇతర భాషలు నేర్చుకుంటున్నాం.. కానీ, హిందీతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.. హిందీ మనది అనడంలో సిగ్గు ఎందుకు..? హిందీ నీ ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం అన్నారు పవన్ కల్యాణ్.. బెంగాలీ గీతం జాతీయ గీతం అయింది.. అబ్దుల్ కలాం మిస్సైల్ మన్ అయ్యారు.. దక్షిణ భారత దేశస్తుడు చేసిన జెండా భారత జెండా అయింది.. ప్రతీ భాష జీవ భాష.. రాష్ట్ర భాష హిందీ.. రాష్ట్ర భాష హిందీని స్వాగతిస్తున్నారు.. మాతృ భాష మన అమ్మ భాష అయితే.. పెద్దమ్మ భాష హిందీగా అభివర్ణించారు.. హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని పరిమితం చేయడమే అవుతుందన్నారు. వేడుకల్లో భాగంగా దక్షిణ సంవాదం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ- ఛైర్మన్ హరివంశ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370